అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 12-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 163 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

అది ఫ్యామిలీ క్యాబినెట్

వారసత్వాలకు పెద్దపీట



- మా త్యాగాన్ని బంధుప్రీతిగా మోడీ విమర్శ
- ఎన్డీఏ మంత్రివర్గంలో ఉన్నదెవరు..? : రాహుల్ నిలదీత

రాయ్‌బరేలీ : ప్రధాని మోడీ తాజా మంత్రివర్గంపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అదొక కుటుంబ మంత్రివర్గమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. తరతరాలుగా సాగుతున్న పోరాటం, సేవ, త్యాగాలను బంధుప్రీతిగా విమర్శించేవారు (మోడీ) తమ మంత్రివర్గంలో వారసత్వాలకు పెద్ద పీట వేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే, 'మాటలకు చేతలకు మధ్య వ్యత్యాసం ఉంటే ఆ వ్యక్తిని నరేంద్ర మోడీ అని అంటారు' అని అన్నారు. మోడీ తన నూతన మంత్రివర్గంలో మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడు కుమారస్వామి, కేంద్ర మాజీ మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ...13లో

25లోపు అఫిడవిట్లు సమర్పించాలి

- తప్పుడు సమాచారమిస్తే చట్టరీత్యా చర్యలు
- త్వరలో కాళేశ్వరం నిర్మాణ సంస్థలనూ పిలుస్తాం : జస్టిస్ పీసీ ఘోష్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై విచారణకు హాజరైన వారంతా ఈనెల 25లోపు అఫిడవిట్లు సమర్పించాలని కాళేశ్వరం జ్యుడీషియల్ ...13లో

సింగరేణిలో 'కారుణ్య' వయోపరిమితి పెంపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో కారుణ్య నియామకాల వయోపరిమితిని 40 ఏండ్ల వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వయోపరిమితి సడలింపు కోసం సింగరేణి కార్మిక కుటుంబాలు చాలా ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సింగరేణి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ అంశాన్ని ...13లో

విమాన ప్రమాదంలో విషాదం

- మాలావి ఉపాధ్యక్షుడు సహా 10మంది మృతి




లిలాంగ్వే : విమాన ప్రమాదంలో మాలావి ఉపాధ్యక్షుడు సాలోస్ క్లాజ్ చిలిమా సహా 10మంది మరణించారు. విమానంలోని వారు ఎవరూ జీవించిలేరని అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా తెలిపారు. జాతినుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ విమానం అడవిలో కూలిపోయిందని ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వారందరూ చనిపోయారని ...13లో

కిలో @50

మళ్లీ ఘాటెక్కిన ఉల్లి

- నిన్నటి దాకా వందకు ఐదు కిలోలు ఇపుడు రెండు కిలోలే..
- పక్షం రోజుల్లో 30-50 శాతం పెరుగుదల
- డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- సబ్సిడీ ధరతో విక్రయించడానికి చొరవ చూపని ప్రభుత్వాలు

ఉల్లి మరోసారి ఘాటెక్కింది. గత పక్షం రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉల్లి ధరలు 30 నుంచి 50 శాతం వరకూ పెరిగాయి. సరఫరా తగ్గటమే దీనికి కారణంగా భావిస్తున్నారు. మరోవైపు బక్రీద్ పండుగ సమీపిస్తుండడంతో ఉల్లికి డిమాండ్ పెరిగింది. నిన్నటి దాకా వందరూపాయలకు ఐదు నుంచి ఏడు కిలోలకు లభ్యమయ్యేది. ఇపుడు కిలో యాభై పలుకుతోంది. డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం కారణంగా ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. దీనికితోడు కొందరు వ్యాపారులు ఉల్లిని నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.



న్యూఢిల్లీ : ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నాసిక్‌లోని లాసాల్‌గాన్ మండిలో గత నెల 25న కిలో ఉల్లిగడ్డ ధర రూ.17 పలకగా సోమవారం అది రూ.26కు చేరింది. నాణ్యమైన ఉల్లి కావాలంటే రూ.30 చెల్లించాల్సి వస్తోంది. ఉల్లిగడ్డలు జూన్ నెల నుండి మార్కెట్‌కు వస్తుంటాయి. రైతులు, వ్యాపారులు వాటిని తమ వద్దే నిల్వ చేస్తారు.

రబీ సీజన్‌లో దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ఉల్లి ధర రూ. 50కి చేరింది. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని వారు ఆశిస్తున్నారు. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు సడలించడంతో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా తదితర దేశాలకు ఉల్లి ఎగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. గత నెలలో ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేసిన తర్వాత నాసిక్ జిల్లా నుండి ప్రతి రోజూ సగటున మూడు వేల టన్నుల ఉల్లిగడ్డలతో కంటైనర్లు తరలిపోతున్నాయని ఓ వ్యాపారి తెలిపారు. దీనివల్ల దేశంలో ఉల్లికి డిమాండ్ పెరిగిందని ఆయన చెప్పారు.

ముఖ్యంగా మహారాష్ట్రలో పండే ఉల్లికి దక్షిణాది రాష్ట్రాల నుండి తీవ్రమైన డిమాండ్ ఉంటోంది. ధరలు పెరిగే వరకూ వారు తమ వద్ద ఉన్న నిల్వలను మార్కెట్‌కు పంపబోరని, అందుకే కృత్రిమ కొరత ఏర్పడి ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయని చెబుతున్నారు.

తెలంగాణలోనూ..

తెలంగాణ జనాభా అవసరాలకు ...5లో

పరీక్షల పవిత్రత దెబ్బతింది

మాకు సమాధానాలు కావాలి

- నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సుప్రీం సీరియస్
- కేంద్రానికి, ఎన్‌టీఏకు నోటీసులు
- జులై 8కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : నీట్ యుజి 2024 పరీక్షా ఫలితాలను రద్దుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి సుప్రీం కోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై మీ స్పందన ఏమిటో తెలియచేయాల్సిందిగా వారిని కోరింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ ఇతర సంబంధిత కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష అయిన నీట్ నిర్వహణపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. పేపర్ లీక్ అయిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌లపై సుప్రీం స్పందించింది. పరీక్షల పవిత్రత దెబ్బతిందని, అందువల్ల దీనిపై తమకు సమాధానాలు కావాలని కోర్టు కోరింది. అయితే అడ్మిషన్ల కోసం జరుగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియను నిలుపు చేయడానికి తిరస్కరించింది. యథాప్రకారం కౌన్సెలింగ్ కొనసాగుతుందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన వెకేషన్ బెంచ్ వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వద్ద పెండింగ్‌లో వున్న పిటిషన్‌తో శివంగి మిశ్రా, తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి జులై 8న విచారిస్తామని తెలిపింది. పరీక్షల నిర్వహణకు



సంబంధించి అవకతవకలు జరిగాయని వివిధ దశల్లో అనేక ఆరోపణలు వచ్చాయి. మార్కుల స్కోర్లలో అనేక వ్యత్యాసాలు వున్నాయని, కొంతమంది విద్యార్థులకు ఉద్దేశపూర్వకంగా ప్రాధాన్యత ఇచ్చారని సుప్రీం విచారించిన తాజా పిటిషన్ పేర్కొంది. మే 5న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి తాజాగా పరీక్షలు నిర్వహించాలని ఆ పిటిషన్ కోరింది. గ్రేస్ మార్కులు కలపడంలో కూడా చాలా తేడాలున్నాయని, వాటిల్లో లాజిక్ కనబడడం లేదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఈ పిటిషనర్లు పేర్కొన్నారు. పైగా పరీక్షా సమయాన్ని కొంత మేరకు కోల్పోవడం వల్లనే ఈ గ్రేస్ మార్కులు కలిపామని కారణం చెబుతున్నారని, ఆ పరీక్షా సమయం ...13లో

ఏపీ రాజధానిగా అమరావతి

ఎన్డీఏ శాసనసభాపక్షనేతగా చంద్రబాబు ఎన్నిక

- ప్రజాతీర్పుతో ఏపీకి పెరిగిన ప్రతిష్ట, గౌరవం



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మంగళవారం ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో.. కూటమి నేతగా ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కూటమి పక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. మన రాజధాని అమరావతి అని అన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తానని, కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఏపీ చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారన్నారు. ఈ తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఏపీని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారని అన్నారు. నూటికి నూరు శాతం మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారన్నారు. ప్రజల మనోభావాల మేరకు కార్యకర్తలు పనిచేశారని కితాబునిచ్చారు. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పుతో ...13లో

జులై 30 వరకు గడువివ్వండి

జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

- జూన్ 15లోపు వివరణ ఇవ్వాలన్న కమిషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్)కు నోటీసులు జారీ చేసింది. వీటిని ఈ ఏడాది ఏప్రిల్ ...13లో





(ఫైల్)

మోడీ మంత్రి వర్గంలో నేరచరితులు..

28మంది మంత్రులపై క్రిమినల్ కేసులు

- అత్యంత సంపన్నుడిగా పెమ్మసాని

న్యూఢిల్లీ : కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన మోడీ మంత్రివర్గంలో 28 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. ఇందులో 19 మంది హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు.. వంటి తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలను ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ఇద్దరు మంత్రులు ఐపీసీ సెక్షన్ 307 కింద హత్యాయత్నం ఆరోపణలున్నాయి. నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్, విద్యా శాఖ, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకంత మజుందర్‌పై ఈ కేసులున్నాయి. హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఠాకూర్, మజుందర్, పెట్రోలియం, సహజవాయువులు, టూరిజం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, ...13లో

విధుల్లో రాణించాలి

సీఎంను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విధుల్లో రాణించాలని ఈ సందర్భంగా సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ట్రైనింగ్‌లో వారికి కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు ...13లో

గాజాలో కాల్పులు విరమించాలి

భద్రతా మండలి తీర్మానం ఆమోదం

వివరాలు 13లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరుగురిపై చార్జిషీట్

పరారీలో ఇద్దరు నిందితులు

- వ్యూహం ప్రకారమే ట్యాపింగ్ చేశారని అభియోగం
- ఇద్దరికి బెయిల్‌పై నేడు నిర్ణయం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొత్తం ఆరుగురు నిందితులపై మంగళవారం నాంపల్లి కోర్టులో కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట స్పెషల్ టీమ్ అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ, ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఛానల్ సీఈఓ శ్రవణ్‌కుమార్‌పై ...13లో

సెమీ రెసిడెన్షియల్స్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : ఎంపీ మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సెమీ రెసిడెన్షియల్స్ పాఠశాలల ఏర్పాటు చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఎంపీ మల్లు రవి చెప్పారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాటిలో ఉపాధ్యాయులు కూడా లేరని తెలిపారు. గత ప్రభుత్వం పాఠశాలలను మూసేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను రద్దు చేయబోమంటూ సీఎం రేవంత్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. విభజన సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు.

నీట్ అక్రమాలపై పోరాడుతాం : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ వేదికగా నీట్ అక్రమాలపై పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గురుకుల, ఏఈఈ అభ్యర్థులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది రాజకీయంగా లబ్ధిపొందేందుకు విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వారికి ఇబ్బందులుంటే తమను సంప్రదించాలని సూచించారు. పదిహేను రోజుల్లో వారి సమస్య పరిష్కరిస్తామన్నారు. సీఎంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమంటూ నిరూపిస్తే తాను బహిరంగ క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు.

ఏఈఈ పోస్టుల భర్తీ ఎందుకు చేయలే?

ట్విట్టర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పుడో పూర్తయినా ప్రభుత్వం ఇంతవరకు అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వకపోవడమేంటని మాజీ మంత్రి టి హరీశ్‌రావు మంగళవారం ట్విట్టర్‌లో ప్రశ్నించారు. గాంధీ భవన్‌వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఏఈఈ అభ్యర్థులకు సంఘీభావాన్ని ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, వివిధ దశల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేసిందని తెలిపారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్చిలో అభ్యర్థుల డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేసినా ఇప్పటికీ ప్రభుత్వం నియామక పత్రాలు ఇవ్వటం లేదని పేర్కొన్నారు.మంత్రులకు, అధికారులకు అభ్యర్థులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఏఈఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

సాధారణ బదిలీలు పారదర్శకంగా జరపాలి

తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం



నవతెలంగాణ బ్యూరో - హైదరా4బాద్

సాధారణ బదిలీలు పారదర్శంగా జరపాలని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం కోరింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రిని ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. పెరిఫెరల్ మెడికల్ కాలేజీలో ఇప్పటికే ఐదేండ్లు మించిన వారికి బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలు ఏడేండ్ల తర్వాత జరుగుతున్నాయని వారు గుర్తుచేశారు. అందుచేత ఎక్కువ మందికి లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బదిలీల్లో హైదరాబాద్‌లో దీర్ఘకాలంగా ఉన్న వారికి విముక్తి కల్పించి బయట వారికి అవకాశం కల్పించాలనీ, అదే సమయంలో బదిలీల్లో హైదరాబాద్ పోస్టింగ్ కోసం పైరవీలు అంగీకరించకూడదని కోరారు. అన్ని రకాల పదోన్నతుల్లో కౌన్సిలింగ్ నిర్వహించాలని వారు మంత్రికి విన్నవించారు. హార్డ్‌షిప్ అలవెన్స్ ట్రైబల్, రూరల్ ప్రాంతాలన్నింటికీ వర్తింపజేస్తూ గిరిజన ప్రాంతాలకు 50 శాతం, మిగిలిన కాలేజీలకు కనీసం 30 శాతం ఉండేలా చూడాలన్నారు.

వారి వినతులకు మంత్రి దామోదర సానుకూలంగా స్పందించారు. గతంలో బదిలీల పాలసీతో నష్టాలు జరిగాయని గుర్తు చేశారు. అలా కాకుండా ఎక్కువ మందికి లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ బొల్లేపాక, ప్రదాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదాల, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ ప్రకాష్, కోశాధికారి డాక్టర్ రమేష్, జోనల్ కార్యదర్శులు డాక్టర్ మంద బాబు, డాక్టర్ గిరిదర్ నాయక్, డాక్టర్ పాల్గున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలకు సంబంధించిన ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో గతనెల 20 నుంచి ఈనెల రెండో తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 (86.03 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13,962 మంది గైర్హాజరయ్యారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 2,36,487 (82.58 శాతం) మంది పరీక్ష రాశారు. 49,894 మంది గైర్హాజరయ్యారు.

బడిగంట మోగుతోంది

- నేటినుంచి పాఠశాలలు పున:ప్రారంభం
- ఇంకా పూర్తి కాని అమ్మ ఆదర్శ పనులు
- సమస్యలతో సర్కారు స్కూళ్లు సతమతం
- బదిలీలు, పదోన్నతుల్లో అధికారులు, పంతుళ్లు బిజీబిజీ
- స్వచ్ఛ కార్మికుల నియామకం ప్రశ్నార్థకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలు బుధవారం నుంచి పున:ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి మంగళవారం వరకు పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. మంగళవారంతో సెలవులు ముగిశాయి. బుధవారం బడిగంట మోగనుంది. వేసవి సెలవులకు బైబై చెప్పి పిల్లలంతా బడిబాట పడతారు. అయితే రాష్ట్రంలో సర్కారు బడులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టినా నామమాత్రంగానే పూర్తయ్యాయి. ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో సర్కారు బడులు సమస్యలతో స్వాగతమిస్తున్నాయి. హన్మకొండ జిల్లాలో మొదటి దశలో 270 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.9.29 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా రూ.2.32 కోట్లు ముందస్తుగా విడుదలయ్యాయి. 226 బడుల్లో పనులు పూర్తయ్యాయి. 46 పాఠశాలల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో 74 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలతోపాటు గురుకులాలున్నాయి. విద్యార్థుల్లేక 16 బడులు గతేడాది మూతపడ్డాయి. 30 అమ్మ ఆదర్శ పాఠశాలలు ఎంపికయ్యాయి.

ఆ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దేశంలోనే అక్షరాస్యతలో పాలమూరు అత్యంత వెనకబడిన జిల్లాగా పేరుంది. గట్టు, ఐజ, అలంపూర్ ప్రాంతాలలో 25 శాతానికి మించి అక్షరాస్యత లేదు. ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు లేక సతమతమవుతున్నాయి. బుధవారం నుంచి బడులు ప్రారంభమవుతున్నా వసతులు పూర్తిస్థాయిలో అధికారులు సిద్ధం చేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రానుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో మరిన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాష్ట్రంలో మొత్తం 26,823 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 21.19 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక జత బట్టలు (యూనిఫారాలు) విద్యార్థులకు అందనజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. 2019-20 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 15 వేల మంది వరకు స్వచ్ఛ కార్మికులను గత ప్రభుత్వం నియమించింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకరి నుంచి ఆరుగురు స్వచ్ఛ కార్మికులు పనిచేశారు. వారికి ప్రభుత్వం నెలకు ఇచ్చే పారితోషికం రూ.2,500 మాత్రమే. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్వచ్ఛ కార్మికుల అవసరమున్నది. ఏడాదికి వారికయ్యే వ్యయం రూ.వంద కోట్లు మాత్రమేనని విద్యాశాఖ అంచనా వేసింది. స్వచ్ఛ కార్మికుల నియామకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బడుల్లో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారనుంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పనులు చేపట్టినా మరుగుదొడ్లు ఎవరు శుభ్రం చేస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇదే విషయాన్ని ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. అయినా ఇప్పటి వరకు స్పష్టత రాలేదు.

ఉపాధ్యాయుల కొరత తీరేనా?

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి కొనసాగుతున్నది. మల్టీజోన్-1 పరిధిలో శనివారం నుంచి ఈనెల 22 వరకు, మల్టీజోన్-2 పరిధిలో శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుంది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తారు. దీంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో బిజీబిజీగా ఉండనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉండే అవకాశమున్నది. డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఆలస్యమవుతుంది. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత తీరేనా?అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఆ తేడా ఎందుకు వచ్చిందో...?

పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసాలు

- 362 స్థానాల్లో లెక్కకు రాని ఐదున్నర లక్షల ఓట్లు
- 176 స్థానాల్లో మిగులు ఓట్లు నమోదు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు ముగిసి కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే అనేక లోక్‌సభ స్థానాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. 362 స్థానాల్లో అక్షరాలా 5,54,598 ఓట్ల తేడా కన్పించింది. అంతేకాదు...176 నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో అదనంగా 35,093 ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఓటింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రెండు రకాల సమాచారాలను 'ది క్వింట్' పోర్టల్ విశ్లేషించింది. మొదటిది... పోలైన ఓట్లు. రెండోది... ఫలితాల రోజు లెక్కించిన ఓట్లు. లోక్‌సభలో మొత్తం 542 స్థానాలు ఉండగా ఏకంగా 538 చోట్ల సమాచారాల మధ్య వ్యత్యాసం కన్పించింది. ఈవీఎంల్లో పడిన ఓట్లు, ఫలితాల రోజు లెక్కించిన ఓట్ల మధ్య స్పష్టమైన తేడా ఉందని 'ది క్వింట్' పోర్టల్ గుర్తించింది.కనీసం 267 నియోజకవర్గాల్లో ఈ వ్యత్యాసం 500 ఓట్ల కంటే ఎక్కువగానే కన్పించింది. ఉదాహరణకు తమిళనాడులోని తిరువల్లూర్ స్థానంలో ఈవీఎంల్లో 14,30,738 ఓట్లు పోలయ్యాయి.

కానీ ఫలితాల రోజు 14,13,947 ఓట్లను మాత్రమే లెక్కించారు. అంటే 16,791 ఓట్ల తేడా వచ్చింది. ఇలా ఎందుకు జరిగిందనే విషయంపై ఎన్నికల కమిషన్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే మాక్ పోలింగ్ డాటాను కంట్రోల్ యూనిట్ నుండి తొలగించకుండా ప్రిసైడింగ్ అధికారులు అసలైన పోలింగ్‌ను ప్రారంభిస్తే ఓట్లలో వ్యత్యాసం వస్తుందని ఉత్తరప్రదేశ్ ఎన్నికల అధికారి తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలైన ఓట్లను ఫారం 17-సీలో తప్పుగా నమోదు చేసినా ఇలా జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారు.

> **ఈవీఎంల్లో ఎక్కువ లేదా తక్కువ ఓట్లు పడడంపై ఎన్నికల కమిషన్ నియోజకవర్గాల వారీగా నిర్దిష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత కన్పిస్తుందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సహ వ్యవస్థాపకుడు జగదీప్ ఛోకర్ చెప్పారు. ఒడిషాలోని జల్‌పూర్‌లో 809 ఓట్లను అదనంగా లెక్కించారు. అక్కడ బీజేపీ అభ్యర్థి రవీంద్ర నారాయణ్ బెహరా 1,587 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.**

లెక్కించిన ఓట్లే అధికం

కారణం ఏదైనప్పటికీ పలు నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలు కన్పించాయి.

అసోంలోని కరింగంజ్‌లో 3,811 ఓట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో 1,467 ఓట్లు, ఒడిషాలోని బాలాసోర్‌లో 1,173 ఓట్లు, మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో 1,089 ఓట్లు, బీహార్‌లోని బక్సర్ స్థానంలో 1,010 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఈ స్థానాలన్నింటిలోనూ ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే అధికారంగా ఉన్నాయి.

అక్కడ ఈవీఎం ఓట్లే అధికం

ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్న నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. తమిళనాడులోని తిరువల్లూరులో 16,791, అసోంలోని కోక్రాఝూర్‌లో 10,760, ఒడిషాలోని ధెన్కానాల్‌లో 9,427, కేరళలోని అలప్పుజాలో 7,928, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 7,928 ఓట్లు ఈ విధంగా తక్కువగా లెక్కింపుకు వచ్చాయి.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

2019 ఎన్నికల్లో కూడా ఈవీఎం ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు బయటపడ్డాయి. దీనిపై ఏడీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాస్తవమైన, కచ్చితమైన ఓటింగ్ సమాచారాన్ని సరిపోల్చుకున్న తర్వాతే తుది ఫలితాన్ని ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరింది. ఈవీఎంలో పడిన ఓట్లను వీవీపాట్ స్లిప్పులతో సరిపోల్చుకోవాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు ఏప్రిల్ 26న తోసిపుచ్చింది. తాము నాలుగు కోట్ల స్లిప్పులను వెరిఫై చేశామని, ఎక్కడా తేడా రాలేదని ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు నివేదించిన తర్వాత ఈ తీర్పు వెలువడింది.

ఈసీ వివరణ కోరుతున్న ప్రజలు

ఈవీఎంలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉంటే ప్రజల మనసుల్లో అనుమానాలు ఏర్పడతాయని ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కృషి చేస్తున్న అంజలి భరద్వాజ్ తెలిపారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన పార్ట్-2 సహా ఫారం 17-సీని పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచితే అనుమానాలకు ఆస్కారం ఉండదని చెప్పారు.

పోలైన ఓట్లకు సంబంధించిన సమాచారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో కన్పిస్తుందని, కాబట్టి సాంకేతికంగా చూస్తే వ్యత్యాసం రాకూడదని, అయినప్పటికీ వస్తే నియోజకవర్గాల వారీగా కమిషన్ వివరణ ఇవ్వాలని ఆమె సూచించారు.

బీజేపీలో సంస్థాగత మార్పులు ?



- కేంద్రమంత్రైన పార్టీ అధ్యక్షుడు నడ్డా
- పదవీకాలం ముగిసిన ప్రధాన కార్యదర్శి సంతోష్
- ఈ రెండు పదవుల భర్తీకి ప్రయత్నాలు
- ఓడిన మంత్రులకూ పార్టీ పనులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి నిరుత్సాహాన్ని కలిగించాయి. ఆ పార్టీ 63 స్థానాలను కోల్పోయింది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీలో భారీ మార్పులు చపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డాను కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకోవడంతో ఆ పదవిని భర్తీ చేయాల్సి ఉంటుంది. పార్టీ వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన మరో పదవి ప్రధాన కార్యదర్శి. పార్టీలో అధ్యక్షుడి తర్వాత రెండో స్థానం ప్రధాన కార్యదర్శిదే. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న బీఎల్ సంతోష్ తన రెండు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. దీంతో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిని కూడా ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది.

గతంతో బీజేపీ అధ్యక్షులుగా వ్యవహరించిన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేరారు. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత వారిద్దరూ పార్టీ పదవుల నుండి వచ్చి ప్రభుత్వంలో సీనియర్ మంత్రులుగా ఎదిగారు. 2019లో నడ్డా బీజేపీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా నియమితులయ్యారు. 2020లో అమిత్ షా స్థానంలో పార్టీ అధ్యక్షుడయ్యారు. అప్పుడు అమిత్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నడ్డా మూడేండ్ల పదవీకాలం గత సంవత్సరం జనవరితోనే ముగిసినప్పటికీ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దానిని పొడిగించారు. కేంద్ర మంత్రిగా నియమితులైనప్పటికీ నడ్డా ఇప్పటి వరకూ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయలేదు. మోడీ ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేతలతో చర్చించి నడ్డా స్థానంలో వేరొకరిని అధ్యక్షుడిగా నియమిస్తారా లేక ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంటును నియమించి, ఆ తర్వాత ఆయనను అధ్యక్షుడిని చేస్తారా అనేది చూడాల్సి ఉంది.

బీజేపీ అధ్యక్ష పదవికి గతంలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు...శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ పేర్లు వినిపించాయి. అయితే వారిని కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడిన భూపేంద్ర యాదవ్, పీయుష్ గోయల్ కూడా మంత్రులయ్యారు. తాజాగా మహారాష్ట్రకు చెందిన వినోద్ తావ్డే పేరు విన్పిస్తోంది.

బీజేపీకి దళితులు, ఓబీసీలు దూరమైన నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తికి పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించే యోచన కూడా చేస్తున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికలు నూతన అధ్యక్షుడికి పరీక్షగా నిలవబోతున్నాయి.లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన 16 మంది కేంద్ర మంత్రులకు కూడా బీజేపీ ఏదో ఒక బాధ్యత అప్పగించాల్సి ఉంటుంది. వారిలో కొందరికి పార్టీ పదవులు కట్టబెట్టవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించినా మంత్రి పదవి కోల్పోయిన అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు సైతం పార్టీ పదవి లభించే అవకాశం ఉంది.

కాలిఫోర్నియా వర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనకారుల నిరసనలు



లాస్‌ఏంజెల్స్ : లాస్‌ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనకారులు సోమవారం పోలీసులతో ఘర్షణ పడ్డారు. కాలేజీ కేంపస్‌లో మూడోసారి శిబిరాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. యూనివర్సిటీలోని డిక్సన్ ప్లాజా పశ్చిమ ప్రాంతంలో ఆందోళనకారులు శిబిరాలు వేసి, బారికేడ్లు ఏర్పాటు చేశారని విద్యార్థుల పత్రిక డైలీ బ్రూయిన్ పేర్కొంది. ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్లకు ప్రతీకగా రక్తమోడుతున్న శరీరపు భాగాల బొమ్మలను పట్టుకుని ఆందోళనకారులు ప్రదర్శన నిర్వహించారు. "మన అమరులను గౌరవిద్దాం" అని వారు నినదించారు. ఇప్పటివరకు 46వేల మందికి పైగా పాలస్తీనియన్లు ఈ మారణహోమంలో మరణించారని ఈ నిరసన ప్రదర్శన నిర్వాహక సంస్థ స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తీనా తెలిపింది. ఈ నిరసనలకు చేతులు కలపాల్సిందిగా ప్రజలను కోరింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతమంతా అలర్ట్ ప్రకటించారు. వెంటనే అక్కడ నుండి వెళ్ళిపోవాల్సిందిగా ఆందోళనకారులను పలుసార్లు ఆదేశించారు. పోలీసు అధికారులు, నిరసనకారుల మధ్య అనేకసార్లు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. రాత్రయిన తర్వాత, వందలాదిమంది పాలస్తీనా అనుకూల ఆందోళనకారులు దాడ్ హాల్ వెలుపల నిలుచుని నినాదాలు చేశారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు.

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ

లోక్‌సభకు ఎన్నికైన ఎగువసభ సభ్యులు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో
రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ అయ్యాయి. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. రాజ్యసభ సెక్రెటేరియట్ ఆ ఖాళీలను నోటిఫై చేసింది. ఇందులో అసోం, బీహార్, మహారాష్ట్రల్లో రెండు, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురల్లో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. రాజ్యసభ సెక్రెటేరియట్ సీట్ల ఖాళీ వివరాలు తెలియజేస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొంది. "కామాఖ్య ప్రసాద్ తాసా, సర్బానంద సోనోవాల్ (అసోం), మిసా భారతి, వివేక్ ఠాకూర్ (బీహార్), దీపేందర్ సింగ్ హుడా (హర్యానా), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్), ఉదయన్‌రాజే భోంస్లే (మహారాష్ట్ర), పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), కేసీ వేణుగోపాల్ (కేరళ), విప్లవ్ కుమార్ దేబ్ (త్రిపుర) ఖాళీలు ఏర్పడ్డాయి. నోటిఫికేషన్ తర్వాత ఈ ఖాళీల భర్తీకి ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తేదీలను ప్రకటించనుంది.

కౌన్ బనేగా ఉప సభాపతి

- బరిలో నిలవాలని ప్రతిపక్షాల నిర్ణయం
- ఈసారైనా ఆపోస్టును భర్తీ చేస్తారా ?



న్యూఢిల్లీ : లోక్‌సభ ఉప సభాపతి పదవికి పోటీ చేయాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. గత లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశాల్లో సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉంటాయి. ఈ సభకైనా డిప్యూటీ స్పీకర్ ఉంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. నూతన లోక్‌సభలో ఇండియా బ్లాక్‌కు 234 మంది సభ్యులు ఉన్నారు. అధికార పక్షానికి సభాపతి పదవి, ప్రతిపక్షానికి ఉప సభాపతి పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇవ్వాలా వద్దా అనేది పాలక పక్షం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.17వ లోక్‌సభ సమావేశాలు అసాధారణ రీతిలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిశాయి. స్పీకర్ ఎన్నిక ముగిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలని రాజ్యాంగం చెబుతోందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచారి తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన పదవి అని, పార్లమెంటరీ వ్యవస్థలో ఉప సభాపతికి రాజ్యాంగం ముఖ్యమైన స్థానాన్ని కల్పించిందని ఆయన చెప్పారు. ఆ పదవికి ఎవరినీ నియమించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.'సాధ్యమైనంత త్వరగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను లోక్‌సభ విధిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది' అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 నిర్దేశిస్తోంది. 'డిప్యూటీ స్పీకర్ పోస్టు రాజ్యాంగ పదవి. అది ప్రతిపక్షానికి చెందుతుంది. తమకు ఆ పదవిని ఇవ్వాలని నూతన లోక్‌సభలో ప్రతిపక్షాలు కోరవచ్చు. అది సభ్యులు ఎన్నుకునే పోస్టు. ముందుగా స్పీకర్‌ను ఎన్నుకోవాలి. వారం రోజుల వ్యవధిలో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలి. ఇది పద్ధతి' అని ఆచారి తెలిపారు. కాగా గతంలో తాము ఉప సభాపతి స్థానాన్ని నిర్వహించామని, ఇప్పుడు కూడా ఆ పదవికి పోటీ చేస్తామని ప్రతిపక్ష నేత ఒకరు చెప్పారు. '2004-2014 మధ్యకాలంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష ఎన్డీఏకు ఇచ్చాము. గతంలో అనేక ప్రభుత్వాలు డిప్యూటీ స్పీకర్ పదవిని ఏకాభిప్రాయంతో ప్రతిపక్షాలకే ఇచ్చాయి' అని ఆయన గుర్తు చేశారు. 1956లో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపక్ష అకాలీదళ్ ఎంపీ సర్దార్ హుకమ్ సింగ్‌ను డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించారు. ఆ తర్వాత వచ్చిన అనేక ప్రభుత్వాలు ఈ సంప్రదాయాన్నే అనుసరించాయి. స్పీకర్ లేనప్పుడు ఆ స్థానంలో డిప్యూటీ స్పీకర్ కూర్చుని సభను నడిపిస్తారు. ఆ సమయంలో స్పీకర్‌కు ఎన్ని అధికారాలు ఉంటాయో డిప్యూటీ స్పీకర్‌కు కూడా అవే అధికారాలు ఉంటాయని నిబంధనలు చెబుతున్నాయి.

మోడీకి చురకలు



నాగపూర్ : 'భిన్నత్వాన్ని అంగీకరించండి. కలిసి జీవించండి. ఇతరులను కూడా గౌరవించండి'....లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నాగపూర్‌లో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్ చెప్పిన మాటలివి. ఎన్నికల సందర్భంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేసిన తప్పుడు ప్రచారంపై కూడా ఆయన తన సుదీర్ఘ ప్రసంగంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రజల్లో సామాజిక ఉద్రిక్తతలు, అనుమానాలకు తావిచ్చిందని చెప్పారు. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాల్సిన అవసరం ఉన్నదని కూడా ఆయన నొక్కి చెప్పారు.

గత నెలలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీజేపీని తాము నడపగలమని, ఆ సామర్థ్యం తమకు ఉన్నదని ఆయన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు చెప్పారు. బీజేపీ సమర్థత తగ్గినప్పుడే ఆర్‌ఎస్‌ఎస్ అవసరం వస్తుందని కూడా తెలిపారు. నడ్డా ప్రకటనపై భగవత్ రాజకీయంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించడంలో బీజేపీ విఫలమైన నేపథ్యంలో సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ అధినేత చేసిన ప్రసంగం బీజేపీకి, ముఖ్యంగా నరేంద్ర మోడీకి చురకలు వేసినట్టు కన్పించింది.

సమాజం ముప్పుగా పరిణమించిందని, మహిళలు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని కూడా భగవత్ చెప్పారు. అయితే ఆయన ప్రసంగంలో అధిక భాగం తన అనుయాయులకు హితవాక్యాలు చెబుతూనే సాగింది. ఎన్నికలు అంటే యుద్ధాలు కావని, ప్రత్యర్థులను విరోధులుగా భావించవద్దని కోరారు. 'ఎన్నికలు అనేవి ప్రజాస్వామ్యంలో అత్యవసరమైన ప్రక్రియ. ఇందులో ఇరు పక్షాలు ఉంటాయి. పోటీ జరుగుతుంది. అయినా దానికి గౌరవం ఉంది. అబద్ధాలు ప్రచారం చేయకూడదు. ఎన్నికైన వారు సభలో ప్రవేశించి దేశాన్ని పరిపాలిస్తారు. ఏకాభిప్రాయం ద్వారా ఆ పని చేస్తారు. పోటీ అంటే యుద్ధం కాదు' అని చెప్పారు. 'జరిగిన పరిణామాలను గమనించాం. ఇరు పక్షాలు నిబంధనలను బేఖాతరు చేసి పరస్పరం దాడి చేసుకోవడాన్ని చూశాం. ప్రచార వ్యూహాలను పూర్తిగా విస్మరించారు. ఇవన్నీ విభజనకు దారితీశాయి. ఈ విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలను అనవసరంగా లాగుతున్నారు' అని వ్యాఖ్యానించారు.

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మోడీ ప్రసంగాలు విద్వేషపూరితంగా సాగిన సంగతి తెలిసిందే. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఆయన మతపరమైన ప్రకటనలు చేశారు. వారిని చొరబాటుదారులుగా, అధిక సంతతి కలిగిన వారుగా చిత్రీకరించి కించపరిచారు. పనిలో పనిగా కాంగ్రెస్‌పై కూడా అసత్య ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో మోడీని ఉద్దేశించే భగవత్ పలు వ్యాఖ్యలు చేసినట్లు కన్పిస్తోంది. 'సేవ చేసేవారు గౌరవంగా వ్యవహరించాలి.

భిన్నత్వాన్ని అంగీకరించాలని భగవత్ హితవు

- విద్వేష ప్రసంగాలు విభజనకు దారితీశాయి
- ప్రత్యర్థులను విరోధులుగా చూడొద్దు
- అహంకారం లేనివాడే నిజమైన సేవకుడు
- ఆర్‌ఎస్‌ఎస్‌ను అనవసరంగా లాగుతున్నారని ఆవేదన

ప్రతి వారూ పనిచేస్తారు. కానీ గౌరవంగా పనిచేయడం అవసరం. గౌతమ బుద్ధుడు చెప్పినట్లు ప్రతి వ్యక్తీ జీవనం కోసం సంపాదిస్తాడు. కానీ దానిని నైపుణ్యంతో చేయాలి. ఇతరులను పక్కకు నెట్టేయకూడదు. గౌరవంగా పనిచేయడం మన సంస్కృతి. అహంకారానికి తావివ్వకుండా పని చేసేవాడే నిజమైన 'సేవకుడు' అని ఆయన అన్నారు.

మణిపూర్ ఘర్షణలను ప్రస్తావిస్తూ పది సంవత్సరాల పాటు ఆ రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నదని, తుపాకీ సంస్కృతి అంతరించిందని అందరూ భావించారని అంటూ ఇప్పుడు నిప్పు రాజేయాలని అనుకున్నది ఎవరని ప్రశ్నించారు. మహమ్మద్ ప్రవక్త, జీసస్ బోధనలు అనుసరణీయమని చెప్పారు. గతాన్ని మరచి పోవాలని, భయాన్ని విడనాడాలని, శక్తివంతులు గా తయారవ్వాలని భగవత్ హితవు పలికారు.

అలవాటు అనే దాన్ని అరికట్టకపోతే, అది అతి త్వరలోనే ఒక అవసరంగా మారిపోతుంది - సెయింట్ అగస్టన్

సంపాదకీయం

స్కాములతో పాలన షురూ..



మోడీ 3.0 సర్కారు ప్రమాణ స్వీకారానికి ముందే విచ్చుకున్న స్కాముల్లో 'నీట్'గా జరిగిన ఈ స్కామొకటి. 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కొత్తగా కొలువు తీరిన ఎన్డీయే ప్రభుత్వం చెలగాటమాడుతోంది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్ఈఈటీ - నీట్)లో జరిగిన భారీ అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఆందోళనకరంగా మర్చాయి. వివిధ కోర్టుల్లో పెద్దఎత్తున దాఖలయిన పిటిషన్లు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

> ఎన్టీఏ అవకతవకలకు పాల్పడిందని చెప్పడానికి మరో బలమైన కారణం ఉంది. అదే ఫలితాల ప్రకటన. వాస్తవానికి నీట్ పరీక్షా ఫలితాలు జూన్ 14న ప్రకటించాలి. కానీ అంతకంటే 10 రోజుల ముందే జూన్ 4న ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండానే ప్రకటించేశారు. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఈ నీట్ అవకతవకలపై ఎవరూ దృష్టిపెట్టరనుకున్నారేమో! కానీ ఇదే పలు అనుమానాలకు తావిచ్చిందని మేధావులు అంటున్నారు. ఈ విషయంలో విద్యార్థులు, కోచింగ్ ఇన్స్టిట్యూట్‌లు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం లక్షలాది మంది కష్టపడి సిద్ధమవుతుంటారు. తమ జీవితంలోని అత్యంత విలువైన క్షణాలను దీని కోసం వెచ్చిస్తారు. కానీ ఈ పరీక్షల్లో ఏటా పేపర్‌లీక్‌లు, ఫలితాల్లో అక్రమాలు పరిపాటిగా మారిపోయాయి. ఫలితంగా లక్షల మంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మిగిలిపోతోంది. అయినా వీటి పట్ల ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు. ఒకవైపు గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చేస్తామంటూ కొంత మంది దగ్గర డబ్బు తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. జూన్ 4న నీట్ ఫలితాలు విడుదలైంది మొదలు పరీక్ష నిర్వహణ సక్రమంగా లేదంటూ అనేక వాదనలు వస్తూనే ఉన్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, మేధావులు వీటిపై ఆవేదన చెందుతూనే ఉన్నారు. అయితే నీట్ పరీక్ష నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)' మాత్రం పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న వాదనలను తోసిపుచ్చుతోంది.

నీట్‌లో మొదటి ర్యాంకు సాధించిన 67 మందిలో ఆరుగురు విద్యార్థులు హరియాణాలోని జఝూర్‌లోని ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాశారు. ఆ తర్వాతి రెండు ర్యాంకులు కూడా అదే కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థులకే వచ్చాయి. ఎన్టీఏ వాదనే నిజమైతే ఇది ఎలా సాధ్యమని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఎన్ని ప్రశ్నలకు, ఎన్ని మార్కులనే లెక్కలకు అంతుచిక్కని రీతిలో కొందరు విద్యార్థులు స్కోర్ సాధించారు. దీనికి ఎన్టీఏ వద్ద సరైన సమాధానం లేదు. నిజానికి ప్రతి ఏడాది మొదటి ర్యాంకులు ఇద్దరు ముగ్గురు సాధించడమే చాలా కష్టం. అలాంటిది ఈ ఏడాది ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు ఎలా వచ్చాయో ఎన్టీఏకే తెలియాలి? ఇంతమంది టాప్ స్కోర్ సాధించడం ఇదే మొదటిసారి. 2023లో ఇద్దరికి మాత్రమే 720/720 మార్కులు వచ్చాయి. ఇక 2022లో ఒక్కరు కూడా పూర్తి మార్కులు సాధించలేదు. ఆ ఏడాది టాపర్లు 720 మార్కులకి గానూ 715 మాత్రమే సాధించగలిగారు. అదేంటో ఈ ఏడాది మాత్రం కొందరికి 718, 719 మార్కులు వచ్చేశాయి. నిపుణులేమో ఇది అసాధ్యమని తేల్చి చెబుతున్నారు.

ఎన్టీఏ అవకతవకలకు పాల్పడిందని చెప్పడానికి మరో బలమైన కారణం ఉంది. అదే ఫలితాల ప్రకటన. వాస్తవానికి నీట్ పరీక్షా ఫలితాలు జూన్ 14న ప్రకటించాలి. కానీ అంతకంటే 10 రోజుల ముందే జూన్ 4న ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండానే ప్రకటించేశారు. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఈ నీట్ అవకతవకలపై ఎవరూ దృష్టిపెట్టరనుకున్నారేమో! కానీ ఇదే పలు అనుమానాలకు తావిచ్చిందని మేధావులు అంటున్నారు. ఈ విషయంలో విద్యార్థులు, కోచింగ్ ఇన్స్టిట్యూట్‌లు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

వీటితో పాటు పేపర్ లీక్ ఆరోపణలు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇప్పటికే బీహార్‌లో ఇదే విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు బీహార్ పోలీసు శాఖ ఆర్థిక నేరాల విభాగం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. అదనపు మార్కుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగలేదని కొందరు భావిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎన్టీఏ మాత్రం అవకతవకలు, పేపర్ లీక్ వంటివేవీ జరగలేదంటూ పదే పదే పాచి పాటే పాడుతోంది. మరోపక్క అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం దీనిపై కనీసం నోరు మెదపడం లేదు. అందువల్ల ఈ అవకతవకల వెనక ఉన్నదెవరో తెలుసుకోవడం అంత కష్టమేమీ కాదు. ఇన్ని అవకతవకలు జరిగిన నీట్ పరీక్షలు రద్దు చేయమంటూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో సుప్రీంకోర్టు తలుపు తట్టారు. న్యాయం చేయాల్సిన సుప్రీం కోర్టు 'కౌన్సెలింగ్ ప్రారంభించండి, మేము కౌన్సెలింగ్‌ను ఆపడం లేదు' అంటూ ప్రకటించింది. ఇప్పుడు విద్యార్థుల వేదన అరణ్యరోదనగా మారిపోయింది.

అంతిమంగా నీట్ పరీక్ష నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందనేది స్పష్టం. ఇప్పుడు లక్షలాదిమంది విద్యార్థుల భవిత గందరగోళంలో పడింది. తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా నీట్ అవకతవకలపై కేంద్రం వెంటనే స్పందించాలి. దీనిపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలి. ఇప్పటికైనా ఎన్టీఏ చేస్తున్న అవకతవకలను నియంత్రించి, మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

నేను సర్కారు బడిని..!



నా గురించి మాట్లాడుకునే యాళ్లయింది. నేనెవరనుకుంటున్నారా? ఇయ్యాల్టి నుంచి బళ్లు షురూ అయితున్నయి కదా! అదే నేను సర్కారు బడిని. ఏనుకట అందరూ నా దగ్గరకి వచ్చి బాగా సదువుకుందురు. నాకాడ సదువుకున్నోళ్లందరూ మంచిగా ఎదిగిన్రు. వాళ్లను సూసినప్పుడు నాకు మస్తు కుషిగా అనిపిస్తది. గానీ గిప్పుడు ప్రయివేటు స్కూల్ అని, టెక్నో స్కూల్ అని, ఇంటర్నేషనల్ స్కూల్‌ల వెనుక తిరుగుతూ నన్ను సరిగా పట్టించుకుంటలేరు. ఏం చేయాలో నాకైతే అర్థమయిత లేదు.

ఇగ నాకు పోటీగా సర్కారోళ్లు గురుకులాలను, మోడల్ స్కూళ్లను, కేజీబీవీలను పెట్టిన్రు.నాకైతే పిల్లలు అందరూ నాదగ్గరే సదువుకుంటే మస్తుగా అనిపిస్తది.మా బడికి వచ్చే సార్లను,మేడంలను ఏమైంది? మన బడికి ఎక్కువ మంది పిల్లలు అత్తలేరు అంటే మన దగ్గరే అన్ని సౌల తులు ఉన్నయి కానీ ఈ జనాలకు అర్థం అయితలే. అందరూ ప్రయివేటు బడులెంట ఉరుకుతున్నరు, గట్ల ఉరికి ఉరికి ఆగమై, పైసలు పోగొట్టుకుంట్రు అంటున్నరు.

మా బడికి మీ పిల్లల్ని ఎందుకు పంపుతలేరని పోరగాండ్ల అయ్యా, అవ్వలను అడిగితే ప్రయివేటు బల్లె పట్టించుకున్నట్టు మీ సర్కారు బల్లే పిల్లల్ని పట్టించుకోరు, మీ బడికి పోరగండ్లను పంపితే ఆగం అయితరు, అయినా సర్కార్ బల్లే ఇంగ్లీష్ మీడియం లేక పంప బుద్ధి అయితలే అనబట్టిరి. అరే గిదేం కిరికిరి? మా బల్లె పట్టించుకున్నట్టు ఎక్కడన్నా పట్టించుకుంటరా మా సార్లు, మేడంలు బాగా చదువుకున్నోళ్లు మంచిగా పాఠాలు చెప్తరు. మా బల్లె ఆటలు పాటలు అన్ని ఉంటయి, ఇగ ఇంగ్లీష్ మీడియం ఎలాగు ఉండనే ఉండే.పోరగాండ్లందరికి ఫ్రీగా బుక్స్ ఇత్తం, యూనిఫామ్స్ కూడా ఇయ్యవడితిమి, పగటిలీ మంచిగా బువ్వ పెడతాం. ఇంకేం కావాలి. అందరినీ మా బడికి పంపుమని చెప్పనయితే చెప్పిన. చూడాలి మరి ఈసారన్నా పంపిస్తారో లేక ప్రయివేటుకే పంపుతరో?

మా పెద్ద సార్‌తో ఈసారి ఎట్లనన్న చేసి మన బడికి ఫుల్‌గా పిల్లలు ఆచ్చేటట్లు చేయాలె సర్ అంటే, 'ఏం జేసుడో ఏమో, బల్లె ఊడ్చేటోళ్లు, గంట కొట్టేటోళ్లు లేరు. అన్ని సబ్జెక్టులకు సార్లు లేరు. ఎల్లదీసుడే ఉన్నది. ఇదివరకటి గవర్నమెంట్ కరెంట్ బిల్లు కట్టడానికి, చాక్పీస్, డస్టర్లకు కూడా సరిగా పైసలు ఇయ్యకపాయే. జేబులకెళ్లి పెట్టుకుంటి. ఎట్ల జేశుడో ఏమో' అనబట్టే.ఇప్పుడున్న సర్కారోల్లు జర మా పెద్ద సారుకు టెన్షన్ లేకుండా బడి మంచిగా నడిపేటట్లు చెయిన్రి.

ఏ మాటకామాట చెప్పుకోవాలి. ఎనుకటికంటే ఇప్పుడు సర్కారు బల్లల్లో సౌలతులు మంచిగా అయినయి. లైబ్రరీ,సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్,అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అన్ని పెట్టిన్రు.జనాలు కూడా జర సోచయించాలే. గివన్ని ప్రయివేటులో ఉంటాయా? జర మీరే చెప్పుండ్రి.పుక్కిడి వస్తే జనాలకు నచ్చడం లేదోమో మరి. మంచిగా మా బడికి పంపక ఇదెందో ఏమో.

పంతుళ్లతో మాట్లాడితే 'ఈ నౌకరీ జేయబట్టి ఇరువై ఏండ్లు అయితుంది ఓ ప్రమోషన్ లేదు ఏం లేదు అయినా ఇదే బల్లె పదేండ్లుగా పనిచేస్తున్న ట్రాన్స్ఫర్ కూడా లేదు ఏం నౌకరో ఏమో అనబట్టిరి.' ఇప్పటికన్నా ఇంకా మంచిగా మావోల్లు పనిచేస్తరు, మంచి రిజల్ట్స్ తెస్తరు అందులో డౌటనుమానం లేదు.ఈ సారి కూడా మన బడిలో టెన్త్ క్లాస్ ఓల్లు అందరూ పాస్ అయింద్రు. 10 జీపీఏ లు కూడా వచ్చినయి. బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు వస్తయని పోరగాండ్లు ఫుల్ ఖుషీగా ఉన్నరు.

అంతట్లకే మా ఎంఈఓ సర్ వచ్చే. 'ఈ బడి బాటేందో నా సావుకొచ్చింది. ఒక్కొన్ని ఎనిమిది మండలాలు తిరుగాలే. ఏం తిరుగుడో ఏమో, ఎప్పుడు ఎక్కడ ఉంటానో, ఏం చేస్తానో నాకే సమజైత లేదు. ఏ బడిలో ఏముందో? ఏం లేదో కూడా నాకు తెలుస్తలేదు.అటు నా బడి సూస్కోవాలి, ఇటు ఎనిమిది మండలాలకు నేనే ఇన్‌ఛార్జినట. ఎట్ల జెసుడో ఏమో, ఈ టెన్షన్ కె నాకు బిపి, షుగర్ వచ్చినయి. అయినా కూడా గోళీలు మింగుకుంటూ తిరుగుతున్న' అనబట్టే.

ఇవన్నీ విన్నంక నాకు అర్థమైంది మా స్కూల్‌కి పిల్లలెందుకు అత్త లేరో. ఇదివరకటి సర్కారు పట్టించుకోలే, ఇప్పుడున్న సర్కారైన పట్టించుకోని బల్లు మంచిగా నడుపడానికి పైసలు, ఊడ్చేటోల్లను, గంటకొట్టెటోల్లను ఇచ్చి,సరిపోయేంత టీచర్లు ఉండేటట్లు చేయాలే.మా సార్లకు, మేడంలకు జర పదోన్నతులు ఇచ్చుడు, బదిలీలు చేసుడు సురువుజెయ్యాలే. పాపం గా ఎంఈఓ సార్లు ఎన్నని తిరుగుతరు? ఎక్కడోల్లకు అక్కడ ఇయ్యలే స్కూల్‌లను, సార్లను సూసుకోవడం.అందరం మనిషికో చేయ్యేస్తే ఏదైనా చేయచ్చు. అందరం గట్టిగా అనుకుంటే గవర్నమెంట్ స్కూల్‌లు మంచిగా నడుస్తయి. సర్కారీ బడి మంచిగా నడిస్తేనే బీద బిక్కి అందరూ బాగా సదువుకుంటరు.

నేను అందరికీ చేతులెత్తి మొక్కుతున్న. మీరందరూ పిల్లలను సర్కారు బడికి పంపుర్రి.సర్కారొల్లు ఫ్రీ బస్ పెడితే ఉరికి ఉరికి ఎక్కుతుండ్రు కదా! మరి ఫ్రీ స్కూల్ అంటే ఎందుకు ఏనుక ముందు ఆడుతుండ్రు.ఇదివరకు మూతబడ్డ బల్లను కూడా సర్కారోళ్ళు ఇప్పుడు మళ్ళీ నడుపుతరట.అన్నింటికీ దగ్గరగా ఉండే మన బల్లెనే మన పిల్లలను చేర్పిద్దాం. మన బడిని బతికించుకుందాం. వింటున్నరా? అన్ని ముచ్చట్లు అయితే ఇగ చెప్పిన. ఇక మీ ఇష్టం. ఉంట మల్ల.

- పాకాల శంకర్ గౌడ్,
9848377734.

ఐరోపా పార్లమెంటు ఎన్నికలు:పెరిగిన నాజీ,ఫాసిస్టుల ముప్పు!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఐరోపా యూనియన్‌లోని 27దేశాలలో జూన్ ఆరు నుంచి తొమ్మిదవ తేదీవరకు జరిగిన యూనియన్ పదవ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఆందోళనకర సూచనలు వెలువడ్డాయి. అధికారికంగా ఫలితాల పూర్తి ప్రకటన వెలువడ లేదు, నాలుగు దేశాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి అందిన సమాచారం, ఫలితాల తీరుతెన్నుల ప్రకారం నయా నాజీ, ఫాసిస్టు, పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ పరిణామం ఐరోపా విధానాలనే తీవ్రంగా ప్రభావితం చేసేదిగా ఉంది. వివిధ దేశాలలో పాలక పార్టీలు, కూటములకు ఎదురుదెబ్బలు తగిలాయి.ఐరోపా సమాఖ్య వైఖరిలో వచ్చే మార్పులు, చేర్పుల గురించి చర్చ ప్రారంభమైంది. ఐరోపా సమాఖ్యకు ఒక స్తంభం వంటి ఫ్రాన్సు మీద పిడుగులా పడి ఇంకా రెండేండ్ల గడువు ఉన్న పార్లమెంటు రద్దుకు దారితీసింది.పాలకపక్షం ఘోరంగా దెబ్బతినటంలో పార్లమెంటును రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపనున్నట్లు అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మక్రాన్ వెంటనే ప్రకటించాడు. అక్కడి రాజ్యాంగం ప్రకారం పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉన్నా ప్రధాని, మంత్రులు వేరే పార్టీకి చెందినవారైనా, అధ్యక్షుడికే సర్వాధికారాలు ఉంటాయి. 2027లో జరిగే అధ్యక్ష ఎన్నికలలో మక్రాన్ పోటీ చేసేందుకు నిబంధనలు అంగీకరించవు. జర్మనీ ప్రతిపక్షం మధ్యంతర ఎన్నికలకు డిమాండ్ చేసింది.అధికార ప్రతిపక్ష సంకీర్ణ కూటమికి ఎదురుదెబ్బ తగిలినా ఎన్నికలకు వెళ్లేది లేదని ప్రకటించింది.

పార్లమెంటులోని మొత్తం 720స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజారిటీ 361 సాధించిన కూటమి ఎంచుకున్న నేత ఐరోపా కమిషన్ అధ్యక్ష పదవిని అధిష్టిస్తారు. కమిషన్ విధానాలను ఐరోపా పార్లమెంటు రూపొందిస్తుంది. ప్రతి దేశానికి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. గత ఎన్నికల్లో 751 స్థానాలుండగా 27 సీట్లున్న బ్రిటన్ ఐరోపా సమాఖ్య నుంచి వైదొలిగినందున వాటిని ఇతర దేశాలకు కేటాయించినప్పటికీ తరువాత వాటికి ఉపఎన్నికలు జరగలేదు. తరువాత 46 స్థానాలను రద్దు చేశారు. తాజా ఎన్నికలకు ముందు ఆమోదించిన విధానం ప్రకారం 705 నుంచి 720కి స్థానాలను పెంచారు. జర్మనీలో 96,ఫ్రాన్స్81, ఇటలీ 76 స్థానాలతో అగ్రభాగాన ఉన్నాయి. మాల్టా, సైప్రస్, లక్జెంబర్గ్ దేశాలలో తక్కువగా ఆరేసి స్థానాల చొప్పున ఉన్నాయి. ఏ దేశానికి ఆదేశం ఎంచుకున్న పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంటులో ఒక పక్షాన్ని గుర్తించాలంటే ఏడు దేశాలలో పోటీచేసి కనీసం 23 స్థానాలను తెచ్చుకోవాల్సి ఉంది. ఆ నిబంధనకు అనుగుణంగా లేని వాటిని గుర్తింపులేని పార్టీలుగా పరిగణిస్తారు.ఈ ఎన్నికల్లో కేవలం 51శాతం మాత్రమే ఓటర్లు పాల్గొన్నట్లు తొలి వార్తలు తెలిపాయి. గరిష్టంగా బెల్జియంలో 89.2, లక్జెంబర్గ్‌లో 82.3శాతం పోలు కాగా క్రోషియాలో అత్యల్పంగా కేవలం 21.3శాతమే ఓటర్లు పాల్గొని ఒక రికార్డు సృష్టించారు. కొన్ని దేశాలలో ఈ సందర్భంగానే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించారు.

ఈ ఎన్నికలలో ప్రస్తుతం సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న ఉర్సులా వాండరె లెయన్ నాయకత్వంలోని యూరోపియన్ పీపుల్స్ పార్టీ(ఇపిపి) 191సీట్లతో పెద్దపక్షంగా అవతరించింది. పచ్చి మితవాదులను అధికారంలోకి రాకుండా నిరోధించగలమని ఆమె చెప్పింది. మరోసారి ఆమె సమాఖ్య అధ్యక్ష స్థానం కోసం పోటీలో ఉన్నారు. ఐరోపా రాజకీయ పరిభాషలో ఇపిపిని మధ్యేవాద మితవాద పార్టీగా పరిగణిస్తారు. ఫ్రాన్సులో మేరీనె లీపెన్ నాయకత్వంలోని పచ్చి మితవాద ఐడెంటిటీ (ఉనికి)- డెమోక్రసీ (ప్రజా స్వామ్య) పార్టీ(ఐడి)కి 57 వచ్చాయి. ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీ నాయకత్వంలోని యూరోపియన్ కన్సర్వేటివ్, రిఫార్మిస్టు (ఇసిఆర్) పార్టీకి 71 వచ్చాయి. ఈ మూడు పక్షాలూ గతం కంటే ఎక్కువ సీట్లు తెచ్చుకున్నాయి. సోషలిస్టు, డెమోక్రాట్స్ కూటమి (ఎస్‌డి) రెండవ పెద్ద పక్షంగా 135 సీట్లు తెచ్చుకుంది. గుర్తింపు పొందని చిన్న పక్షాలు 95 గెలుచుకున్నాయి. గ్రీన్స్ పార్టీ 53, రెన్యూ (పునరుద్ధరణ) యూరోప్ (ఆర్ఇ) 83, ఐరోపా వామపక్ష పార్టీ 35 సీట్లు తెచ్చుకుంది. గత ఎన్నికల్లో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలిగా ఉర్సులా వాండెర్ లెయాన్ అభ్యర్థిత్వాన్ని సమర్థించి గెలిపించిన పార్టీలు తాజా ఎన్నికల్లో 720కి గాను 402 స్థానాలను తెచ్చుకున్నట్లు వెల్లడైంది. అందువలన ఆమె తిరిగి మరోసారి అదే పదవిలో కొనసాగవచ్చు. ఆమె గనుక పచ్చిమితవాద పార్టీల మద్దతుకోసం ప్రయత్నిస్తే తాము దూరంగా ఉంటామని, ఉదారవాద, మితవాద పార్టీల ప్రతినిధులు హెచ్చరించారు. ఆమె బలహీన పడిన గ్రీన్స్, ఇటలీ మితవాది మెలోనీ పార్టీ మద్దతు కోరవచ్చని కొందరు విశ్లేషకులు జోస్యం చెప్పారు.హంగరీలో జాతీయ వాద నేత విక్టర్ ఒర్బాన్ పార్టీ బలం తగ్గినా 44శాతం తెచ్చుకుంది.ఇటలీలో మితవాద ప్రధాని మెలోనీ పార్టీ 30శాతం తెచ్చుకుంది.



> ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈనెల 30,జూలై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మేరీనే లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మరియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చిమితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మరియో వ్యాఖ్యానించింది.

ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈనెల 30,జూలై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మేరీనే లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మరియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చిమితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మరియో వ్యాఖ్యానించింది. వ్యతిరేకులు, పోటీదార్లకు తేడా ఉంది అన్నారు.అయితే ఇప్పటికే మార్చెల్‌తో మేరీ లీపెన్ ప్రతినిధి జోర్డాన్ బార్డెలా సంప్రదింపులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. మక్రాన్ నాయకత్వాన్ని వ్యతిరేకించే మితవాద పార్టీలు మేరీ లీపెన్, మార్చెల్‌తో కలిసే అవకాశాలు ఉన్నాయి. వివిధ పార్టీలలో చీలికలు తెచ్చి తనవైపు తిప్పుకొనేందుకు మక్రాన్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాడు. అతగాడి అధ్యక్ష పదవీకాలం 2027 వరకు ఉంది. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉంటే ఇబ్బంది కనుక వాటిని అడ్డుకొనేందుకు సర్వశక్తులూ వడ్డాలని చూస్తున్నాడు. సోషలిస్టులు, గ్రీన్స్, మరికొన్ని వామపక్ష పార్టీలు కూడా కూటమిగా ఏర్పడేందుకు చూస్తున్నాయి. ఐరోపా యూనియన్ ఎన్నికలలో సోషలిస్టు పార్టీ(పిఎస్)కు 14శాతం ఓట్లు వచ్చాయి.కొన్ని సర్వేల ప్రకారం ప్రస్తుతం ఉన్న సీట్లలో మక్రాన్ నాయకత్వంలోని రినయసాన్స్ పార్టీ(ఆర్ఎన్) సగం స్థానాలను కోల్పోనున్నట్లు వెల్లడైంది.

జర్మనీలో పాలక కూటమిలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్‌పిడి) 13.9శాతం ఓట్లు తెచ్చుకొని మూడవ స్థానంలో ఉంది. పచ్చిమితవాద పార్టీ ఏఎఫ్‌డి 16శాతం తెచ్చుకొని చరిత్ర సృష్టించింది. ప్రతిపక్ష క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్-క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి 30శాతం తెచ్చుకొని ప్రథమ స్థానంలో ఉంది.తూర్పు జర్మనీ ప్రాంతంలో ఎఎఫ్‌డి అగ్రస్థానంలో ఉంది. సంకీర్ణ కూటమిలోని సోషల్ డెమోక్రాట్స్ (ఎస్‌పిడి), పర్యావరణ గ్రీన్స్,ఫ్రీ డెమోక్రాట్స్ పార్టీలు వరుసగా 13.9 -11.9-5.2శాతాల చొప్పున తెచ్చుకొని చావు దెబ్బతిన్నాయి.దీంతో వెంటనే ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.నాలుగింట మూడు వంతుల మంది జనం కూటమి పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని ఎన్నికల సర్వేలు వెల్లడించాయి. జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షల్జ్ బెర్లిన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చినందున మామూలుగా తమపని తాము చేసే అవకాశాలు ఉండకపోవచ్చని అన్నాడు. వచ్చే జాతీయ ఎన్నికల్లో ఓటర్ల అభిమానాన్ని చూరగొనేందుకు ప్రయత్నిస్తామన్నాడు. నూటముప్పై సంవత్సరాల చరిత్రలో ఇంత తక్కువగా ఎస్‌పిడి ఎన్నడూ ఓట్లు తెచ్చుకోలేదు. ప్రత్యామ్నాయ జర్మనీ (ఎఎఫ్‌డి) ఈ ఎన్నికలలో తెచ్చుకున్న ఓట్లతో సుస్థిరం కావటాన్ని అడ్డుకుంటామని, వెనక్కు కొడతామని అన్నాడు. జర్మనీలో, ఐరోపా అంతటా సంప్రదాయ ప్రజాస్వా మిక పార్టీలు ఇప్పటికీ మెజారిటీగా ఉన్నాయని అన్నాడు. ప్రతిపక్షం కోరినట్లుగా మధ్యంతర ఎన్నికలకు వెళ్లే అవకాశం లేదని, గడువు ప్రకారమే జరుగుతాయని షల్జ్ ప్రతినిధి స్టెఫెన్ చెప్పాడు. జాతీయవాదం, విద్వేష ప్రమాదా లను జనం మరచిపోరాదని జర్మనీ అధ్యక్షుడు (మన రాష్ట్రపతి మాదిరి) ఫ్రాంక్ వాల్టర్ స్టెయిమెయిర్ హెచ్చరించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీల మారణకాండకు బలైనవారి గౌరవార్థం ఫ్రాన్సులో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చిమితవాద పార్టీలు ఎదగటాన్ని ప్రస్తావించి జర్మనీలో నేషనల్ సోషలిస్టులు(హిట్లర్ నాజీ పార్టీ) సాగించిన అత్యాచారాలను గుర్తు చేశాడు.

ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో జరుగుతున్న పరిణామాలు,ఐరోపా అంతటా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం వంటి అంశాలన్నింటి కారణంగా మరింత భద్రత కావాలని ఓటర్లు కోరుకున్నారని, దాని మీద పచ్చి మితవాదులు వాగ్దానం చేశారని, ఈ ఎన్నికలు జాతీయ నాయకుల మీద జరిగిన ప్రజాభిప్రాయ వెల్లడి అని ఐరోపా సమాఖ్య విదేశీ సంబంధాల డిప్యూటీ డైరెక్టర్ వెసెలా టెక్నర్‌నెవా అన్నారు.ఐరోపాలో ఫాసిస్టు, నాజీ, పచ్చి మితవాద శక్తులు పుంజుకోవటమే కాదు, తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న ధోరణి కనిపిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో అనేకమంది ఊహించిన మాదిరి అవి ఎక్కువ బలాన్ని పెంచుకోలేదు. మూడోవంతు సీట్లు తెచ్చు కోవటం రానున్న ముప్పును వెల్లడిస్తున్నది.ఇప్పటివరకు అనేక కారణాలతో వివిధ దేశాల్లోని ఈ శక్తుల మధ్య ఐక్యత లేదు, అసంఘటితంగా కూడా ఉన్నాయి.ఎవరికి వారుగానే పని చేస్తున్నారు. మితవాదులు, పచ్చిమితవాదులకు స్వల్పతేడాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న పూర్వ రంగంలో పార్లమెంట్‌లో ఈ శక్తులు కలిస్తే పరిణామాలు ఎలా ఉండేదీ చెప్పలేము. ఒక వేళ అదే జరిగితే వాటిని వ్యతిరేకించే వారందరూ ఒక కూటమిగా ఏర్పడవచ్చు, వారితో వామపక్షాలు కూడా చేతులు కలిపే అవకాశం లేకపోలేదు.పచ్చిమితవాద శక్తులు బలం పుంజుకోవటం వలన పర్యావరణ,వలసలు, ఉక్రెయిన్‌కు సాయంతో సహా విదేశాంగ విధానంలో మార్పుల కోసం పట్టుపట్టవచ్చు, వేగంగా నిర్ణయాలు తీసుకోవటాన్ని అడ్డుకోవచ్చు.

పేదరికమే బాలకార్మికులకు శాపమా?



డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284

ఒక దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రకాలుగా సంక్షేమంతో కూడిన కార్యక్రమాలతో పాటుగా ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య విభాగాలలో ఒక సమానమైన కోణం ప్రధానమైనది. ముఖ్యంగా బాల కార్మికుల వ్యవస్థ అనేక అంశాలపై ఆధారపడి ఉంది. ఇది తీవ్రమైన మానవ హక్కుల సమస్య. ఒకవైపు పేదరికం వెంటాడటం, మరోవైపు ఆర్థిక సమస్యలు దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బాల కార్మికుడు అన్న దానికి సార్వత్రికంగా ఆమోదించిన నిర్వచనం "బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేదా బాలిక పనిచేయడం". బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వని పనిని, స్థితిని బాలకార్మిక వ్యవస్థ అంటారు. పాఠశాలల్లో విద్య అభ్యసించే రోజులతో అక్షర జ్ఞానానికి నోచుకోకుండా భారమైన శ్రమకు బలైపోతున్న బాలల జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి. ఒకరకంగా నాగరికతకే తలవంపుగా పరిణమించాయి. బాలకార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాలకార్మికులు తారసపడక తప్పదు.

ప్రపంచ వ్యాప్తంగా 2000 నాటికి 24కోట్ల60లక్షల బాలకార్మికులు ఉంటే 2012 ముగిసేనాటికి 16కోట్ల 80లక్షల మంది ఉన్నారు. మొత్తం బాలబాలికల జనాభాలో 11 శాతం మంది బాలకార్మికులే. పేద దేశాల్లో ఇది ఎక్కువగా నమోదవుతున్నది. అయితే జనాభా పరంగా చూస్తే అత్యధిక శాతం అధిక జనాభా కలిగిన దేశాలలో గమనించవచ్చు. గత 12 ఏళ్లలో 7కోట్ల80లక్షల మంది బాల కార్మికులు తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయినా 8కోట్ల 50 లక్షలు అంటే 5.4 శాతం మంది ఇంకా ప్రమాదకర పనుల్లో మగ్గుతున్నారు. వీరిలో అత్యధిక శాతం మంది ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోనే ఉన్నారు. అందులో వ్యవసాయ రంగంలోనే అధికంగా 9కోట్ల 80 లక్షల మంది బాల కార్మికులున్నారు. అంటే మొత్తం బాలకార్మికుల్లో 59 శాతం వాటా వ్యవసాయరంగానిదే.



అయితే సేవల రంగం, పారిశ్రామిక రంగాలను విస్మరించరాదు. అసంఘటిత రంగంలోనూ బాల కార్మికులు పనిచేస్తున్నారు.

2001 జనాభా లెక్కల ప్రకారం మన దేశం మొత్తమ్మీద 5 నుంచి 14 ఏండ్ల లోపు వయసులో ఉన్న 1.26 కోట్ల మంది బాల బాలికలు ఆర్థిక కార్యకలాపాల్లో (బాలకార్మికులుగా) ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో పనిచేస్తున్నారు. 2004-05లో జాతీయ నమూనా సర్వే అంచనా ప్రకారం దేశంలో 89 లక్షల మంది బాల కార్మికులున్నారు. 2009-10లో 5-14 ఏళ్ల వయసున్న బాలకార్మికుల సంఖ్య 49.84 లక్షలు. యూనిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతి లోపే బడిమానేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతం దాకా ఉందని సమాచారం. బడి మానేసిన ప్రతి పిల్ల వాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తు న్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

కొన్ని సంస్థల సర్వే ప్రకారం దేశంలో ఆరు కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. అనధికారిక లెక్కలు చూస్తే పది కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాత మంది వివిధ పను ల్లో చెమటోడ్చుతున్నారు. మొత్తం కార్మికుల్లో 4 శాతం మంది బాలలే. ప్రతీ పదిమంది బాలకార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవు తున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు.50 శాతం మంది వారమంతా ఎలాంటి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. అందులో కొంత మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారు.బాలకార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు కూడా మృగ్యమే. తెలిగ్గా మోసానికి గురవడమే కాదు శ్రమదోపిడీకి గురవుతున్నారు. నిర్దిష్ట పని గంటలు లేవు. సెలవులు, బోనస్, పెన్షన్, గ్రాట్యూటీ, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఏ సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతితక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.

సూరత్‌లోని వజ్రాలు చెక్కుడు పరిశ్రమల్లో, శివకాశీలోని అగ్గిపెట్టెలు, బాణాసంచా తయారీ పరిశ్రమల్లోనూ, జైపూర్‌లోని రాళ్ల చెక్కుడు పనిలోనూ, ఫిరోజాబాద్ అద్దాల పరిశ్రమల్లోనూ, మురా దాబాద్‌లోని లోహ పరిశ్రమ ల్లోనూ, అలీఘర్‌లోని తాళాల పరిశ్రమల్లోనూ, మీర్జాపూర్ తివాచీల తయారీ శ్రమల్లోనూ, మార్కాపూర్‌లోని పలకల తయారీ పరిశ్రమలోనూ హీనమైన, హేయమైన వాతావరణంలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమలన్నీ ప్రమాద భరిత పనులకు సంబంధించినవే. ఎంతోమంది పిల్లలు హోటళ్లలోనూ, దుకాణాలలోనూ, గృహాల్లోనూ సేవకులుగా పనిచేస్తున్నారు. వారి శక్తికి మించి అధిక గంటలు పని చేస్తూ అనేక అనారోగ్యాల భారిన పడుతున్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసే పిల్లలు పెద్ద పెద్ద బరువులు మోస్తుంటారు. తరచుగా గాయపడు తుంటారు. కొంత కాలానికి పూర్తిగా శక్తిని కోల్పోతారు. తివాచీ పరిశ్రమలో పనిచేసే బాలలు కంటి చూపును కోల్పోతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడేవారు అనేకం. కాశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్‌లోని గ్లాస్, గాజుల పరిశ్రమలో పనిచేసే పిల్లలు ఆస్తమా, బ్రాంకైటిస్, కంటి సంబంధించిన రోగాలకు సతమతమవుతున్నారు. శివకాశీలో టపాకాయల పరిశ్రమలో పనిచేసే బాలలు రోగాలతో పాటు పేలుడులాంటి ప్రమాదాలకు బలైపోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే బాలలు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ యంత్రాలతో పనిచేసే వారు సరైన శిక్షణ, సరైన భద్రత లోపించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

బాల కార్మికులుగా చిన్నారులు మారడానికి కారణాలను పరిశీలించినట్లయితే తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా కుటుంబ అవసరాల కోసం పనిచేయాల్సిన దుస్థితి. పిల్లల్ని అదనపు ఆదాయం తెచ్చేవారిగా పేద కుటుంబాలు భావిస్తున్నాయి. ఎక్కువమంది తల్లితండ్రులు నిరక్ష్య రాస్యులు కావడం పిల్లల భవిషత్తు ప్రశార్థకంగా మారుతోంది. ఆర్థిక పరిస్థితి, అవగాహనాలోపం వల్ల ప్రాథమిక విద్యను కూడా అందించలేకపోతున్నారు. సాంఘిక ఆర్థిక స్థితిగతులు (కుటుంబ పరిమాణం, నిరుద్యోగిత మొదలైనవి) బాలకార్మిక వ్యవస్థ వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రధాన లోపంగా చెప్పవచ్చు.భారీ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల పల్లెల నుంచి పట్టణాలకు వలసెళ్లడం. గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి లేక పొట్టకూటి కోసం వలసెళ్లిన చోట పిల్లలను చదివించే పరిస్థితి ఉండదు. వారు కూడా బాలకార్మికులుగా మారడం అనివార్యమవుతున్నది. దీనికి తోడు ప్రస్తుత విద్యావిధానంపై అవగాహన కల్పించకపోవడం, పేద కుటుంబాలకు ఉపాధి కల్పించకపోవడం ప్రభు త్వాల ఘోర వైఫల్యం. అదే విధంగా పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరంగా చూడకపోవడం, ఇది సాధారణ విషయంగా ప్రస్తుత సమాజం భావించడం ఈ వ్యవస్థ బలోపేతం కావడానికి మరో కారణం. పలక, బలపం పట్టాల్సిన చేతులు పలుగు, పార పట్టడం అత్యంత శోచనీయం. దీనికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవడం, వారిని చక్కదిద్ది బడికి పంపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. అంతేకాదు బాల కార్మికులు పనిచేసే ప్రతిచోటా పౌర సమాజం కూడా దీన్ని వ్యతిరేకించడం, అవసరమైన దగ్గర ఉద్యమించడం చేయాలి. అప్పుడే ఈ పరిస్థితి నుంచి కొంతైనా బయటపడగలం.భావి భారత పౌరుల ముఖాల్లో వెలుగుల్ని చూడగలం.

(నేడు ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం)

మున్సిపల్ కార్మికుల పొట్టగొట్టొద్దు

- జీవో నెంబర్ 970ని ఉపసంహరించుకోవాలి
- రెండో పీఆర్సీలో ఫైనల్ చేసిన జీవోల ప్రకారం వేతనాలివ్వాలి
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'జీఓఆర్‌టీ నెంబర్ 970 ప్రకారం మున్సిపాల్టీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలనీ, ఏటా రెన్యూవల్ చేసుకోవాలని చెప్పడం సరిగాదు. దీనివల్ల మళ్లీ ఏజెన్సీల కాంట్రాక్టు దందా ప్రారంభమవుతుంది. కార్మికులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వ ఖజానాకు గండి పడే ప్రమాదముంది. ఇలా నష్టం చేకూర్చే చర్యలు తీసుకుని కార్మికుల పొట్టగొట్టొద్దు' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు కోరారు. వెంటనే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దానకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దానకిశోర్ స్పందిస్తూ జీవోలను సవరించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్, కార్యదర్శి పి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలను దానకిశోర్ దృష్టికి వారు తీసుకెళ్లారు. ఆన్‌లైన్ ద్వారా పన్నులు వసూలుతో పనులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం డ్యూటీలు వేయాలనీ, అనారోగ్యానికి గురైన కార్మికుని స్థానంలో అతని కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మినహా రాష్ట్రంలో 30,812 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో 15 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి పనులను మున్సిపల్ కమిషనర్లే పర్యవేక్షిస్తున్నారనీ, మున్సిపల్ కార్మికులతో గ్రూపులు ఏర్పాటు చేసి గ్రూపుల ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. థర్డ్ పార్టీకి ఆ బాధ్యతలు అప్పగిస్తే సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం, ఈఎస్ఐ, పిఎఫ్‌లు చెల్లించకపోవడం, కార్మికులను తొలగించి వారి స్థానంలో లక్షల రూపాయలు డబ్బులు తీసుకొని కొత్త కార్మికులను నియమించుకోవడం, తక్కువ మందిని నియమించి ఎక్కువ మంది పేర్లతో బిల్లులు తీసుకోవడం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయని వివరించారు. కార్మికులపై వేధింపులు కూడా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుండుగుత్తగా అందరికీ ఒకేలా వేతనాలను వర్తింపజేయడం సరిగాదన్నారు. పీఆర్సీలో చేసిన సిఫారసుల ప్రకారం వివిధ కేటగిరీలకు వేర్వేరుగా వేతనాలివ్వాలని కోరారు. జీవో నెంబర్ 4కు వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్న సమయంలో గతంలో జరిగిన తప్పిదాన్ని సరిదిద్దకుండా జీవో 970 జారీ చేయడం దారుణమన్నారు. అన్ని కేటగిరీలకు ఒకే వేతనం చెల్లించడం సరిగాదన్నారు. నూతన పిఆర్‌సిలో కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని కోరారు.

గ్రేటర్‌లో భారీ వర్షం

- నగరాన్ని కమ్మేసిన మేఘాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరాన్ని సాయంత్రం తరువాత ఒక్కసారి మేఘాలు కమ్మేశాయి. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కాప్రా, దమ్మాయిగూడ, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కొంపల్లి, జీడిమెట్ల, దుండిగల్, జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, నిజాంపేట్, మియాపూర్, బేగంపేట్, ముషీరాబాద్, ఓయూ, తార్నాక, సరూర్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో సైతం వర్షం కురిసింది. ఎల్బీనగర్, ఉప్పల్, కాప్రా, మేడ్చల్‌లో కూడా భారీ వర్షం పడింది. పలుచోట్ల హైదరాబాద్ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం కారణంగా పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది.

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో..

హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న మున్సిపాల్టీలు, శివారులో ఉన్న కార్పొరేషన్లలో వర్షం దంచి కొట్టింది. బోడుప్పల్, పీర్జాదిగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ, ఆదిభట్ల, మేడ్చల్, బొంగులూరులో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. నాచారం, మల్లాపూర్‌లో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. సూరారం, జీడిమెట్ల, షాపూర్‌నగర్, సుచిత్ర సెంటర్, నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్ ఏరియాల్లోనూ వర్షం భారీగా కురిసింది.

ముందే చెప్పిన వాతావరణ శాఖ

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారమే వెల్లడించింది. సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం పడే ఛాన్స్ ఉందని తెలిపింది. రానున్న 48 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని అలెర్ట్ సైతం జారీ చేసింది. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావారణ శాఖ చెప్పింది.

బడులు తెరిచిన రోజే యూనిఫారాలు



- విద్యార్థులకు అందించనున్న ప్రభుత్వం
- దేశంలో కొత్త ఒరవడికి రేవంత్ సర్కారు శ్రీకారం
- కుట్టు కూలీ జతకు రూ.50 నుంచి రూ.75కు పెంపు
- మహిళా సంఘాలకు యూనిఫారాల బాధ్యతలు
- గడువులోపు పనులు పూర్తయ్యేలా పంచాయతీరాజ్ శాఖ మంత్రి చొరవ
- సీఎం రేవంత్‌రెడ్డికి మహిళా సంఘాల తరపున సీతక్క ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫారాలు సిద్ధమయ్యాయి. బడులు తెరిచిన రోజే యూనిఫారాలను విద్యార్థులకు పంపిణీ చేయనుంది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేయనున్నారు. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు యూనిఫారాల కుట్టు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. గతంలో యూనిఫారాల కుట్టు బాధ్యతలను పరిమిత సంఖ్యలో టైలర్లకు అప్పగించడం వల్ల ఆలస్యమయ్యే పరిస్థితి ఉండేది. పాఠశాలలు ప్రారంభమైన మూడు, నాలుగు నెలల వరకు విద్యార్థులకు అందేవి. ఈ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలకు యూనిఫారాల కుట్టు బాధ్యతను అప్పగించింది. దీంతోపాటు కుట్టు కూలీని రూ.50 నుంచి రూ.75కు పెంచింది. దీంతో మహిళా సంఘాలు యూనిఫారాలను సవాల్‌గా తీసుకుని సకాలంలో పూర్తి చేశాయి. రాష్ట్రంలో 64 లక్షల మంది మహిళా సంఘ సభ్యులున్నారు. 18 వేల విలేజ్ ఆర్గనైజేషన్లున్నాయి. వారికి 15,30,603 (ఒకజత) యూనిఫారాలను కుట్టాలని ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటి వరకు 90 శాతం వరకు యూనిఫారాలు సిద్ధమయ్యాయి. సుమారు రూ.50 కోట్లు కుట్టు ఆదాయం ఏటా మహిళా సంఘాలకు సమకూరుతుంది.

మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ

మహిళా సంఘాలకు యూనిఫారాల కుట్టు పనులను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించినప్పటి నుంచి సకాలంలో పనులు పూర్తయ్యేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. ఎప్పటికప్పుడు అధికారులు, మహిళా సంఘాలను సమన్వయపరుస్తూ గడువులోగా పాఠశాలలకు యూనిఫారాలు చేరేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బడులు తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు యూనిఫారాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్నది. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులను మంత్రి అభినందించారు. భవిష్యత్‌లో కూడా మహిళా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదాయం పెంచే పనులను అప్పగిస్తామని తెలిపారు. రెండో జత యూనిఫారాలను కుట్టే బాధ్యతను అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇతర ప్రభుత్వ కుట్టే పని కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని వివరించారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి సీతక్క కలిసి మహిళా సంఘాల తరపున ధన్యవాదాలు తెలిపారు.

కిలో @ 50

(మొదటిపేజీ తరువాయి)

తగినట్టు ఐసీఎంఆర్ రిపోర్టు ప్రకారం 41.75 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమంటోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) ప్రకారం 22.32 లక్షల మెట్రిక్ టన్నులు సరిపోతాయని అంచనా. వికారాబాద్‌లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఉల్లి సాగవుతోంది. ఇక్కడ పండించే ఉల్లి సరిపోక పక్క రాష్ట్రాలైన ఏపీ నుంచి కూడా వస్తోంది. దేశంలోనే అత్యధికంగా ఉల్లి పంట పండించే మహారాష్ట్ర నాసిక్ నుంచే అత్యధికంగా సరఫరా అవుతోంది. అమాంతంగా పెరిగిన ఉల్లి ధరలతో పేద,మధ్యతరగతి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్‌లో సబ్సిడీ ధరపై ఉల్లి విక్రయించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

24 నుంచి పార్లమెంట్

26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక



- ప్రొటెం స్పీకర్‌గా కె.సురేష్ లేదా రాధామోహన్ సింగ్?

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 24 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక, కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు ఎనిమిది రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు వెల్లడించాయి. ఇందులో భాగంగా 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. 24, 25 తేదీల్లో కొత్త పార్లమెంట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ ఎంపీ కె.సురేష్, బీజేపీ ఎంపీ రాధా మోహన్‌సింగ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ఓయూ విద్యార్థుల పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణ-హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలో నీరు, విద్యుత్ కొరతల పేరుతో వేసవి సెలవులు ఇచ్చారనే సందర్భంగా వెలువడిన సర్క్యూలరు వివాదంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నీరు, విద్యుత్ కొరత కారణంగా సెలవులు ప్రకటించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారంటూ దశరథ్ ఇతర విద్యార్థులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయలేదని హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని కొట్టేస్తూ జస్టిస్ విజయసేన్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. మే మొదటి వారంలో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గతేడాది వేసవి సెలవుల సర్క్యూలర్‌ను సీఎం ట్వీట్ చేశారనీ, అప్పుడు నీరు, విద్యుత్ కొరత లేదనీ, తప్పుడు సర్క్యూలర్‌ను ట్వీట్‌లో పేర్కొన్నారని పిటిషనర్ల వాదన. సీఎం ట్వీట్‌లోని సర్క్యూలర్ నిజమైనదని ప్రభుత్వ వాదన. సీఎం ట్వీట్‌పై ఒక విద్యార్థి చేసిన ట్వీట్‌లోనిదే నకిలీదని యూనివర్సిటీ అధికారుల ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు జరుగుతోందన్నారు. వాదనల తర్వాత అధికారుల ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తులో సర్క్యూలంపై నిజానిజాలు తేలుతాయనీ, పిటిషన్‌ను కొట్టి వేస్తున్నామని న్యాయమూర్తి చెప్పారు.

గొర్రెల పెంపకం స్కాంలో ఎవరెవరికి వాటాలు ముట్టాయి?

- ఇద్దరు అధికారులను రెండో రోజు ప్రశ్నించిన ఏసీబీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో వెలుగు చూసిన రూ.700 కోట్ల గొర్రెల పెంపకం స్కాంలో ఎవరెవరికి పెద్ద మొత్తంలో వాటాలు ముట్టాయి? అనే కోణంలో అవినీతి నిరోధక శాఖాధికారుల దర్యాప్తు సాగుతున్నది. ఈ స్కాంలో నిందితులైన పశు సంవర్ధక అభివృద్ధి సంస్థ సీఈఓ రాంచందర్ నాయక్, అప్పటి ఈ శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా పని చేసిన కల్యాణ్ కుమార్‌లను ఏసీబీ అధికారులు మంగళవారం రెండో రోజు సుదీర్ఘంగా విచారించారు. ఈ స్కాంలో బినామీలకు డబ్బులు పెద్ద మొత్తంలో పంపిణీ చేయటంలో ఈ ఇద్దరు అధికారుల పాత్ర కీలకంగా ఉన్నట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. బినామీలకు గొర్రెల పెంపకం స్కీమ్‌కు సంబంధించిన డబ్బులను ఒక ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయటంలో వీరిద్దరికి సాయపడిన మరికొందరు పేర్లను బయటకు లాగటానికి కూడా ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వీరిని ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. అలాగే, ఈ స్కాంలోని మరొక ప్రయివేటు వ్యక్తి మోహినుద్దీన్‌తో రాంచందర్, కల్యాణ్ కుమార్‌లకు ఉన్న సంబంధాలను కూడా ఆరా తీసినట్టు తెలిసింది. దాదాపు రూ.700 కోట్ల మేరకు సాగిన గొర్రెల పెంపకం కుంభకోణంలో అప్పటి ప్రభుత్వంలోని రాజకీయ ప్రముఖుల హస్తం ఏ మేరకు ఉన్నదనే వివరాలు వెలికి తీయటానికి ఏసీబీ అధికారులు వేసిన కొన్ని ప్రశ్నలకు ఈ ఇద్దరు నిందితుల నుంచి నేరుగా సమాధానాలు రాలేదని సమాచారం. మొత్తమ్మీద, ఈ ఇద్దరు అధికారులను కొన్ని మార్లు వేర్వేరుగా, మరికొన్నిసార్లు ఎదురెదురుగా కూర్చోబెట్టి ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

ఓఆర్ఆర్ వరకు డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు

- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాలు, ఇతర విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని పౌరులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధి వరకు జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను విస్తరించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. హైదరాబాద్ నగరంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు ఆకస్మిక వర్షాలు, వరదలు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు రాకుండా తగు వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు తేదీలపై స్పష్టతనివ్వాలి

- కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు : బీజేపీ ఎల్పీ నేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీని ఆగస్టు 15వ తేదీలోగా చేస్తామని ప్రకటించినట్టుగానే మిగతా హామీల అమలు తేదీలపైనా స్పష్టతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీరిచ్చిన ఇచ్చిన 420 హామీల్లో ప్రధాన అంశాలు మాత్రం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే స్పష్టత ఇవ్వకపోవడమంటే ఓట్లేసిన ప్రజలను మోసం చేయడమేననీ, అందుకే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో 8 సీట్లను మాత్రమే ఇచ్చారని విమర్శించారు. రైతు భరోసా కింద కౌలు రైతులకు, రైతులకు ఇస్తామన్న రూ.15 వేల సాయం, వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సన్నవడ్లకే రూ.500 బోనస్ అని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి : మంత్రి సీతక్క, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరేడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, అధ్యక్షులు జి.పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు, కమిషనర్ అనితా రామచంద్రన్‌కు వారు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు పి.సుధాకర్, పి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెంకటయ్య, పాండు మాట్లాడుతూ..పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లిస్తామనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేస్తామని మంత్రి సీతక్క హామీనిచ్చారని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పర్మినెంట్, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ అంశాలను మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మొదటి పీఆర్సీలో నిర్ణయించిన 30 శాతం వేతనాలను జీపీ సిబ్బందికి అమలు చేయాలనీ, రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరామన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని విన్నవించామన్నారు. విధినిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలనీ, పోస్టాఫీసు ద్వారా బీమా చెల్లించాలని డిమాండ్ చేశామన్నారు. సహజ మరణ ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలనీ, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరామని తెలిపారు. జనాభా ప్రకారం కాకుండా అవసరాల ప్రాతిపదికన సిబ్బందిని తీసుకోవాలనీ, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశామని చెప్పారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్మికులు మరణిస్తే దహనసంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని కోరామని చెప్పారు. ఆదాయమున్న పంచాయతీలలో వేతనాలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఏపీలో మాదిరిగా మన రాష్ట్రంలో జీపీ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి కృషి

- టీజీఎంఆర్‌ఈఐఎస్ వైస్ చైర్మెన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీజీఎంఆర్‌ఈఐఎస్) వైస్ చైర్మెన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో తెలంగాణ మైనార్టీ పాఠశాలలు, జూనియర్ కాలేజీల ప్రిన్స్‌పాల్స్, రీజినల్ లేవల్ కో ఆర్డినేటర్లు(ఆర్ఎల్ఎస్), జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా సంస్థలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రిన్స్‌పాళ్లకు సూచించారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించాలని సూచిం చారు. టీజీఎంఆర్ పాఠశాలలు అన్ని విధాలుగా అగ్రస్థానంలో ఉండాలన్నారు. విద్యార్థులకు మంచి పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

మాది ప్రజా ప్రభుత్వం.. సంక్షేమమే ధ్యేయం

ప్రజాప్రతినిధులు, అధికారులూ సమన్వయంతో పనిచేయాలి

- భద్రాద్రి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-పాల్వంచ

తమది ప్రజా ప్రభుత్వమని, వారి సంక్షేమమే తమ ధ్యేయం అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా పింఛన్లు, తాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టుల మీద ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భద్రాచలం, కొత్తగూడెం డివిజన్లలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తిచేసి పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలని, అదే రోజు పిల్లలకు బుక్స్, యూనిఫామ్ మిగతా మెటీరియల్ అందజేయాలని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రూ.650 కోట్లకు పైగా ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 80 శాతం వరకు పాఠశాలలు పూర్తయ్యాయని, వారం రోజుల్లో అన్ని పనులు పూర్తయ్యేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ధరణి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోని రైతులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి చేయాలన్నారు. అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2 లక్షల 45 వేల ధరణి దరఖాస్తుల్లో ఎలక్షన్ కోడ్ రాకముందే లక్ష వరకు క్లియర్ చేశామన్నారు. ఆ తర్వాత మిగిలిన దరఖాస్తులు, కొత్తగా రైతులు సమర్పించిన వాటితో కలిపి 2 లక్షల 55 వేలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. ధరణిలో లోపాలను సరిచేసేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని చేతకొండ, రేగళ్ల, పాల్వంచ తదితర గ్రామాల్లోని వేల ఎకరాల భూములకు ఆన్‌లైన్ ప్రక్రియలో సమస్యలు వస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో వారం రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య పరంగా మారుమూల గిరిజన గ్రామాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండేలా సంబంధిత వైద్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రిమోట్ ఏరియాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో, ఆర్డీవోలు, జిల్లా అధికారులు అన్ని ఆస్పత్రులను తనిఖీ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎక్కువ శాతం గిరిజన గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంటు సరిగా లేదని, దానికి సంబంధించిన సర్వే చేపట్టి ప్రతిపాదనలను సమర్పించాలన్నారు.

జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఎరువులు సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికీ రుణమాఫీకి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములతో పాటు పట్టా భూములను ఎవరైనా కబ్జా చేసినట్టు దృష్టికి వస్తే వెంటనే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాలోతు రాందాస్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, జేసీ వేణుగోపాల్, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓలు మధు, దామోదర్ రావు, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మున్సిపల్ చైర్మెన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల చట్టాల అమలులో కేంద్రం విఫలం

సామాజిక వివక్షను అరికట్టాలి

- ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలి
- బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి
- ఆగస్టు 24-26 తేదీల్లో ఎన్‌పీఆర్డీ రాష్ట్ర నాల్గొవ మహాసభ : మహాసభ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, నేటికీ వారి పట్ల కొనసాగుతున్న సామాజిక వివక్షను అరికట్టాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఎన్‌పీఆర్డీ రాష్ట్ర 4వ మహాసభ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జరిగింది. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. 76శాతం మంది గ్రామీణ ప్రాంతంలో, 24శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రభుత్వయేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే.. 5.75 లక్షల మందికే పెన్షన్స్ వస్తోందని చెప్పారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సభార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని కోరారు. వికలాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ మాట్లాడుతూ.. వికలాంగులపై వేధింపులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని నిర్ణయం చేసినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉన్న వివాహ ప్రోత్సాహకం నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. మానసిక, ఆటిజం, హీమోఫిలియా, సికిల్ సెల్ కండరాల క్షీణత వంటి వైకల్యాలు కలిగిన వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు 5 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునే హక్కు లేకుండా పోతున్నదన్నారు. 2009 విద్యాహక్కు చట్టం, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం మానసిక వైకల్యం కలిగిన వారికి పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూగ, చెవిటి వైకల్యం కలిగిన 2 లక్షల మంది విద్యార్థులకు సైన్ లాంగ్వేజ్ అందుబాటులో లేదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి విద్యావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కోశాధికారి ఆర్.వెంకటేష్, కేంద్ర కమిటీ సభ్యులు జెర్కొని రాజు మాట్లాడుతూ.. ఆగస్టు 24-26 తేదీల్లో ఎన్‌పీఆర్డీ రాష్ట్ర 4వ మహాసభ గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్వహి స్తున్నామని తెలిపారు. మహాసభలో దేశం, రాష్ట్రంలో వికలాంగుల స్థితిగతులు, వారి సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభకు 33జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా పి.ఉమర్ ఖాన్, చీఫ్ అడ్వైజర్‌గా కె.వి.కె రావు, చైర్మెన్‌గా ముత్తినేని వీరయ్య వర్మ, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అడివయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్, కోశాధికారి కె.వెంకట్‌తో పాటు 300 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు.

హైదరాబాద్‌కు ఈవీఎం, వీవీ ప్యాట్లు

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



నవతెలంగాణ- జోగులాంబ గద్వాల

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గద్వాల, అలంపూర్ సెగ్మెంట్లకు సంబంధించిన సి-కేటగిరి, ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కాని సీయూలు, బీయూలు, వీవీ ప్యాట్లను హైదరాబాద్‌లోని ఈసీఐఎల్, ఈఎస్ఎండీకి తరలించామని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్ లో వాటా పెంచుకోవాలి

- బీఎస్ఎన్ఎల్ బిజినెస్ మీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టెలికాం మార్కెట్‌లో వాటా పెంచుకోవడంతో పాటు మేకింగ్ డిజిటల్ ఇండియాలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి బిజినెస్ డెవలప్‌మెంట్ మీటింగ్‌ను బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజల్ ప్రారంభించారు. ఈ సమావేశంలో నూతన టెక్నాలజీ భారత్ నెట్, 4 జీ సేవలను వినియోగదారులకు అందించడంపై చర్చించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ భాగస్వాములకు నిర్దేశించిన సమయంలోపు చెల్లింపులు జరపాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్కిల్ సీజీఎం పి.జీ.నిర్మల్, హైదరాబాద్ పీజీఎం ఎం.చంద్రశేఖర్ తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ నుంచి 50 మంది భాగస్వాములు పాల్గొన్నారు.

డాక్టర్ సబావత్ రాంచందర్ సస్పెండ్

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన నేపథ్యంలో తెలంగాణ లైవ్ స్టాక్ డెవలప్ మెంట్ ఏజెన్సీ సీఈవో డాక్టర్ సబావత్ రాంచందర్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం పశువర్ధకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 14 వరకు రాంచందర్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు.

గనుల తవ్వకాలపై క్యాలెండర్ రూపొందించండి : డిప్యూటీ సీఎం మల్లు భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గనుల తవ్వకాలపై వార్షిక క్యాలెండర్ రూపొందించి వెంటనే టెండర్లు పిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెండేండ్లుగా గనుల శాఖలో ఆదాయాల తీరును ఈ సందర్భంగా ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల ప్రాజెక్టుల మరమ్మత్తుకు ఇసుక తరలించాల్సిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలో పనులకు ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. నది తీరాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశమున్న రీచ్‌లు, టెండర్లు, ఆదాయానికి సంబంధించి నీటి పారుదల శాఖతో సమన్వయం చేసుకుని సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని భట్టి ఆదేశించారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన మంత్రి సీతక్క

ప్రజావాణిలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమ తీరును పర్యవేక్షించేందుకు సీతక్క ఆకస్మికంగా సందర్శించారు.

షెడ్యూల్ ప్రకారమే బదిలీలు, పదోన్నతులు కొనసాగాలి : జాక్టో




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారమే కొనసాగాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) అభిప్రాయపడింది. ఈ మేరకు జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్, కోశాధికారి కె కృష్ణుడు, సభ్యులు డి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఎస్ విఠల్, బి వీరునాయక్, టి గీతాంజలి, మోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్, వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ప్రకటించిన పది వేల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఎస్జీటీలందరికీ సీనియార్టీ ప్రకారం పదోన్నతులివ్వాలని సూచించారు.

మోడల్ స్కూల్, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీ పాఠ శాలల బదిలీలు, త్వరితగతిన చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎయిడెడ్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని తెలిపారు.

మిత్రులకు మొండిచేయి

- కీలక పదవులన్నీ బీజేపీకే
- 11 మంత్రి పదవులతో సరి
- అందులోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ మంత్రిమండలిలో బీజేపీ భాగస్వామ్య పక్షాలకు సముచిత ప్రాతినిధ్యం లభించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనేక మిత్రపక్షాల డిమాండ్లను మోడీ ఖాతరు చేయలేదు. మోడీ క్యాబినెట్‌లోని 72 మంది సభ్యుల్లో బీజేపీ భాగస్వామ్య పక్షాలకు చెందిన 11 మందికి మాత్రమే చోటు దక్కింది. వారిలోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా లభించింది.

క్యాబినెట్ పదవులు వీరికే

దక్షిణాది నుంచి జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ లభించగా తెలుగుదేశం పార్టీకి చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖను కేటాయించారు. బీహార్ నుండి హిందుస్థానీ ఆవామ్ మోర్చ సెక్యులర్ పార్టీకి చెందిన జితన్ రామ్ మాంఝీకి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖను అప్పగించారు. అదే రాష్ట్రానికి చెందిన జేడీయూ ఎంపీ రాజీవ్ రంజన్ సింగ్‌కు పంచాయతీరాజ్‌తో పాటు మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ శాఖను ఇచ్చారు. లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖను కేటాయించాయి. మిత్రపక్షాలకు చెందిన ఈ ఐదుగురికి మాత్రమే క్యాబినెట్ హోదా దక్కింది.

సహాయ మంత్రులు వీరే

శివసేనకు చెందిన జాదవ్ ప్రతాప్‌రావు గణపతిరావ్, ఆర్ఎల్‌డీకి చెందిన జయంత్ చౌదరికి స్వతంత్ర హోదాతో మంత్రి పదవులు లభించాయి. ఇక రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలే) నేత రాందాస్ అథావలేకు ఒక మంత్రిత్వ శాఖలో, అప్నాదళ్‌కు చెందిన అనుప్రియా పటేల్‌కు రెండు మంత్రిత్వ శాఖల్లో సహాయ మంత్రి పదవులు ఇచ్చారు. ఆయా పార్టీలకు సభలో వీరిద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, తెలుగుదేశం పార్టీకి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్‌లకు కూడా సహాయ మంత్రి పదవులు లభించాయి.

డిమాండ్లు నెరవేరలేదు

పదహారు మంది సభ్యులున్న తెలుగుదేశం పార్టీ స్పీకర్ పదవితో పాటు నాలుగు కీలక మంత్రిత్వ శాఖల కోసం పట్టుబట్టింది. తన మిత్రపక్షమైన జనసేనకు కూడా క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. అయితే చివరికి రెండు మంత్రి పదవులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జనసేనకు క్యాబినెట్‌లో స్థానం దక్కలేదు. మరోవైపు 12 మంది ఎంపీలున్న జేడీయూ కూడా రైల్వేలు సహా మూడు మంత్రిత్వ శాఖలను కోరింది. ఒకప్పుడు తన తండ్రి రాం విలాస్ పాశ్వాన్ నిర్వహించిన రైల్వే శాఖను తనకు కేటాయించాలని చిరాగ్ కూడా అడిగారు. కానీ నరేంద్ర మోడీ మాత్రం కీలక శాఖలన్నింటినీ బీజేపీ సభ్యులకే కట్టబెట్టారు.మిత్రపక్షాలకు పరిమాణంలోనే (క్వాంటిటీ) కాదు...నాణ్యత (క్వాలిటీ)లోనూ మొండిచేయే చూపారని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వ్యంగ్యోక్తి విసిరారు. 'హోం లేదు. రక్షణ లేదు. ఆర్థికం లేదు. విదేశాంగ శాఖా లేదు. వాణిజ్యం లేదు. రైల్వే లేదు. విద్య లేదు. ఆరోగ్యమూ లేదు. వ్యవసాయం లేదు. జల శక్తీ లేదు. పెట్రోలియం లేదు. టెలీకమ్యూనికేషన్లూ లేవు' అని సెటైర్ వేశారు. బీజేపీ మిత్రపక్షాలకు ఇది అవమానకరమని ఆయన చెప్పారు. కాగా మంత్రి పదవిని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారని, తనకు ఇవ్వజూపిన పదవి తన స్థాయిని తగ్గిస్తుందని ఆయన భావించారని కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో



డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ (మల్కాజిగిరి) ఆదేశాల మేరకు డీటీఎఫ్ మల్కాజిగిరి టీం మల్లాపూర్, అశోక్ నగర్‌లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయిస్తున్న వి.రాకేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసింది. మరో వ్యక్తి బాదల్ పరారీలో ఉన్నాడు. రాకేష్ నుంచి 432 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని విచారణ నిమిత్తం రాకేష్‌ను ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌లో రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ భరత్ భూషణ్ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, డీటీఎఫ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్



స్మశాన వాటిక నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హెచ్చరించారు. దాదాపు 1కోటి 87 లక్షల రూపాయల వ్యయంతో హయత్ నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో చేపట్టిన హిందూ స్మశాన వాటిక ఆధునీకరణ పనులను అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈ ఈ రమేష్ బాబు, డీ ఈ దామోదర్, ఏఈ చంద్ర శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



చెత్త కుప్పలో పసికందు మృతదేహం

నవతెలంగాణ - నాగోల్

నెలలు నిండని ఓ పసికందు మృతదేహాన్ని చెత్త కుప్పలో పడేసిన ఘటన మంగళవారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం గ్రామం ఆదివాసి కాలనీలో ఉన్న ఓ పాత ఇంటి పక్కన ఉన్న చెత్త కుప్పలో నెలలు నిండని ఓ ఆడ శిశు మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పారేశారు. అది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాలనీ అధ్యక్షుడు రామావత్ మత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు నాగోల్ పోలీసులు తెలిపారు.

కాలనీలలో నిలిచిన వర్షపు నీరు



నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో డివిజన్‌లోని పలు కాలనీలలో ఉన్న రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డివిజన్‌లోని శ్రావణ శ్రీ ఎన్క్లేవ్, శ్రీనివాస కాలనీ, జైపూర్ కాలనీ, నాగోలు ప్రధాన దారి నుండి వెళ్లే భారత్ పెట్రోల్ పంపు వద్ద విజయ్ గార్డెన్స్‌లతోపాటు తదితర ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. శ్రావణ శ్రీ ఎన్క్లేవ్, అయ్యప్ప నగర్ కాలనీలతో పాటు పలు కాలనీలలో వర్షాకాలం వచ్చిందంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాల దృష్ట్యా పలు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.





సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ - వనస్థలిపురం

కాలనీలలో నెలకొన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజను వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రోడ్లు, పార్కులు,



కాలనీ సంక్షేమ సంఘం భవనాలు, వీధి దీపాలు మొదలగు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు.

వరద నీటి కాల్వ పనుల పరిశీలన

నవతెలంగాణ - వనస్థలిపురం



హయత్ నగర్ డివిజన్‌లోని అరుణోదయ కాలనీ నుండి హైకోర్టు కాలనీ వరకు చేపట్టిన వరద నీటి కాల్వ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా వరద నీటి కాల్వ పనులను పూర్తి చేయాలన్నారు. కాల్వ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ పరిశీలనలో ఈఈ రమేష్ బాబు, డీఈ దామోదర్, ఏఈ చంద్ర శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

500 గ్రాముల వెండి, 5వేల నగదు అపహరణ

నవతెలంగాణ - హయత్ నగర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా గుల్మోర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి అయిన గణేష్ సింగ్ ఈ నెల 10న తన ఇంటికి తాళం వేసి వారి బంధువుల ఇండ్లు బాచుపల్లి కి వెళ్లారు. ఈ నేపథ్యంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఊరి నుంచి గణేష్ సింగ్ వచ్చి చూసే సరికి బీరువా తాళం పగుల గొట్టి ఉంది. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 500గ్రాముల వెండి, 5వేల రూపాయల నగదు అపహరణకు గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదేవిధంగా చుట్టుపక్కల కాలనీల్లో మరో 4చోట్ల కూడా దొంగతనానికి ప్రయత్నం చేసినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో కనిపిస్తోంది.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో రైన్ వాటర్ పైప్ లైన్ పనులను, రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికే సాయిరాం నగర్, శ్రీనివాస కాలనీల నుంచి వర్షపునీరు ఈ కాలనీ మధ్యలో చేరడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఈ వర్షపునీరు పోవడానికి పైప్ లైన్స్ వేసినట్టు తెలిపారు. అలాగే నూతన రోడ్డు మంజూరైనట్టు చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, అధికారులు రఫీ, ప్రజ్ఞ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యోగ శిక్షణా తరగతుల కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ - నాగోల్



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సమీపంలో ఉన్న లోటస్ ల్యాబ్ స్కూల్లో షిరిడి సాయి అష్టంగ యోగ శిక్షణ తరగతుల కరపత్రాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త మంగళవారం నాగోలు డివిజన్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని లోటస్ ల్యాప్ స్కూల్లో యోగ గురువు నిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురుజీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుండి యోగ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా ఇస్మాయిల్ గురుజీ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుత కాలంలో అనారోగ్యాల నుంచి ఆరోగ్య వంతులుగా మలుచుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పరిపూర్ణవంతమైన ఆరోగ్యం కోసం యోగ ఒక రాజ్య మార్గమని, ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయాన్ని వెచ్చించి ఆరోగ్యవంతులుగా తమ జీవితాన్ని గడపాలని సూచించారు. తాను కూడా ప్రతినిత్యం వాకింగ్, బాల్ బ్యాడ్మింటన్‌లను పూర్తి చేసుకొని యోగ చేస్తానని..యోగ అనేది దైనందిక జీవితంలో ఒక భాగమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, నరేందర్ గురుజీ, శ్రీరాములు గౌడ్, అర్జున్ యోగ ప్రచారక్, ఉపేందర్ గౌడ్, చంద్రశేఖర్, విఠలాచారి గురుజీ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 81 ఫోన్లు అధునాతన టెక్నాలజీతో స్వాధీనం

నవతెలంగాణ - హయత్ నగర్

అధునాతన టెక్నాలజీని ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న 81 ఫోన్లను రోజుల వ్యవధిలోనే తెలంగాణ పోలీసులు రివకరీ చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆవరణంలో ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం బాధితులకు ఫోన్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్



రామాంజనేయులు, క్రైమ్ ఎస్ఐ నరేందర్ సిబ్బంది అనిల్ కుమార్, జంగయ్య, బిక్షం, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన డీఎల్‌పీవో

అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి : మల్లేష్



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని డీఎల్‌పీవో మంద సాధన..ఎంపీఓ వినోద, పంచాయతీ కార్యదర్శి శశిధర్, ఎంపీటీసీ బాల లింగస్వామి, ఫిర్యాదు దారులు, బీఎస్పీ నాయకులు గ్యార మల్లేష్‌లతో మంగళవారం పరిశీలించారు. వివరాల్లోకి వెళ్తే.. అబ్దుల్లాపూర్ మెట్ మండలం, గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 191 లో ల్యాండ్ కన్వెర్షన్ చేయకుండానే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన గ్యార మల్లేష్, మరికొంత మంది గ్రామస్తులు కలిసి రంగారెడ్డి జిల్లా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్‌లకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఫిర్యాదులో భాగంగా మంగళవారం డీఎల్‌పీఓ మంద సాధన నేతృత్వంలో అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అధ్యక్షులు గ్యార మల్లేష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. పునాది దశలోనే పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడంతో భవనం నిర్మాణం పూర్తి కావస్తుందని, అందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ అక్రమ నిర్మాణానికి పరోక్షంగా సహకరించిన అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీతం తీసుకుంటూ ప్రభుత్వ ఆస్తులను అధికారులు కాపాడడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ఒత్తిడికి లోనై అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని ఆరోపించారు.

అధికారుల ఫోన్లు స్విచ్ ఆఫ్..

గౌరెల్లి గ్రామంలో చేపట్టిన అక్రమ నిర్మాణంను పంచాయతీ అధికారులు పరిశీలించిన విషయం విధితమే. అందుకు సంబంధించిన వివరణ కోసం మంగళవారం సాయంత్రం డీఎల్‌పీఓ మంద సాధన, ఎంపీఓ వినోదలకు నవతెలంగాణ విలేకరి ఫోన్ చేయగా.. అధికారుల ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడం గమనార్హం.

శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎప్పటికపుడు నాలాలు, డ్రయినేజీలు శుభ్రం చేయాలి
- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న నాదర్ గుల్, కమ్మగూడలలో నాలాలను శుభ్రం చేస్తున్న పనులను మంగళవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌లు పరిశీలించారు. తర్వాత అల్మాస్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాళాలు, డ్రైనేజీలు శుభ్రం చేయకపోతే చెత్తా చెదారం పేరుకుపోయి ఈగలు, దోమలకు నిలయంగా మారి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే నాళాలు, డ్రైనేజీలు శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రఘు నాయక్, డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ జెనిగే పద్మ ఐలయ్య, ఏఈ వినీల్ గౌడ్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు సమయ పాలన పాటించాలి



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల నిర్వహణపై, పాఠశాలలలో ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పాఠశాలలలో ఉన్న బోర్ మోటార్ల, ఎలక్ట్రికల్ రిపేర్లు, బాత్ రూంలు, టాయిలెట్లను శుభ్రం చేయించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ కృష్ణయ్య, డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈ వినీల్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజక వర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. స్థానిక కార్పొరేటర్ బద్రమోని రోహిణి రమేష్‌తో కలిసి మంగళవారం కాలనీలో సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్ గూడ జేఎన్ఎన యుఆర్ఎం కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ విద్యార్థుల కోసం పాఠశాల, వైద్యశాల, అంగన్‌వాడీల కోసం కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుత ఈ విద్యా సంవత్సరం నుండే విద్యార్థులకు విద్యాభ్యాసం కొనసాగించాలని ఆనాడే ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

కార్పొరేటర్ రోహిణి రమేష్ మాట్లాడుతూ నేడు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి మళ్లీ కొత్తగా కలెక్టర్‌కు విద్యార్థులకు పాఠశాల, వైద్యశాల, అంగన్ వాడీ కేంద్రం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్, వేంకటాపూర్ మాజీ ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు టేకుల భాస్కర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులందరికీ న్యాయమైన వేతనం ఇవ్వాలి'

నవతెలంగాణ - సంతోష్ నగర్



క్రీడా కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులందరికీ న్యాయమైన వేతనం అందించాలని యూనియన్ అధ్యక్షులు మీసాల శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. క్రీడా కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంగళవారం కార్మికుల సమ్మెను ఆర్ఎల్‌సీ సెంట్రల్ లేబర్ కార్యాలయ అధికారుల నిర్ణయం మేరకు తాత్కాలికంగా సమ్మెను విరమించి, విధులకు కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా అధికారులతో కలిసి చర్చలు జరిపినట్టు తెలిపారు. వారు సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. కార్మికులందరికీ న్యాయమైన వేతనాలను, తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ పోరాటాన్ని నిర్వహించినట్టు చెప్పారు. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో చాలా పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించాలని కార్మికులను కోరారు. యాజమాన్యం కూడా కార్మికుల హక్కులను కాలరాయకుండా కార్మికుల చట్టాలకు అనుగుణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో క్రీడా కాంట్రాక్ట్ వర్కర్స్‌ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళ, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిషన్, కృష్ణ, జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్, ప్రభాకర్, బుచ్చి రెడ్డి, అండాలు, యదమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు నిర్ణయం

చైర్మెన్ లింగాల శ్రీకర్ రెడ్డి

నవతెలంగాణ - హయత్‌నగర్

మదర్ డెయిరీలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యూలర్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ నల్గొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తి దారుల సహాయక సహకార యూనియన్ మదర్ డెయిరీ హయత్ నగర్, నల్గొండ జిల్లాల పరిధి లోని వివిధ పాల శీతలీకరణ కేంద్రంలో అసైన్‌మెంట్ పద్ధతిలో సుమారు 15 నుండి 20 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులందర్నీ పర్మినెంట్ చేయడంతో పాటుగా కొందరికి పదోన్నతులు కల్పించే విషయంలో కూడా పాలక మండలి సభ్యుల సూచనల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు చింతలపూడి వెంకట్రామిరెడ్డి, ఫిరంగి వెంకట్రామిరెడ్డి, రచ్చ లక్ష్మీ నర్సింహారెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి, కస్తూరిపాండు, జాల రాంరెడ్డి, కందాల అలివేలు రంగారెడ్డి పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ మేయర్‌కు కార్పొరేటర్ వినతిపత్రం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధి పనుల విషయమై జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధి లోని వాంబే కాలనీలో ఉన్న మట్టి కుప్పలు తొలగించి, కాలనీకి అవసరమైన, అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి పత్రాన్ని అందించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మేయర్ అతిత్వరలో పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమం లో శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్లు కొలుకుల జగన్,మంత్రి సత్యనారాయణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట, సురారం డివిజన్లలో ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభిం చాలని జగద్గిరిగుట్ట, సూరారం డివిజన్ల కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారా యణలు కోరారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల ను మంగళవారం గాజుల రామారం సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, డ్రయినేజీ, బాక్స్ నాలాలు ఇతరత్రా పనులను ప్రజలు ఇబ్బందులు పడకుండా పూర్తిచేయాలని సంబంధిత అధికా రులకు సూచించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ సత్వరమే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నగేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలని అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నగేష్, జీహెచ్‌ఎంసీ ఎంటమాలాజీ సూపర్ వైజర్ డి. నరసింహులు అన్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ ఆదేశాలతో కూకట్‌పల్లి జోన్ సీనియర్ ఎంటామాలజిస్ట్ సంధ్య సూచనలతో మంగళవారం అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నగేష్ , జీహెచ్‌ఎంసీ ఎంటమాలాజీ సూపర్ వైజర్ డి. నరసింహులు, సిబ్బంది కే మురళి, జె గిరి, ఎస్. రమేష్‌లు పాల్గొని దోమల నివార ణ చర్యల్లో భాగంగా కూకట్ పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ లేక్ (చెరువు) లోని ప్రగతి నగర్ చెరువులోని, (బేబీ) గుంత లోని దోమ పిల్లలను అంతం చేయడానికి ఎంఎల్‌ఓ అయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం దష్టిలో పెట్టు కొని ఎక్కడైతే ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటుందో అక్కడ దోమలు గుడ్లు పెట్టి దోమల ఉత్పత్తికి కారణం అవుతాయన్నారు. ఎక్కడైతే వర్షపు నీరు ఎక్కువ రోజులు నిలువ ఉన్నదో అట్టి గుంతలను ,మురికి చెరువులను, తని ఖీ చేసి అట్టి గుంతలలో , మురికి చెరువులలో ఎంఎల్‌ఓ అయిల్ బాల్స్, కానీ, పనికిరాని ఇంజన్ ఆయిల్ కానీ, కిరోసిన్ కానీ, గోనె సంచులలో (రంపపు) చెక్క పొట్టు పోసి గుండ్రగా రబ్బర్ బాల్ లాగా తయారుచేసి వాటికి ఒక తాడు సాయంతో ఎక్కడైతే పెద్ద పెద్ద గుంతలు ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటాయో అక్కడ తాడు సాయంతో వాటర్ లోకి ఆయిల్ విడవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో లో ఆయిల్ ఫామ్ అయి, దోమ పిల్లలు చనిపోతాయ న్నారు. వర్షాలు కురుస్తున్నాయి కావున ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కానీ ఇంటి బయట గానీ ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ డ్రమ్ములు, సిమెంటు గోళాలు, నల్ల గుంతలు, పూల కుండీలు, టైర్లు, సంపులు సింటెక్సు , పనికిరాని ప్లాస్టిక్ వస్తువులను వారానికి ఒకసారి తనిఖీ చేసి ఎక్కువ రోజులు నిలువ ఉన్న నీటిని తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమ ని, దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులు డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్ గునియా, పలేరియా, మెదడువాపు, బోధకాలు జింక వైరస్ ,మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. జిహెచ్‌ఎంసి దోమల నివారణ సిబ్బం ది ప్రతిరోజు ప్రతి ఇంటినీ తనిఖీ చేసే ఎంటమాలాజీ సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ప్రగతి పట్టాలెక్కేనా..?

- రెండు నెలలుగా నిలిచిన పనులు
- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల కోడ్
- నిరంతరంగా పాలనా వ్యవహారాలు
- 10వ తేదీతో ప్రజావాణి షురూ..
- నేటి నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభం



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణం గా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచాయి. గత మార్చి 18వ తేదీన నోటిఫికేషన్ రాగా ఎన్నికల ప్రవర్తనా నియమా వళి అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి అధికా రులు, ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలోనే బిజీగా మారారు. దీంతో రెగ్యులర్‌గా జరగాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిలిచాయి. కలెక్టర్ నుంచి ప్రభుత్వ శాఖల్లోని కింది స్థాయి సిబ్బంది వరకూ అంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నం కాగా, ప్రజా సమస్యలూ పేరుకు పోయాయి. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియగా కోడ్ కు ఈ నెల 6వ తేదీతో తెరపడింది. దీంతో జిల్లాలో రెండు నెలలుగా నిలిచిన పరిపాలనా వ్యవహారాలు తిరిగి యథా విధిగా ప్రారంభమయ్యాయి. అభివృద్ధి పనులు సైతం పునర్ ప్రారంభం కానున్నాయి. దీంతో జిల్లా ప్రగతి తిరిగి పట్టాలెక్కనుంది. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కూడా సోమవారం నుంచి తిరిగి పునర్ ప్రారంభమైంది.

అభివృద్ధి పనులకు లైన్ క్లియర్

కొత్తగా మంజూరైన సీసీ రోడ్లు, అంగన్ వాడీ, పాఠశాల భవనాలు, వంతెనలు, తారురోడ్ల నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అడ్డొచ్చింది. గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాల్టీల్లోనూ పలు నిర్మాణాలు నిలి చాయి. కోడ్ ఎత్తివేతతో ఇలాంటి పనులకు లైన్ క్లియరైంది. పనులు ప్రారంభించి కొనసాగించే వెసులుబాటు కలిగింది. ఇది వరకు చేపట్టిన పనులకు రూ.కోట్ల బిల్లులు వివిధ స్థాయిల్లో పెం డింగ్‌లో ఉన్నాయి. తాజాగా బిల్లుల విడుదలకు మార్గం సుగమమైంది. వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం కలగనుంది.

ప్రజావాణి పునర్ ప్రారంభం

జిల్లాలోని ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందు కు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి ఎన్నికల కోడ్ కారణంగా నిలిచింది. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులంతా అందుబాటులో ఉండే ఈ కార్యక్రమం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో ఈ నెల 10 నుంచి తిరిగి పునర్ ప్రారంభమైంది. దీంతో జిల్లా ప్రజా నీకం ఎప్పటిలాగే వచ్చి తమ సమస్యలు అధి కారులకు తెలిపి పరిష్కరించుకునే వెసులుబాటు ఉంది.

రేషన్ కార్డులపై భరోసా

ఎన్నికల ప్రక్రియ అనంతరం అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామనీ, ఈ ప్రక్రి య నిరంతరంగా సాగుతుందని సీఎం రేవంత రెడ్డి ప్రకటించారు. దీంతో అర్హుల్లో ఆనందం వ్యక్త మవుతోంది. జిల్లాలో వేలాదిమంది నిరుపేదలు కార్డుల్లేక ఏండ్లుగా ఎదురుచూస్తు న్నారు. తాజాగా కార్డుల జారీ ప్రక్రియ ప్రారం భం కానుండటంతో అర్హులందరికీ లబ్ది చేకూరే అవకాశముంది. వీటితో పాటు వానాకాలం రానున్న నేపథ్యంలో పారిశుద్యంతో పాటు సీజ నల్ వ్యాధులు ప్రబల కుండా కట్టడి చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై సమీక్షలు నిర్వహించే అవకాశముంది. నేటి నుంచి బడులు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థు లకు అవసరమైన యూని ఫాంలు, నోట్బుక్స్, పాఠ్యపుస్తకాలు అందించడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

ధరణి దరఖాస్తులకు మోక్షం

సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న ధరణి భూసమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లాలో అందిన దరఖాస్తులను పరిశీ లించడంతో పాటు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరిం చాలని ఆదేశంచింది. దీంతో తమ సమస్యలు తీరుతాయని పలువురు ఆశపడ్డారు. ఇంతలోనే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచింది. తాజాగా కోడ్ తొలగిపోవడం తో ధరణి పెండింగ్ దరఖాస్తులకు మోక్షం లభించనుంది. భూ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశమేర్పడింది.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థు లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించా లనే ఉద్దేశంతో ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ల ద్వారా పనులు చేపడుతోంది. మేజర్, మైనర్ మరమ్మతులతోపాటు అవసరమె న చోట్ల అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు ఇచ్చింది.కోడ్ కారణంగా వేతనాలిచ్చే అవకాశం లేకుండా పోయింది. చేసిన పనులకు ప్రస్తుతం బిల్లుల చెల్లించే అవకాశమేర్పడింది.

ఆరు గ్యారంటీలకు భరోసా

ఆరు గ్యారంటీల్లో భాగంగా 200లోపు యూనిట్లు వినియోగించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. రూ. 500కు గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలనూ అమలు చేస్తోంది. దీని కింద వేలాది మంది లబ్ది పొందారు. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా కొత్తగా మంజూరును నిలిపివేశారు. దీంతో చాలామంది అర్హులు ప్రయోజనాలు పొందలేకపోయారు. అలాంటి వారు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించారు. తమ వివరాలు అందజేయాలని సూచించారు. తాజా గా వారి వివరాలు పరిశీలించి లబ్ది చేకూర్చ నున్నారు. దీంతో ఆయా పథకాల లబ్దిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

సత్తా చాటిన మంటోస్సోరి పాఠశాల విద్యార్థులు





నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పదో తరగతి పరీక్ష ఫలితాలలో మంటోస్సోరి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటారు. కూకట్‌పల్లి విజయనగర్ కాలనీలోని మంటోస్సోరి పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి న సాత్విక్ 10/10 జీపీఎ, ప్రవీణ్ , జయశ్రీ, ఇషా, ఇర్ఫాన, మనీషా 9.8 జీపీఎ, 9.0 జీపీఎకు పైగా 20 మంది సాధించిన విద్యార్థులను డీన్ సునంద, పాఠశాల డైరెక్టర్స్ స్వరూప్‌రెడ్డి, నాయుడు, వెంకట్‌రావు, ప్రిన్సిపాల్స్ స్వాతిల తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న గమ్యాన్ని చేరుకునేందుకు కృషి, పట్టుదల ఎంతో అవసర మన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు తీసుకరావడం పాఠశా లకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి యేడు తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలి తాలు సాధిస్తున్నారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడ మే లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయు లు కృషి చేస్తున్నార న్నారు. భవిష్యత్‌లో కూడా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఉపాధ్యా యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఫోటోగ్రాఫర్స్ క్రికెట్ లీగ్ ఉప్పల్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రికెట్ లీగ్ బుధవారం ఉప్పల్ ఫిర్జాదిగూడలోని క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభమవుతుంది. సిటీలోని ఫోటోగ్రాఫర్ యూనియన్ అసోసియేషన్ టీంలు మియాపూర్, రామంతాపూర్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మొదలగు ప్రాంతాల నుండి ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ల టీంలో 20 టీములు పాల్గొంటున్నాయి. ఈ టీమ్‌లో ఓల్డ్ సిటీ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఓల్డ్ సిటీ లెజెండ్స్ వర్సెస్ మియాపూర్ ఇండియన్స్ మొదటి మ్యాచ్ ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుందని తెలిపారు.

ఐదు గ్రూపులుగా విభజి ంచి ఒక్కో గ్రూపులో నాలుగు టీమ్‌లు పాల్గొనేలా చేశారు. ఆడిన తర్వాత సెమీఫైనల్స్ ఫైనల్స్ ఆడనున్నారు. ఈ నెల 13న ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. ఫైనల్ లో గెలిచిన టీమ్‌కు రూ. 50 వేల ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. ఓల్డ్ సిటీ లెజెండ్ టీం నరేష్ (కెప్టెన్) రాము, సుమన్ , వెంక టాద్రి, అనిల్, మధు, నవీన్, అలోక్, వరుణ్, సురేష్, బ్రహ్మ య్య తల్లోజు, రాజేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించినా.. కబ్జాలు మాత్రం ఆగడం లేవు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని రాజీవ్ గహకల్ప కు సంబంధించిన ప్రభుత్వ స్థలం విషయంలో రెండు కుటుంబాలు దాడి చేసుకున్న ఘటన సూరారం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. మహిళపై యువకుడు విచక్షణ రహితంగా దాడి చేయడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది . ఈ వీడియో వైరల్ గా మారింది. మహనీయుల విగ్రహాల ఏర్పాటు కోసం ఉన్న స్థలాన్ని స్థానికంగా కొందరు వ్యక్తులు గతంలో కబ్జా చేసి దుకాణం ఏర్పాటుకు ప్రయత్నించగా అధికారులు కూల్చేశారు. తిరిగి మరోసారి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-కూకట్ పల్లి

నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్, ఆల్విన్ కాలనీ పరిధిలోని శ్రీతులసి నగర్‌లో గతంలో ఇరవై లక్షల రూపయల నిధులు మంజూ రై, ఇప్పుడు నిర్మాణ పనులు జరుగుతున్న సీసీ రోడ్లను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డును ప్రణాళికా బద్ధంగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా, ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, వెంకట్ నాయక్, సన్యాసిరావు, సంతోష్ బిరాదర్, శ్రీనివాస్ గౌడ్, జైపాల్, శివ, బసవరెడ్డి, సుందరం, బి.వేణు, రమేష్, శోభారాణి, నాగలక్ష్మి. జి.ఎచ్.ఎం.సి అధికారులు ఎఇ శ్రావణి, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎస్.ఆర్.పి నాగేశ్వర్ నాయక్, ఎంట మాలజీ సూపర్వైజర్ డి. నరసింహులు, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్ గంజ్‌లో ప్రభుత్వ పాఠశాలలో నత్తనడకగా అభివృద్ధి పనులు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉస్మాన్ గంజ్‌లోని గోషామహల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఉస్మాన్ గంజ్ తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలో నత్తనడకగా అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయి. నేడు పాఠశాల పున ప్రారంభం అవుతుండడంతో విద్యార్థులు ఎలా కూర్చుంటారని తల్లిదండ్రులు సందేహా లు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అభివృద్ధి పనులు వేగంగా చేసి పూర్తి చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రు లు అధికారులను కోరుతున్నారు.

కేంద్ర మంత్రులకు అభినందనల వెల్లువ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రధానిగా మోడీగా మూడో సారి కొలువుదీరిన కేంద్ర మంత్రి వర్గంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి క్యాబినెట్ మంత్రిగా (బొగ్గు, గనుల శాఖ)మాజీ అధ్యక్షులు బండి సంజయ్ కుమార్‌లకు (హోమ్‌శాఖ)సహాయ మంత్రి పదవులు వరించాయి. మంగళవా రం గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి దంపతులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్ యాదవ్ లు ఢిల్లీలోని కేంద్ర మంత్రులు కార్యాలయాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో రచ్చ చక్రధర్, ప్రసాద్, బాబు ఉన్నారు.

13న కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి పిలుపునిచ్చారు. ఆశాలకు నష్టం కలిగించే, ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించి, డీఎంఅండ్ హెచ్‌ఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో 33 ఏండ్లు, మైదాన ప్రాంతంలో 19 ఏండ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రెనింగ్‌లు పొందారని తెలిపారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరా యిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని తెలిపారు. తగిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నాం ని తెలిపారు. వీటితోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తు న్నారని పేర్కొన్నారు. కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించినట్టు తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ, ఇంత సీనియా రిటీ ఉన్న ఆశా వర్కర్లకు మళ్ళీ కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి, కొత్తగా ఆశాల జ్ఞాపకశక్తిని మళ్ళీ నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయాన్ని ముందుకు తెచ్చి అమలు చేయాలని చూస్తే, వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు చేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్టు తెలిపారు. 2023 జూన్ 5వ తేదీన జరిగిన ఆశాల టెలీకాన్ఫరెన్స్ సమావేశంలో మాజీ హెల్త్ మినిస్టర్ హరీష్‌రావు ఆశాల ఎగ్జామ్‌ను రద్దు చేస్తున్నామని ప్రకటించారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు మళ్ళీ కొత్త సమస్యలు తేవడం అన్యాయం అన్నారు. సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ మాట్లాడు తూ ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టడం ద్వారా ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్ వల్ల ఆశాలకు కలిగే లాభాలు ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ఏమీ లేవన్నారు. అంటే ఏఎన్‌ఎం ప్రమోషన్ లాంటి తదితర ఎలాంటి సౌకర్యాలు అందులో లేవనీ, కేవలం అశాల పనిని, పనుల పట్ల ఆశాల జ్ఞాపకశక్తిని కొత్తగా నిరూపించు కుంటే ఒక సర్టిఫికెట్‌కు రూ.5వేలు ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్ తెలియజేసినట్టు తెలిపారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా కొత్తగా ఎగ్జామ్ రాసి ఉత్తీర్ణులైతే రూ.5వేలు బిక్షం వేస్తామనడం అన్యాయం అన్నారు. ఎగ్జామ్ రాసిన వారికి అందులో ఎలాంటి ఉపయోగాల్లేవు అనీ, పైగా ఎగ్జామ్ రాసి ఫెయిలైన వారిని, మొత్తమే ఎగ్జామ్ రాయలేని పరిస్థితిలో ఉన్న ఆశాలను తర్వాత ప్రభుత్వం పని నుంచి తొలగించే ప్రమాదం లేకపోలేదన్నారు. ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలన్నారు. ఆశాల సమ్మె సందర్భం గా గత ప్రభుత్వం, ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

దుండిగల్ మున్సిపాలిటీ సమీక్ష సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాబోయే వర్షాకాల విపత్తులపై వర్షాకాలం లో వరదలు, పారిశుధ్యం నిర్వహణ, సీజనల్ వ్యాధులు నివారణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అవసరమైన మిషనరీతో కూడిన అత్యవసర యంత్రాంగం ఏర్పాటు, మున్సిపాలిటీచే చేపట్టే ముందస్తు చర్యలు, మొదలగు అంశాలపై దుండిగల్ మున్సిపాలిటీ సమీక్ష సమావేశం మంగళవారం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణ రావు, ఇంజినీరింగ్ విభాగం , శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఏవైనా అత్యవసరమైన సమస్యలు ఏర్పడితే పరిష్కరంచేందుకు ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రజలు సమస్యలపైకంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 9542715377కు సమాచారం అందించవలసిందిగా కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్ కుమార్ మేనేజర్ నర్సింలు , సానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వార్డ్ ఆఫీసర్లు, శానిటరీ జవాన్లు, తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాలరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

బ్రాహ్మణులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి ఆర్థిక ఆదుకో వాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ప్రభుత్వ సలహాదారులు హర్కర్ వేణుగోపాల్ రావును కోరారు. మంగళవారం రమణరావు ఆయనను కార్యాలయంలో కలసి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని బ్రాహ్మణులు నేటికి పేదరికంలో ఉన్నారని, పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీలు ఇస్తూ ఉపకార వేతనాలను వెంటనే అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని రంగాల్లో బ్రాహ్మణుల పూర్వ వైభవం కోసం బ్రాహ్మణ ప్రజా ప్రతినిధులు, మేధావులు తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. బ్రాహ్మణ సంఘాలు ఐక్యత కోసం తాము నిరం తరం కృషి చేస్తూ పేద బ్రాహ్మణులకు సహాయ సహకారాలందిస్తున్నట్టు ఆయన చెప్పారు. సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంత్రి సునీల్, రాష్ట్ర ప్రతినిధి కరకపట్ల రామారావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

డ్రయినేజీ నీటిని తొలగించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది



నవతెలంగాణ-కాప్రా

ఇటీవల కరిసిన వర్షానికి చర్లపల్లి డివిజన్‌లోని డీ మార్ట్ దగ్గర డ్రయినేజీ పొంగడంతో సాయినగర్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులను, మాన్సూన్ టీంను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రయినేజీ వాటర్‌ను క్లియర్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మాన్సూన్ టీం, చర్లపల్లి డివిజన్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, సత్తెమ్మ, నవనీత, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసిన చక్రిపురం లక్ష్మీప్రైడ్ కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చక్రిపురం లక్ష్మీప్రైడ్ నూతన కార్యవర్గ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బండారి హామీ ఇచ్చారు. ఈ సందర్భగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ గౌడ్, నర్సింహారెడ్డి, వీరేశం, ముత్యాలు, వైకుంఠం, విజయ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన బండారి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంగళవారం సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రావడంతో పాఠశాలను సందర్శించానని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, సాయికుమార్, నవీన్‌గౌడ్, పూస రమేష్, శేఖర్‌గౌడ్, నరసింహ, నిస్సార్ అహ్మద్ ఘోరి, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ బస్తీలో స్వర్ణరాజ్ శివమణి పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని యాదవ బస్తీలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలోని సమస్యలను తెసులుకున్నారు. బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ బస్తీలో భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైన మ్యాన్ హోల్ శిథిలావస్థకు వస్తే వాటి స్థానంలో కొత్త మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలన్నారు. చెన్నకేశవ టెంపుల్ నుంచి బొడ్రాయి వరకు నూతన 1ఫీట్ భూగర్భ వ్యవస్థ ఏర్పాటు చేసి బస్తీలో సీసీ రోడ్లు నిర్మాణం చేయాలన్నారు. బస్తీవాసులు ఇంటి చెత్తను వీధుల్లో, ఖాళీ స్థలాల్లో వేయకుండా శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. వీధుల్లో ఉన్న చెత్తను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. వీధి దీపాల ఏర్పాటు, నాలుగు స్తంభాలు, త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటు, విద్యుత్ తీగలకు తగలకుండా చెట్ల కొమ్మలు తొలగించాలని ఎలక్ట్రికల్, హార్టికల్చరల్ అధికారులకు సూచించారు. బస్తీవాసులు సూచించిన స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ అభిషేక్, జవాన్లు రామకృష్ణ, కృష్ణ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ సిబ్బంది, కాప్రా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శంకర్‌యాదవ్ మృతదేహానికి బండారి నివాళి



నవతెలంగాణ-కాప్రా

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకర్‌యాదవ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నీలంరెడ్డి, తదితరులున్నారు.

మాస్టర్ మైండ్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



- గుర్తింపు లేని పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్

నవతెలంగాణ ఉప్పల్

గుర్తింపులేని మాస్టర్ మైండ్స్ పాఠశాలను సీజ్ చేయాలని, అలాంటి పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల్ హనుమసాయి నగర్‌లోని మాస్టర్ మైండ్స్ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రయివేట్, కార్పొరేట్ ఆగడాలు అధికమయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి పాఠశాలలను కట్టడి చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలయ్యారని ధ్వజమెత్తారు. జీవో నెం.1కు వ్యతిరేకంగా నూతన పాఠశాల ఏర్పాటుకు ఆటస్థలం, మెరుగైన తరగతి గదులు, ఫైర్ సేఫ్టీ ఇతర మౌలిక సదుపాయాలతో పాటు విద్యాశాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. కానీ ఇవేవీ పొందకుండా విచ్చలవిడిగా అడ్మిషన్లు నిర్వహిస్తూ ధనార్జనే ధ్యేయంగా మాస్టర్ మైండ్స్ యాజమాన్యం వ్యవహరిస్తున్నారన్నారు. పక్కపక్కనే పాఠశాలల ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చారో విద్యాధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా విద్యాశాకాధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారని, కార్పొరేట్ పాఠశాలలకు రెడ్‌కార్పెట్ వేస్తున్నారని ఆరోపించారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని విద్యాసంస్థలపై ఏఐవైఎఫ్ నిరంతర పోరు నిర్వహిస్తుందన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందిచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐ వైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా ఆఫీస్ బేరర్స్ శేఖర్, కిరణ్, కల్యాణ్, మాజీద్, మహేష్, అజీమ్ పాషా, శ్రీకాంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి బండారి పరామర్శ



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్ డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయ కులు మోహన్‌బాబు (కన్నీ) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాధితుడిని మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట గంథం నాగేశ్వరావు, పసుల ప్రభాకర్ రెడ్డి, బోసాని పవన్, సురేష్, మల్లికార్జున్, వెంకట రమణ ఉన్నారు.

శభాష్.. ఎన్నికల సేన..!

- ముందస్తు కార్యాచరణతో యంత్రాంగం సఫలం
- చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం
- సకల సౌకర్యాలు.. ప్రత్యేక కేంద్రాలతో పోలింగ్



స్వీప్‌పై డీఆర్డీఓ ఆధ్వర్యంలో అవగాహన (ఫైల్)



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

సార్వత్రిక సమరంలో అభ్యర్థుల జయాపజయాలు పక్కనబెడితే ఉద్యోగుల పాత్ర అమోఘం. రాత్రనక, పగలనక శ్రమించిన తీరు అభినందనీయం. ఎన్నికల ప్రకటన వెలువడిన దరిమిలా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ముందస్తు కార్యాచరణ ఎన్నికల మెరుగైన నిర్వహణకు దోహదపడ్డాయి. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల్లో భాగస్వాములు కాగా పక్కా ప్రణాళికతో భేష్ అనిపించారు. ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు ఘటనలు మినహా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. పలు చోట్ల ఓట్లు గల్లంతవడం.. పోల్ చీటీలు రాకపోవడం కొంత ఆందోళన కలిగించింది. 2024 పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

ఉన్నతాధికారుల పాత్ర భేష్

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ పాత్ర అభినందనీయం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిష్పక్షపాతంగా వ్యవహరించారు. కలెక్టర్ గౌతమ్ ఎన్నికల నిర్వహణలో సఫలమయ్యారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్‌వో హరిప్రియ, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు క్రియాశీల పాత్ర పోషించారు. ఫలితంగా ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియగా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించారు.

నిర్వహణలో ప్రధాన శాఖలివే..

ఎన్నికల విజయవంతం అయ్యాయంటే.. రెవెన్యూ పాత్ర కీలకం కాగా.. దీనికితోడు సుమారు 20 శాఖలకు పైగా ఉద్యోగులు తమ వంతు పాత్ర పోషించారు. ఓటరు నమోదు మొదలుకుని పోలింగ్ పూర్తయి.. ఓట్ల లెక్కింపు వరకు కీలక భూమిక పోషించాయి. ఫలితంగా ఓటు చైతన్యం వెల్లివిరిసింది. రెవెన్యూ, విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్, మహిళా సంక్షేమం, ముంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, ఆర్టీసీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సహకార ఆడిట్ విభాగం, రోడ్లు, భవనా లు, ట్రెజరీ, బీఎస్‌ఎన్‌ఎల్, బ్యాంకింగ్, ఇంటర్మీడియట్, తదితర శాఖలు, ఆయా కళాశాలల ఉద్యోగులు ఎన్నికల సేనలో ఉన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎన్నికల ప్రక్రియ అంతా ఒక ఎత్తయితే పోలింగ్ మరో ఎత్తు. దీన్ని విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారు. మే 12, 13 తేదీల్లో వారు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల సమ రాన్ని గట్టెక్కించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తం గా 3వేల మంది టీచర్లు ఈ క్రతువులో పాల్గొన్నారు. బీఎల్వోలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఓటరు జాబితా రూపకల్పనలో ఓటర్లకు పోల్ చీటీలు పంచి, ఓటర్లను పోలింగ్ కేంద్రానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రత్యేక సేవల్లో కొన్ని శాఖలు

ఓటు హక్కు ఉన్న వికలాంగులు, వద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం కల్పించగా కొన్ని శాఖలు విశేష కృషి చేశాయి. వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి వారిని ఇంటి వద్దకు చేర్చడంలో వాలంటీర్ల కృషి అభినందనీయం. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలతో ఓటు వేయించడంలో చొరవ చూపారు. ఇక పోలింగ్ రోజు ఎలాంటి సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసులు, పారా మిలటరీ సైనికులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. మంగళవారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ సౌందర్యలత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ కన్వీనర్, కార్పొరేటర్ బన్నాల గీత హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 వేలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మౌలిక సదుపాయాల కల్పించడానికి వినియోగించాలన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సౌందర్య లత, వారి సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యాన్లు, కుర్చీలు, బాత్రూం డోర్స్ సరిగ్గా లేవని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. వెంటనే కుర్చీలు, ఫ్యాన్లు, బాత్రూం డోర్స్ కొనుగోలు చేయాలని కార్పొరేటర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సౌందర్య లత, కరుణా దేవి, సూపర్‌వైజర్ భోగా ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాధక్క (నిర్మల) మృతి విప్లవోద్యమానికి తీరని లోటు

- సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి అనుబంధ ప్రజా సంఘాల నేతలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

గోదావరిలోయ ప్రతిఘటన పోరాట నిర్మాత, అమరుడు కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి సతీమణి రాధక్క అలియాస్ నిర్మలక్క(80) మరణం, గోదావరిలోయ భారత విప్లవ ప్రతిఘటనోద్యమానికి తీరనిలోటని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారని తెలిపారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంతో కామ్రేడ్ సీపీరెడ్డి రూపొందిన విప్లవ ప్రతిఘటనోద్యమంలో తన చివరిశ్వాస వరకు రహస్య జీవితాన్ని అనుసరించి, రాజీలేని రాజకీయ పోరాట సిద్ధాంత పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సరైన లైన్ కోసం, బలమైన విప్లవ సంస్థ నిర్మాణం కోసం అవిశ్రాతంగా శ్రమించిందని తెలిపారు. అడవి ఉద్యమంలో ఎందరికో ఆదర్శంగా నిలి చిందని గుర్తుచేశారు. కామ్రేడ్ సీపీరెడ్డి మరణం తర్వాత, భారత విప్లవోద్యమాన్ని సజీవంగా నిలబెట్టే క్రమంలో ప్రభుత్వ ఫాసిస్టు, పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని, పార్టీలో ఏర్పడిన అన్యవర్గ ధోరణులను, అన్నిరకాల అవకాశవా దాలను ఓడించి, విప్లవ కారుల ఐక్యతకు ప్రధాన భూమిక వహించిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ షావలి, నకిరేకంటి చిట్టిబాబు, సంపంగి పద్మ, మహ్మద్ రషీద్ ద్రావిడ ఉన్నారు.

మేడ్చల్ మున్సిపల్ టీపీవోపై మహిళ ఆగ్రహం





- మామూలు ఇవ్వకపోవడంతోనే తమ నిర్మాణాన్ని కూల్చేరని ఆరోపణ
- అన్ని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో రేకులతో చిన్నపాటి షెడ్డును నిర్మిస్తున్న తమ నిర్మాణాన్ని టీపీవో రాధాకృష్ణ కూల్చివేయడంపై ఓ మహిళ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. టీపీవో డబ్బులు ఇస్తే ఒక లెక్క, డబ్బులు ఇవ్వకపోతే మరోలా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తమ నిర్మాణాన్ని కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు అడిగినంత డబ్బులు ఇవ్వకపోవడం వల్లే కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఎన్నో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ అక్రమ నిర్మాణాలలో టీపీవోతో పాటు సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టడం వల్ల వాటి జోలికి వెళ్లడం లేదని మండిపడ్డారు. సామాన్యులకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా? అని మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఈ విషయంలో అవసరమైతే తను సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి కూడా వెళ్తానని బాధితురాలు తెలిపారు. ఇదిలా ఉంటే స్థానిక కౌన్సిలర్ జంగా హరికృష్ణ యాదవ్ ఫిర్యాదు చేయడంతోనే సదరు మహిళ నిర్మాణాన్ని కూల్చేశామని టీపీవో రాధాకృష్ణ చెప్పడం గమనార్హం.

తీన్మార్ మల్లన్నకు మున్నూరుకాపు సంఘం సన్మానం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఇటీవల జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లగిశెట్టి దయానంద్ పటేల్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాల వేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ తాజా మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు పటేల్, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం రవి , మాజీ అధ్యక్షుడు సింగం నర్సింగ్ రావు, సంఘం ప్రతినిధులు సింగం పవన్ కుమార్, సింగం భాస్కర్, సింగం రాకేష్,సింగం భాస్కర్, లగిశెట్టి అరుణ్ పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ దాడి



నవతెలంగాణ-మేడ్చల్

ప్రయాణికుడిపై ఆర్టీసీ డ్రైవర్ చేయి చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టీఎస్ 10యూసీ 9847 వద్ద ప్రయాణికుడు రాజలింగం రామాయంపేట వెళ్లడానికి ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామాయంపేటకు వెళ్తుండటం గమనించిన ప్రయాణికుడు చెయ్యెత్తి బస్సును ఆపడానికి ప్రయత్నించాడు. బస్సును డ్రైవర్ ఆపకపోవడంతో ప్రయాణికుడు ఆగ్రహంతో డ్రైవర్‌ను తిట్టాడు. దీంతో బస్సును డ్రైవర్ పక్కకు ఆపి ప్రయాణికుడు రాజలింగం తలపై కర్రతో దాడి చేశాడు. దీంతో ప్రయాణికుడికి తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ప్రయాణికుడు స్థానిక పోలీసులు సమాచారం ఇచ్చాడు.


పార్కు స్థలాలు కబ్జా కాకుండా హరితహారం మొక్కలు నాటాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా హరితహారం మొక్కలు నాటుతున్నామని పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మంగళవారం పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్ శ్రీవేంకటేశ్వర హౌసింగ్ కాలనీలోని 8 వేల గజాల పార్కు స్థలంలో మొక్కలను నాటారు.అనంతరం ఆయన మాట్లాడు తూ.. పోచారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 137,138 యంనంపేట్ శ్రీవేంకటేశ్వర హౌసింగ్ కాలనీలోని పార్కు స్థలంలో మొక్కలను నాటి పార్కు స్థలాలు కబ్జాలకు గురికాకుండా కాపాడుతున్నట్టు తెలిపారు. పోచారం మున్సిపల్‌లోని పార్కు స్థలాల్లో హరితహారం మొక్కలు నాటి కబ్జా కాకుండా చూస్తున్నామని చెప్పారు. మంగళారం 500 మొక్కలను నాటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల వద్ద మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్య నాయక్, కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సులర్లు చింతల రాజశేఖర్, సుర్వి రవీందర్, కో ఆప్షన్ సభ్యులు అక్రం అలి, నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, నర్రి కాశయ్య, బద్దం జగన్ మోహన్ రెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, అబ్బవతి నరసింహ, సూర్వి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'డబ్బులు చెల్లిస్తేనే ఇల్లు కట్టనిస్తామని వేధింపులు'



తెలంగాణ-ఘట్కేసర్

డబ్బులు ఇస్తేనే ఇల్లు కట్టనిస్తామని ఓయూ కాలనీవాసులు, కొంతమంది నాయకులు తనను వేధిస్తున్నారని ధరావత్ వెంకటేష్ నాయక్ ఆరోపించారు. మంగళవారం ఘట్కేసర్ మండలం చౌదరిగుడ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ మాట్లాడుతూ చౌదరిగూడ గ్రామ పరిధిలోని ఓయూ కాలనీ సర్వేనెంబర్ 751, 752లో గల తన ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించగా కొందరు స్థానికులు నాయకులు లేనిపోని ఫిర్యాదులు చేసి పనులను నిలిపేశారని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నించగా రూ.5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. అన్ని అనుమతులు తీసుకొని తన స్థలంలో తాను నిర్మాణం చేపడుతుంటే కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులకు అధికారులు పనులను ఆపించడం సరికాదన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తులపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేయనున్నట్టు వెంకటేష్ నాయక్ తెలిపారు.తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా తన ఇంటి నిర్మాణ పనులను ఆపొద్దని, ఇలానే వ్యవహరిస్తే డబ్బులు డిమాండ్ చేసిన విషయాన్ని ఆధారాలతో సహా బట్టబయలు చేస్తానని హెచ్చరించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-శామీర్‌పేట

వర్షాకాలం ప్రారంభమైనందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అధికారులకు సూచించారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట గోపాల్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలంలో తూఫాన్ ప్రభావం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలపై కార్యాలయ సిబ్బంది, డిప్యూటీ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్, మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, కార్యాలయ ఎలక్ట్రీషియన్, వాటర్ మెన్స్‌కు పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీకి ప్రత్యేక మాన్ సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండాలని , వార్డుల వారీగా శిథిలావస్థలో ఉన్న ఇండ్లకు నోటీసు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అనుమతుల్లేని నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు : కమిషనర్



నవతెలంగాణ-కీసర

మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్ హెచ్చరించారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను అధికారులు జేసీబీతో కూల్చేశారు. ఎవరైనా ఇంటి నిర్మాణాలు చేపడితే మున్సిపల్ నుంచి పర్మిషన్ తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అక్రమంగా నిర్మిస్తే ఎలాంటి నిర్మాణాలలైన కూల్చేస్తామన్నారు.

ఘట్కేసర్ జిల్లా ఆస్పత్రి ఎదుట నర్సుల ధర్నా



నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న నర్సింగ్ ఆఫీసర్స్ ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఘట్కేసర్ పట్టణంలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రి ముందు నర్సులు ప్ల కార్డులు పట్టుకుని మంగళవారం నిరసర చేపట్టారు. సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలని, జీవో నెం.317 ద్వారా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. నర్సింగ్ క్యాడర్ కోసం ప్రత్యేకంగా జేడీ, వీడీ పోస్టు సృష్టించాలని, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ అయిన నర్సింగ్ ఆఫీసర్స్‌కు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ ఆల్ నర్సింగ్ ఫెడరేషన్ సభ్యులు వసంత, దేవమణి, శారద, జానకి, సుహాసిని, బాలునాయక్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

అనారోగ్య కారణాలతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ (62) అనే వృద్ధుడు సినీ ఫీల్డ్ లో పనిచేస్తూ ఒంటరిగా కిరాయికి ఉంటు న్నాడు. అనారోగ్య కారణాలతో , వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి యజమాని, స్థానికులు దుర్వాసన వస్తుందని పోలీసులకు మంగళవారం తెలపగా వారు అక్కడికి చేరుకొని లోపలకి వెళ్లి చూడగా వృద్ధుడు ఉరేసుకుని కనిపించాడు. అతను చనిపోయి మూడు రోజులు అవుతుందని, పోలీసులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు బోరబండ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భోపాల్, ఎస్సై నాగుల్ మీరా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com



కంటోన్మెంట్ నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. నియోజక వర్గంలోని పలు సమస్యలును సీఎం దృష్టికి తీసుకెళ్ళి త్వరగా పరిష్కరించాలని కోరారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం విషయంపై కూడా ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేతో పాటు మధుకర్ సదానంద గౌడ్ , పలువురు ప్రముఖులు ఉన్నారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్



హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్న యువత

- పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ పద్మజా రెడ్డి

నవతెలంగాణ-బంజారా హిల్స్

నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని పద్మశ్రీ అవార్డు గ్రహిత,ప్రఖ్యాత కూచిపూడి నత్యకారిణి డాక్టర్ పద్మజా రెడ్డి అన్నారు. జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన బంజారా హిల్స్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాలులో కొలువుదీరిన చేనేత కార్మికుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగి ప్రసంగించారు. భారతీయ సంస్కతిలో పట్టు,హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉంద న్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. అమ్మ చల్లని ఒడిలా చేనే తలు అని ఆమె వర్ణించారు. ప్రతి ఒక్కరూ చేనేత ను మరింత ఆదరిం చాల న్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ నెల 16 వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారు లు, చేతి పని బంధాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

మోటివేషన్ పేరుతో మచ్చిక..

- పెట్టుబడుల పేరుతో కోట్లు వసూళ్లు
- భార్యాభర్తతోపాటు కుమారుడి అరెస్టు





Molla Shivaiah @ Shiva Kumar (A1) | Gaddeya Srinivas Rao (A2) | Molla Swarna Latha (A3) | Molla Jaswant (A4)

నవతెలంగాణ-సిటీబ్యూరో

యూట్యూబ్‌లో వారిమాటలు విన్నవారు లక్షాధికారులుగా మారిపోతున్నట్టు కలలుకంటారు. సులువుగా డబ్బులు వస్తాయని ఊహల్లో తేలిపో తారు. అటువ్యాపారం, ఇటు వైద్యంపై మోటివేషన్ పేరుతో అమాయకులను మచ్చిక చేసుకుని లక్షలకు లక్షలు దండుకొని మోసాలకు పాల్పడుతున్న ఓ కుటుంబంతోపాటు మరో వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం డీసీపీ శ్వేత తెపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మొల్ల శివయ్య సులువుగా డబ్బుల సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా మీమాంస, రీబూట్ పేరుతో యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారం భించాడు. అందులో రియల్ ఎస్టేట్, ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలను ప్రచారం చేశాడు. శారీరక, మానసిక వ్యాధుల నివారణ చేస్తామంటూ ప్రేరణాత్మక ప్రసంగాలతో అందరిని ఆకట్టుకునే వాడు. ముఖ్యంగా రియల్‌ఎస్టేట్ రంగంలో శిక్షణ ఇస్తానని నమ్మించేవాడు. శివయ్య ఫాలోవర్లు పెరగడంతో అతని భార్య మొల్ల స్వర్ణలత, కుమా రుడు మొల్ల జశ్వంత్‌తోపాటు గద్దెయ్య శ్రీనివాస్‌లను పార్ట్‌నర్స్‌గా ప్రచారం చేశాడు. అందరి ప్రసంగాలను యూట్యూబ్‌లో పెట్టేవాడు. అంతేకాకుండా ఇండోర్, ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించి అమాయకులను ఆకర్షించేవారు. హాజరైన ప్రతి సభ్యుని నుంచి లక్ష రూపాయల రుసుమును వసూలు చేసేవారు. ఆ సమావేశాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం, బ్యాంక్‌లో తనఖాపెట్టిన వాటి వివరాలతోపాటు వాణిజ్య భూముల వివరాలను చెప్పేవారు. వాటిని కొనుగోలు చేయడం లేదా విక్రయించడంతో పెట్టుబడిలో 200 శాతం లాభాలొస్తాయని నమ్మించేవారు. ఇలా పెట్టుబడుల రూపంలో పలువురి నుంచి 'రియల్టీ ఆరా ప్రయివేటు లిమిటెడ్' 'జ్యోతిక ఇన్వెస్టర్స్ క్లబ్' ఇలా వివిధ వారి కంపెనీలపై డబ్బులు డిపాజిట్ చేయించేవారు. పెట్టుబడిదారులను నమ్మించేదుకు ప్రామిసరీ నోట్లు, పోస్ట్ డేటేడ్ చెక్‌లు ఇచ్చేవారు. ఎంఓయూ సైతం చేసుకునేవారు.

ఇదిలావుండగా శివయ్య తన యూట్యూబ్ ఛానెల్‌లో తాను ప్రకృతి వైద్యుడిగా, న్యూరో లింగిస్టిక్ ప్రొగ్రామ్(ఎన్ఎల్‌పి) శిక్షకుడిగా వీడియోలు తీసి ప్రచారం చేశాడు. ముఖ్యంగా బీపీ, మధుమేహం, థైరాయిడ్, క్యాన్సర్ వంటి అన్ని రకాల వ్యాధులను తక్కువ సమయంలోనే నయం చేయవచ్చని పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. ఇలా రియల్ ఎస్టేట్, ఆరోగ్యానికి సంబంధించిన నకిలీ వీడియోలతో, మోటివేషన్ క్లాస్‌లతో పలువురిని ఆకట్టుకునేవారు. దాదాపు 30 మంది నుంచి రూ.10.86కోట్లు వసూ ళ్లు చేశారు. మరో 40 మందిని సైతం మోసం చేసిన ట్టు బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసులు నమోదయ్యాయి.



జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి.
- అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-ఓయూ

వర్ష కాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. మంగళవారం తార్నాక లోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో తార్నాక డివిజన్‌లో జరుగు తున్న పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్ష సూచనల కారణంగా ఈ సమయంలో రోడ్లపైన ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని తెలి పారు. విద్యుత్ తీగలు, వీధి దీపాలు చెట్లను కప్పేయకుండా సాయంత్రం వేళలో వెలుగులు ఉండేలా చూడాలన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపైన తక్ష ణమే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కారిం చాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సుభాష్, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ హేమ లత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆశాలత, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం సరిత, హార్టికల్చర్ వింగ్ మేనేజర్ గణేష్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్, హెచ్ఎండబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్లు నిఖిత, కృష్ణ ప్రసాద్, జీహెచ్ఎంసి అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్, పాల్గొన్నారు.



అక్రమ సెల్లార్‌ను పూడ్చివేయాలని ఫిర్యాదు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

గత 23 సంవత్సరాల క్రితం గీత గ్రాండియర్ అపార్ట్‌మెంట్‌ను యూసుఫ్‌గూడ క్రాస్ రోడ్స్‌లో సెల్లార్‌కు అనుమతి లేకుండానే, సెల్లార్ నిర్మించి 5 అంతస్తులలో 39 ఫ్లాట్లు నిర్మించారని.. అయితే అప్పటినుండి ఇప్పటివరకు సెల్లార్ లోనికి నీరు వచ్చి మోకాళ్ల లో తు నీళ్లతో మునిగిపోవడం జరుగుతుందని ఫ్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు

అక్రమ సెల్లార్‌ను పూడ్చివేయాలని జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్‌కు, టౌన్ ప్లానింగ్ ఏసీపీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం మోకాళ్ళ లోతు నీళ్లు వచ్చి పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, సిమెంట్ రాలిపోయి రాడ్లు కనపడుతున్నాయని, తక్షణమే జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుని సెల్లార్‌ను పూర్తిగా పూడ్చివేసి బిల్డింగ్ పడిపోకుండా కాపాడాలని కోరుతున్నారు. అపార్ట్మెంట్‌లోని ఫ్లాట్ లలో నివసించాలంటే, ప్రతి రోజూ ప్రాణభయంతో జీవిస్తున్నామన్నారు. తమ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ బిల్డర్ పొరపాటున గ్రౌండ్ ఫ్లోర్‌లో కాకుండా బేస్‌మెంట్‌లో పార్కింగ్ స్థలాన్ని నిర్మించాడన్నారు. పిల్లర్లు బలహీన పడటం వల్ల తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని, దీని ఫలితంగా మొత్తం అపార్ట్మెంట్ కాంప్లెక్స్ కూలిపోయి వందలాది మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని వారు భయాందోళన చెందుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను బిల్డర్ చట్టవిరుద్ధంగా విక్రయించాడని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో గీతా గ్రాండ్ ఇయర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, హమ్ దాస్, పి సాయి బాబర్, మల్లి కేస్ సెర్నా రెడ్డి ,శ్రీనివాస్, శ్రీకాంత్ ,నాగరాజు, తదితర అపార్ట్మెంట్ ఫ్లాట్ యజమానులు ఉన్నారు.

హృద్రోగ శాస్త్రాల అభివృద్ధి వేగవంతం కావాలి



- వైద్య నిపుణులు
- కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా 'కరోనరీ అనస్థోమోసిస్ వెట్ ల్యాబ్'

నవతెలంగాణ-బంజారా హిల్స్

హృద్రోగ శాస్త్రాల అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు శస్త్ర చికిత్స నిపుణులు తమ నైపుణ్యాన్ని మరింత సానుకూలం చేసుకునేందుకు క్రమం తప్పని అభ్యాస సామర్థ్యం ఉండాలని వైద్య నిపుణులు అన్నారు. శస్త్ర చికిత్స నిపుణుల సామర్థ్యం పెంపు, నైపుణ్యాల మెరుగుదల లక్ష్యంగా మంగళవారం బంజారాహిల్స్ లోని కేర్ ఆస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన 'కరోనరీ అనస్తోమోసిస్ వెట్ ల్యాబ్' నిర్వహణ మంగళవారం విజయవంతం చేశారు.

కేర్ ఆస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డా.గుత్తి రామ సుబ్రహ్మణ్యం, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జాకబ్ జేమ్స్ రాజ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వైద్య కార్యశాల.. ఔత్సాహిక హృద్రోగ నిపుణులు పలు అంశాలపై అవగాహన పెంచు కోవడంతో పాటు తమ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకొనే అమూల్యమైన అవకాశాన్ని కల్పించింది. ఈ కార్యశాలలో పాల్గొన్న వారు స్వయంగా చేతి శిక్షణ (హ్యాండ్ అండ్ ట్రైనింగ్) పొందే అవకాశం ఉండటంతో.. అత్యాధునిక పరికరాలను వినియోగించి క్లిష్టమైన కరోనరీ అనస్తోమోసిస్ విధానాలను అభ్యసించారు. అంతేగాక ముఖాముఖి చర్చల్లో పాల్గొని సైద్ధాంతిక పరిజ్ఞానం, ఆచరణాత్మక విధానాల మధ్య అంతరాన్ని గుర్తించడంలో సఫలం అయ్యా రు. ఆచరణాత్మక అనుభవంతో తమలోని శస్త్ర చికిత్స నైపుణ్యాలకు తగిన పరిజ్ఞానాన్ని సమకూర్చు కున్నారు.

ఈ సందర్భంగా డా. గుత్తి రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శస్త్ర చికిత్స నిపుణులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు వారికి వాస్తవిక పరిస్థితిపై అవగాహన కల్పించడంలో సహాయక వాతావరణం అందించే లక్ష్యంతో ఈ కార్యశాలను నిర్వహించామన్నారు. సదస్సులో పాల్గొన్నవారి అంకితభావం, నిబద్ధత, ఉత్సాహం ముచ్చట గొలిపాయన్నారు. కార్డియాక్ సర్జరీలో ప్రయో గాత్మక శిక్షణ ప్రాముఖ్యతకు వెట్ ల్యాబ్ విజయవంతం కావడం నిదర్శనం అన్నారు. కేర్ ఆస్పత్రి సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్ మాట్లాడుతూ.. హద్రోగ శాస్త్రాలను అభివద్ధి చేయడంలో కేర్ నిబద్ధతకు మారుపేరుగా నిలిచిందన్నారు. విద్య నైపుణ్యాలను పెంపొందించడంలో అంకితభావంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. బలమై న విద్యా వాతావరణం ముఖ్యమని తాము భావిస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో పెట్టుబ డులు పెట్టడం ద్వారా నిరంతర అభ్యాసన, పరిశోధనను తాము ప్రోత్సహిస్తామన్నారు. కేర్ ద్వారా సైద్ధాంతిక జ్ఞానాన్ని మిళితం చేసే సమగ్ర విద్యా కార్యక్రమాలను అందిస్తున్నట్టు వెల్లడించారు. కార్డియాక్ కేర్‌లో తాము అగ్రగామిగా ఉండటంతో పాటు ఈ రంగం భవిష్యత్తును మరింత మెరుగుపరిచేందుకు ఎల్లప్పుడూ శ్రమిస్తామన్నారు.

వైద్య సదస్సులో దేశంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గుండె శస్త్ర చికిత్స నిపుణులు పాల్గొన్నారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ, కార్యక్రమాల నిర్వహణ, బోధన నాణ్యత, ఆచరణాత్మక అనుభవం తమకు సంతప్తిని కలిగించాయన్నారు. సదస్సు ద్వారా తెలుసుకున్న మెలకువలు తమ దైనందిన ఆచరణాత్మక విధానానికి (క్లినికల్ ప్రాక్టీస్) ఉపయోగపడతాయని, సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని అభిప్రాయపడ్డారు.



పదవుల కోసం పెరుగుతున్న నాయకుల ఒత్తిడి

- కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడంతో మొదలైన పైరవీలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం కంటో న్మెంట్‌లో కూడా ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విజయ కీర్తన ఎగరవేయడంతో కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ఆశపడుతున్నారు. ముఖ్యంగా సీనియర్ నాయకులతో పాటు ఎన్నికల ముందు పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు పదవులు ఆశిస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు పై, ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై పదవుల కోసం పలువురు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్, ఆలయ కమిటీల చైర్మెన్ పదవుల కోసం పలువురు సీనియర్ నాయ కులతో పాటు జూనియర్ నాయకులు కూడా పావులు కలుపుతున్నారని తెలుస్తోంది. ఇప్పటి నుంచే పైరవీలు మొదలు పెడుతున్నట్టు సమాచారం.

కాంగ్రెస్ ఆటుపోటులో ఉన్నప్పటికీ పార్టీని అంటి పెట్టుకున్న నాయకుల కంటే ఇటీవల వివిధ పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులు ఎక్కువ పైరవీలు చేస్తుండడం గమనార్హం. దాంతో సీనియర్లకు ప్రాధాన్యత లేకుండా జూనియర్లకు అవకాశం కల్పిస్తారన్న ఆందోళనలో పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు. మొదట సీనియర్ నాయకులకే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. ఏదేమైనప్పటికీ పదవుల కోసం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి హనుమంతరావు పై నాయకులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. తమకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీనియర్లు కాంగ్రెస్ అధిష్టానానికి డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం లభిస్తుంది



- పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్
- శాతవాహన యూనివర్సిటీలో రెండో రోజు శారీరక సామర్థ్య పరీక్షలు

నవతెలంగాణ-ఓయూ

క్రీడలతో దేహదారుఢ్యం ,శారీరక పటుత్వం లభిస్తాయని పీఈసెట్ కన్వీనర్ ప్రొపెసర్ రాజేష్ కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మంగళవారం రెండో రోజు పీసెట్ 2024 శారీరక సామర్థ్య పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే పీ సెట్ అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో మంచి ప్రతిభ చాటుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 18 ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలు ఉన్నాయన్నారు. రెండో రోజు మొత్తం 470 మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం హాజరైన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ , షాట్ పుట్, హై జంప్ లతోపాటు కోకో, కబడ్డీ ,వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాట్మింటన్, పుట్‌బాల్ ,బాస్కెట్‌బాల్, క్రికెట్ తదితర క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జే ప్రభాకర్ రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, పీడీలు శ్రీధర్ రావు, నాగేశ్వరరావు , బాలరాజు,పన్యాల శ్రీనాథ్ రెడ్డి, ఏ రవీందర్, అంతర్జాతీయ కోకో క్రీడాకారుడు నవీన్ కుమార్ పాల్గొన్నారు.



'రామ్‌దాస్‌కు మంత్రి పదవి హర్షణీయం'

నవతెలంగాణ-బంజారాహిల్స్

మూడు దశాబ్దాలుగా బడుగు,బలహీన వర్గాల సామా జిక న్యాయం, సాధికారత కోసం పోరాడుతున్న రామ్‌దాస్ అతు వాలేకు మరోసారి మంత్రిగా అవకాశం కల్పిం చడం సంతోషిం చదగ్గ విషయమని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు,ఏఆర్ మల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మల్లు శివరాం అన్నారు. బలహీనవర్గాలను మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించిందన్నారు. మంగళవారం కేంద్ర మంత్రి రామ్‌దాస్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం, సాధికారత లభించినప్పుడే అంబేడ్కర్ ఆశయాలు నేరవేరినట్టని ఎన్నోమార్లు రామ్‌దాస్ అతువాలే చెప్పేవారన్నారు. తన తండ్రి దివంగత మల్లు అనంత రాములు కూడా కాంగ్రెస్ పార్టీకి కొన్ని దశాబ్దాల పాటు సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన మాజీ ప్రధాని ఇందిర గాంధికి ఎంతో నమ్మకంగా మెలిగారని చెప్పారు. తాము ఎ.ఆర్.మల్లు ఫౌండేషన్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కిషన్ రెడ్డికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఓయూ



బొగ్గు గనుల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా నియమి తులైన కిషన్ రెడ్డినిఉస్మానియా యూనివర్సిటీ, విద్యార్థి ఉద్యమ నాయకుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎనుగంటి రాజు నేత ఢిల్లీలోని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు నేత మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరు తెలంగాణ యాత్ర చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షను అప్పటి ప్రభుత్వాలకు తెలిపిన గొప్ప నాయకులు కిషన్ రెడ్డి అని అన్నారు. యువ మోర్చా నాయకుడిగా తన రాజకీయ జీవితం ప్రారంభించి ఎమ్మెల్యేగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా ఏ బాధ్యత అప్పజెప్పినా పార్టీ కోసం నిరంతరంగా శ్రమిస్తూ, పార్టీ అభివద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నిజమైన నాయకుడికి కేంద్ర ప్రభు త్వం మరొకసారి క్యాబినెట్ మంత్రిగా అవకాశం కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచే యాలన్నారు.





నగరంలో గంటపాటు దంచికొట్టిన వర్షం

- పలు ప్రాంతాలు జలమయం
- భారీగా ట్రాఫిక్ జామ్‌లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం గంటపాటు వర్షం దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి ట్యాంక్‌బండ్, బేగంపేట్, లిబర్టీ, ఖైరతాబాద్, రాణిగంజ్ అమీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో గంటలతరబడి వాహనాలు ఎక్కడికి అక్కడే ఆగిపోయాయి. పీక్ అవర్ కావడంతో రవీంద్రభారతి, రిజర్వ్‌బ్యాంక్, తెలుగుతల్లి ఫ్లైఓవర్ తరదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. ఇదిలా ఉండగా రాబోయే రోజుల్లో నగర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కాప్రా, దమ్మాయిగూడ, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కొంపల్లి, జీడిమెట్ల, దుండిగల్, జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, నిజాంపేట్, మియాపూర్, బేగంపేట్, ముషీరాబాద్, ఓయూ, తార్నాక, సరూర్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాహనదారులు అలర్ట్‌గా ఉండాలని హెచ్చరించారు. అవసరమైతే తప్పా ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు.

అశ్రు నయనాల మధ్య శంకర్ యాదవ్ అంత్యక్రియలు

- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు



నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అసోసి యేషన్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ అంత్య క్రియలు మంగళవారం వేలాదిమంది సమక్షంలో జరిగాయి. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తెల్లవా రుజామున మరణించగా మంగళవారం కుటుంబ సభ్యులు బన్సీలాల్ పేటలోని గ్రేవ్ యార్డ్‌లో అంత్య క్రియలు నిర్వహించారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నీ తానై అంత్యక్రియలు పూర్త య్యే వరకు పర్యవేక్షించారు. తన అన్న మృతదేహాన్ని చూసి ఆయన పలు మార్లు కన్నీటి పర్యంతమైనారు. అది చూసిన వారు సైతం కంట నీరు పెట్టారు.

వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసం వద్ద నుండి ప్రారంభమైన అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, అధికారులు, వేలాది సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమ యాత్ర వైఎంసీఏ క్లాక్ టవర్, మోండా మార్కెట్, బండి మెట్, సిటీ లైట్ హోటల్, జబ్బార్ కాంప్లెక్స్ మీదుగా బన్సీలాల్ పేట గ్రేవ్ యార్డ్ కు చేరుకుంది. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో శంకర్ యాదవ్ అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు వ్యాపా రులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పలు ప్రధాన కూడళ్ళ వద్ద శంకర్ యాదవ్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. అంతిమ యాత్ర మోండా మార్కెట్‌కు చేరుకున్న సమయంలో మోండా మార్కెట్‌లోని పలువురు వ్యాపారులు, మహిళలు శంకర్ యాదవ్ కు నివాళులు అర్పిం చారు. తమకు అన్ని వేళలా అండగా ఉండే శంకర్ అన్న మరణించాడనే వార్తను నమ్మలేకపోతున్నామని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎదుట వారు కన్నీటి పర్యంతమైనారు.

శంకర్ యాదవ్‌కు నివాళ్లర్పించిన ప్రముఖులు

అంతిమయాత్రకు ముందు రాధికా కాలనీలోని నివాసంలో తలసాని శంకర్ యాదవ్ మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, వివేక్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు శంకర్ యాదవ్ పార్థీవ దేహానికి నివాళులు అర్పిం చారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

అంతిమయాత్రలో పాల్గొన్న కేటీఆర్

తలసాని శంకర్ యాదవ్ అంతిమయాత్రలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని శంకర్ యాదవ్ మృతదేహానికి నివాళులు అర్పిం చారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించారు. అంతిమయాత్రలో మాజీమం త్రులు జగదీశ్వర్ రెడ్డి, మహమూద్ అలీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మె ల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ కార్పోరేషన్ చైర్మెన్ లు ఎర్రోళ్ల శ్రీనివాస్, అనిల్ కుమార్ కూర్మాచలం తదితరులు పాల్గొని నివాళ్లర్పించారు.



మోగనున్న బడి గంట..!



- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- జిల్లాలో 3వేల పాఠశాలలు..9.70లక్షల మంది విద్యార్థులు
- 80శాతం పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ సరఫరా
- అరకొర వసతుల నడుమే విద్యాసంవత్సరం ఆరంభం..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

రెండు నెలలు పాటు వెలవెలబోయిన పాఠశాలలు నేటితో పున:ప్రారంభంకానున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి బడులు తెరుచుకోనున్నాయి. దీంతో విద్యార్థులతో స్కూళ్లు కళకళలాడనున్నాయి. వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాల్లో గడిపిన విద్యార్థులు ఇక మళ్లీ బడిబాట పట్టనున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటికే తరగతుల్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సర్కారు బడుల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు వివిధ కారణాలతో ఆశించిన స్థాయిలో పూర్తికాక పోవడంతో సమస్యలతోనే పాఠశాలలు దర్శనమివ్వనున్నాయి. ఇదిలావుంటే నేడు ప్రభుత్వ పాఠశాలలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించి.. విద్యార్థులకు స్వాగతం చెప్పేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో మొత్తం 2900వేలకుపైగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలుండగా.. వీటిలో సుమారు 9.70 లక్షలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత, ఎయిడెడ్ స్కూళ్లలో లక్షకుపైగా విద్యార్థులు, 1,953 ప్రయివేటు పాఠశాలలో 8.40లక్షల మంది వెళ్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఈ సంవత్సరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలు 86.76శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తేనే.. సర్కార్ బడులు ఈ ఏడాది మరిన్ని మంచి ఫలితాలు సాధించే అవకాశముందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

చదువులకు ఆటంకంగా ప్రమోషన్లు, బదిలీలు ప్రక్రియ?

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత తీవ్రంగా ఉంది. టీచర్ల కొరత కారణంగా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందడం లేదని విమర్శలు లేకపోలేదు. మరోవైపు జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. గతంలో ఈ ఖాళీల స్థానంలో విద్యావాలం టీర్లను నియమించుకుని కాలం వెళ్లదీసినా.. మూడేండ్లుగా విద్యావాలంటీర్ల నియమాకంపై ఊసే లేదు. ఉన్నవారితో విద్యాసంవత్సరం నెట్టుకొస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. గతేడాది జనవరిలో ప్రభుత్వం ఉపాధ్యాయులు ప్రమోషన్లు, బదిలీలంటూ కాస్త హడావుడి చేసిన మధ్యలోనే ఆగిపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు విద్యాసంవత్సరం ఆరంభంలో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియపై పూర్తిగా నిమగ్నమైన అధికారులు.. విద్యాసంవత్సరం ప్రారంభంపై పెద్దగా శ్రద్ధ చూపడంలేదు. ఈప్రక్రియ ఇలాకొనసాగితే విద్యార్థుల చదువులపై ప్రభావం పడే అవకాశముంది. కాబట్టి ప్రభుత్వం ఎంత త్వరంగా వీలైతే.. అంత త్వరగా ఈ నెలలోనే ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ పూర్తి చేసి.. తద్వారా ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుందని విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. మరి ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది.

80శాతం చేరిన పుస్తకాలు, ఏకరూప దుస్తులు

జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాలా చోట్ల తాగునీటి సమస్య ఉంది. నేటి నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు గొంతు ఎండే పరిస్థితి అక్కడక్కడ కనిపిస్తోంది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు 90శాతం ఉన్నప్పటికీ వాటిని శుభ్రం చేసే స్కావేంజర్లు లేరు. దీంతో మరుగుదొడ్లు కంపు కొట్టే పరిస్థితి లేకపోలేదు. చాలాచోట్ల హెచ్ఎంలు, టీచర్లు కలిసి ప్రయివేట్ వ్యక్తుల నియమించుకోని పనులు చేయిస్తున్నారు. వారికి తమ సొంత డబ్బులు చెల్లిస్తున్నారు. జీహెచ్ఎంసీ కార్మికుల అదనపు పనిభారంతో సతమతమవుతున్న నేపథ్యంలో తిరిగి స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తే బాగుంటుందని టీచర్లు, తల్లిదండ్రులు కోరుతున్నారు. మరి సర్కారు ఆ మేరకు చర్యలు తీసుకుంటే మంచిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తే అందరికీ మేలు..!

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు, పిల్లలకు నమ్మకం కలిగితే.. అప్పుడే వారి పిల్లలు సర్కార్ బడులకు వస్తారు. ఏటా ఈ స్కూళ్లు పదో తరగతి ఫలితాల్లో ప్రయివేటుకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయి. దాంతో ఈ సంవత్సరం ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చదివిస్తే బావుంటుం దనే నమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంత ఏర్పడింది. కానీ అందుకు తగ్గట్టుగా టీచర్ల నియమాకాలు, బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తేనే పూర్తి నమ్మకం వస్తుంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు ప్రారంభమైన.. వివిధ కారణాలతో పనులు స్లోగా నడుస్తున్నాయి. మొదటి విడుతలో 384 స్కూళ్లు రూ.23.04 నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన.. మొత్తం 1287 పనుల్లో ఇప్పటివరకు 279 స్కూళ్లలోనే అభివృద్ధి పనులు పనులు పూర్తి చేశారు. 224 పూర్తి కావొచ్చే దశలో ఉన్నాయి. మరో 800కుపైగా పనులు పురోగతిలో ఉన్నాయి. ఇదిలావుంటే నేటి నుంచి బడులు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు 80శాతమే స్కూళ్లు పాయింట్లకు చేరాయి. మరోవైపు సర్కారు స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం బోధన ప్రచారానికే పరిమితమైంది. మరోవైపు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజు వసూళ్లకు రంగం సిద్ధం చేసుకున్నాయి. రకరకాల కోర్సుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దగా చేసేందుకు రెడీగా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం గురుకుల పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తేనే అందరికీ మేలు జరగనుంది.

మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో విద్యార్థులకు స్వాగతం

పాఠశాలలు పున్నప్రారంభం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో అవసరమైన స్కూళ్లకు పెయింటింగ్స్ వేయించారు. తరగతి గదులను అందంగా తయారు చేశారు. డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు టాయిలెట్లు నిర్మాణం, వాటి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. స్వచ్ఛమైన వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో మూడు చొప్పున ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా స్కూళ్లలో విద్యార్థులకు మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేయనున్నారు. బుధవారం నాంపల్లిలోని గవర్నమెంట్ మోడల్ హైస్కూల్ అలియా పాఠశాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి విద్యార్థులకు స్వాగతం పలకనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తారు. అలాగే బహదూరపూర, చాంద్రాయణగుట్ట, చార్మినార్, గోషామహల్, జూబ్లీహిల్స్, కార్వాన్, ఖైరతాబాద్, మలక్‌పేట్, ముషీరాబాద్, నాంపల్లి, సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, యాకుత్‌పూర నియోజకవర్గాల్లో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాల్గొని మండల విద్యాధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేయనున్నారు.



ప్రారంభానికి ముస్తాబైన పాఠశాల

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL, DISTRICT & SESSIONS JUDGE AT SIRCILLA
O.S. No. 57 of 2018

Between: -
Chepuri Buchaiah ...Plaintiff
And
Chepuri Shankaraiah (Died) & 14 Others ...Respondents

To,
D9: Yerra Sukanya w/o. Srinivas, aged 52 years, occ: Household, r/o. Flat No. 309, Happy Home apartment, Beside Golnaka church, Golnaka, Hyderabad

Whereas the above named plaintiff filed above referred suit against the defendants no. 1 to 15 herein for partition and separate possession with metes and bounds in respect of suit schedule properties, situated at Sircilla proper and Mandal and Thangallapally proper and Mandal of Rajanna Sircilla District.

Take notice that the above case is **posted on: 27-06-2024 at 10.30 A.M.** for the appearance of you the defendant no. 9 before this Hon'ble Court in person or through duly authorized Advocate, failing which the matter would be adjudged in your absence.

/BY ORDER OF THE COURT/
Sd/-
S. VASANTHAM
ADVOCATE, SIRCILLA
MOBILE NO: 9440432632

DOCUMENT LOST

I, P Ramanand S/o Late P Kotaiah R/o # 13-1/53/7, Saipuri colony, Malkajgiri Hyderabad 500 047, have lost my original provisional plot allotment letter proceeding no C/6RR/1130 /2005 dated 04/12/2007 issued by the HMDA-ORR project , while shifting my house. If found please inform me in the above-mentioned address or **Phone No. 9848449856.**

IN THE COURT OF XIX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.NO.3996 OF 2022

Between:
Smt Balpe Madhavi ...Plaintiff
AND
B.Balaji & others ...Defendants

To,
B.Rakesh, S/o.Not known, R/o H.No.3-4-73/30/1, Near Old Raghavendra Swamy Temple, Kachiguda, Lingampally, Hyderabad (Defendant No.3)

Take notice that the plaintiff filed the above suit for perpetual injunction for grant of perpetual injunction restraining you and others from interfering with the suit schedule property and the same stands posted **to 18.06.2024 at 10.30 A.M.**, for your appearance either through in person or advocate. If you fail to appear on that day the matter will be decided in you absence.

T.RADHAKISHAN RAO
ADVOCATE
Plot No. 26, Road No.2
Arunodaya Colony, Nogole,
Hyderabad-500068
Phone: 9866599013

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE,MEDCHAL AND MALKAJGIRI DISTRICT, AT : MALKAJGIRI
O.S.NO. 501 OF 2024

Between:
Smt.Ruth Lois Angeline D/o. Late.Duraisingh James,W/o. Sri.Arul Johnson,Aged: 41 years, Occ: Pvt.Employee,R/o. Flat No.102,G.K.Marigold, Hasthina puram Cross 3,Near Sainikpuri Post Office,Sainikpuri, Hyderabad 500094 (Mobile No: 9177213675) - Plaintiff
AND
1. The Tahsildar,Kapra Mandal, FHP 7 + XJ9 Sai Priya Colony, Secunderabad -500094
2. To whomsoever Concerned - Defendants

To,
Whom so ever Concerned

Whereas the Plaintiff Smt.Ruth Lois Angeline has instituted the above suit for Declaration of the Plaintiff as Legal Heir of the Deceased Sri.Mervin Jonathan Noel who expired on 01-12-2023 at Warsaw, Poland against the Defendants herein. Any person or persons having any objection for grant of said Declaration of the Plaintiff as Legal Heir of the Deceased Sri.Mervin Jonathan Noel may appear before the above said court in person or by duly authorized advocate on 18-06-2024 at 10.30 a.m. with the objection petition. In case no objections are received the matter will be disposed off exparte.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s.G. Maruthi Rao,
Advocates,
Office at Plot No.77, H.No:- 4-11-003,Syndicate Bank Colony, West Marredpally,,Secunderabad 500026
Mobile No. 9700022159

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.No. 2061 OF 2024

Between
1. **Anuradha,** W/o.Dara Narsing Rao, D/o. Kyatham Venkateshwar Rao, Age: 58 years, Occ: Housewife, R/o. H.No. 17-7-345, Brahman Wadi, Yakutpura, Charminar, Hyderabad-23
2. **Puppala Archana,** W/o. Puppala Prashant, D/o. Kyatham Venkateshwar Rao, Age: 55 years, Occ: Housewife, R/o. H.No. 5-1-563/5, Jambagh, Troop Bazar, Nampally, Hyderabad.
3. **Kyatham Veerabhadra Rao,** S/o. Kyatham Venkateshwar Rao, Age: 54 years, Occ: Business, R/o. H.No. 16-9-759/5, Race Club Road, Near Meat Market, Old Malakpet, Hyderabad.
4. **K. Maheswari,** W/o. Late K. Srinivas Rao, Age: 49 years, Occ: Housewife, R/o. H.No. 16-9-759/5, Race Club Road, Near Meat Market, Old Malakpet, Hyderabad. ...Plaintiffs

AND
1. **The Tahsildar,** Amberpet Mandal, Hyderabad.
2. **All Concerned** ...Defendants

To,
ALL CONCERNED

NOTICE

Please take notice that the Plaintiffs herein have filed the above suit to declare them as legal heirs of **Late Kyatham Venkateshwar Rao & Late K. Rukmini Bai,** against defendants and the said matter is posted on **18.06.2024** by the Hon'ble Court to receive any objections of persons opposing. If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief, they may put forth their objections before the Hon'ble Court on **18.06.2024** at 10:30 A.M either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law. Hence this NOTICE,

// BY ORDER OF THE COURT //
Sd/- **B. K. SAMPATH,**
JAYASREE B. K.,
K. PRAVEENA REDDY,
Advocates,
H.No. 3-5-302 & 303, Vittalwadi, Narayanaguda, Hyderabad-29.

IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT:N.T.R.NAGAR, R.R.DISTRICT
I.A.No. 241 of 2023
in
A.S.No.152 of 2022

Between:
B.Ashok Reddy (died) and others ...Appellants/Plaintiffs
AND
Bhonagri Balraj and others ...Respondents/Defendants.
1.B.Madhavi, W/o.B.Srinivas, aged about 46yrs, Occ;Housewife R/o.18-1-337/B/5, Sai Baba Nagar, Uppuguda, Bandlaguda, Hyderabad-500053.
2.M.Swapna, W/o.M.Buchi Babu, aged about 40yrs, Occ:Housewife R/o.8-1-15/29/1, Near Durga Matha Temple, Saroor Nagar, R.R.Dist 500079. Padma Nagar Colony, Karmanghat, ...Proposed Respondent Nos.7&8

Please take notice that the above-named Appellants herein filed the Appeal questioning the Judgment and Decree dated:29-06-2022, Passed in O.S.No.11 of 2016 on the file of the Junior Civil Judge, at Maheshwaram, Ranga Reddy District and also sought other reliefs. You are hereby summoned to appear before the Hon'ble 1st Additional District Judge, at N.T.R Nagar, Ranga Reddy District, **at 10.30 am on 28-06-2024** either in person or through your counsel failing which the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE HON'BLE COURT)
R.Rama Brahmma,
Advocate
#6-1-905, Near Railway Gate, Khairtabad, Hyderabad 500 004
Cell:9885657788

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM CHIEF JDGE CITI CIVIL COURT AT:HYDERABAD.
O.P.NO.2017 OF 2023

BETWEEN:
Vankudothu Biknu. ...Petitioner
AND
Bongu Krishna Murthy.and others. ...Respondents.

To,
1.Bongu Krishna Murthy, S/o. Yadagiri, Occ:Business/Owner of the Lorry bearing No.TS 08 UD 3249,R/o.H.No.3-11-184/13/1, Huda Residency, L.B. Nagar, Rangareddy Dist ...R1

Please take Notice that the above OP is filed against you and others for grant of Compensassion the Hon'ble court posted above case **on 21-6-2024.at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.Goda Venkateshwarlu,
Advocate
Hyderabad.

IN THE COURT OF THE M.A.C.T CUM XI ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.P.No.524 of 2023

Between:
V.Pramila & Another ...Claimants
AND
Alakunta Mounika & Others ...Respondents

To,
Ergadendla Ramesh S/o. E.Yellaiah R/O H.No.6-251/5/50/A, Zaffarguda Rajendranagar, R.R.Dist.
Ameer Amza Paramanik S/o. Samad Ali Paramanik R/o.H.No. 12-89/4, Medchal Check Post Medchal, Medchal-Malkajgiri Dist.

Whereas the above petitioner has filed petition for compensation under Motor vehicle Act against Lakunta Mounika & Others. The said case is posted **on 26-06-2024** for your appearance before the above said court **at 10-30 AM** if you failed to appear on that day either in person or through advocate before the said court the matter will beheard exparte.

(BY ORDER OF THE COURT)
M.RAM MOHAN
ADVOCATE
Plot No. 174, Venkateshwara Nagar Colony, Suchitra, Sec-bad

IN THE COURT OF THE HON'BLE III ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-XIV ADDL.METRO POLITAN MAGISTRATE::MEDCHAL MALKAJGIRI DISTRICT AT : KUKATPALLY
O.S. NO. 271 OF 2024

BETWEEN:
SMT. JENJIRALA KOUSALYA & 3 OTHERS ....PLAINTIFFS
AND
1. The Tahsildar, Kukatpally Mandal, Medchal Malkajgiri District
2. All Concerned ....DEFENDANTS

To,
All Concerned

NOTICE

Please take notice that the above named Plaintiffs No.1 to 4 are filed above Suit for Declaration declaring them as the legal successors/ Legal heirs of deceased Late Jengirala Shankar, S/o. Late Jenjirala Laxmaiah who died on 21-01-2024. The said case stands posted on 27-06-2024 for objections if any from all concerned. Therefore, make it to be convenient to present at 10:30 A.M. on 27-06-2024 before the Hon'ble III Addl. Junior civil Judge-cum-XIV Addl. Metro Politan Magistrate at Kukatpally with your objections or claims if any. Failing which the matter will be heard and decided in your absence as per the records available on record Hence this Notice.

// BY ORDER OF THE HON'BLE COURT //
Sd/-YETURU SRINIVASULU (TS/2420/1999),
A.ANUSHA,
ADVOCATES,
Office: 25-35/3/C, Sekhar's Arcade, Ramachandra Reddy Nagar, Ramachandra Puram, Hyderabad-502 032. T.S.
Cell No:9440080503

IN THE COURT OF XIX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD
I.A.NO.335 OF 2022
IN
O.S.NO.3996 OF 2022

Between:
Smt.Balpe Madhavi ...Petitioner/Plaintiff
AND
B.Balaji & others ...Respondents/Defendants

To,
B.Rakesh, S/o Not known, R/o H.No.3-4-73/30/1, Near Old Raghavendra Swamy Temple, Kachiguda, Lingampally, Hyderabad (Respondent No.3)

Take notice that the petitioner filed the above suit for perpetual injunction and also filed IA No.335/2022 for grant of temporary injunction restraining you and others from interfering with the the suit schedule property and the same stands posted **to 18.06.2024 at 10.30 A.M.**, for your appearance either through in person or advocate. If you fail to appear on that day the matter will be decided in you absence.

T.RADHAKISHAN RAO
ADVOCATE
Plot No. 26, Road No.2
Arunodaya Colony, Nogole,
Hyderabad-500068
Phone: 9866599013

IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.P:No.2410 of 2023

Between:
P.Venkataiah ...Petitioner
AND
G.Nagesh Kumar and others ...Respondents

To,
1).G.Nagesh Kumar S/o. G.Surya narayana, R/o.EWSH-149, APHB Colony, Moula Ali, Hyd- 500040
2).V.Sagar S/o.V.Srinivas, R/o. 1-1-29/A/186, Adarsh Nagar, Kapra, ECIL, Medchal, Malkajgiri - 500062 ...Respondent No.1 & 3

Take notice that the above petitioner had filed the case against you for grant of compensation for the injuries sustained by her in motor accident and the case is posted **to 23/07/2024 at 10-30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off: Flat No.226, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyd-500036. Cell:9848260446

IN THE COURT OF THE HON'BLE I ADDL.JUNIOR CIVIL JUDGE-cum- XII ADDL. METROPOLITAN MAGISTRATE: RAJENDERNAGAR; R.R.DIST.
O.S.No.207 of 2024

Between:-
MUDDAGONI ANURADHA & 2 Others. ...PLAINTIFFS
AND
1)The Tahsildar, Rajendranagar Mandal, R. R.Dist.
2)ALL CONCERNED. ...DEFENDANTS

NOTICE

To:
ALL CONCERNED.

Please take notice that the plaintiffs have filed suit for declaration, declaring the plaintiffs are the legal heirs of deceased MUDDAGONI GYANESHWAR alias GYANESHWAR COUD who expired on 03-12-2022 against the defendants, and the same is posted **to 04-07-2024** for appearance of Defendant No.2 alongwith relevant documentary evidence **at about 10.30 AM** either in person or through their counsel, failing which the Hon'ble Court may pass appropriate orders against Defendant No.2.

//BY ORDER OF THE HON'BLE COURT//
M/s.P.SURYA PRAKASH
Advocate.
Off: Kartheek Law Chambers, 2nd floor, 10-2-299/E, Vijaynagar colony, Hyd-57
COUNSEL FOR PLAINTIFFS

CHANGE OF NAME

I, **Kotha Krishnaveni**, W/o. Gampa Parameshwar, aged about 53 years old, residing at Flat no: 709, Manjeera Trinity Homes, 3rd Phase, KPHB Colony, Kukatpally, Medchal, Hyderabad, Telangana State- 500085, do hereby declare that my name "Gampa Krishnaveni" (old name) have changed to "Kotha Krishnaveni" (new name) for all future purposes.

IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT: N.T.R.NAGAR, R.R.DISTRICT
I.A.No.1216 of 2023
IN
I.A.No.1105 of 2022
IN
A.S.No.152 of 2022

Between:
B.Ashok Reddy (died) and others ...Appellants/Plaintiff
AND
Bhonagri Balraj and others ...Respondents/Defendants.
1.B.Madhavi, W/o.B.Srinivas,aged about 46yrs, Occ:Housewife, R/o. 18-1-337/B/5, Sai Baba Nagar, Uppuguda, Bandlaguda, Hyderabad 500 053.
2.M.Swapna, W/o.M.Buchi Babu, aged about 40yrs, Occ:Housewife R/o.8-1-15/29/1, Near Durga Matha Temple. Padma Nagar Colony, Karmanghat, Saroor Nagar, R.R.Dist-500 079. ...Proposed Respondent Nos.7& 8

Please take notice that the above-named Appellants herein filed the Appeal questioning the Judgment and Decree dated: 29-06-2022, Passed in O.S.No.11 of 2016 on the file of the Junior Civil Judge, at Maheshwaram, Ranga Reddy District and also sought other reliefs. You are hereby summoned to appear before the Hon'ble 1st Additional District Judge, at N.T.R Nagar, Ranga Reddy District, **at 10.30 am on 28-06-2024** either in person or through your counsel failing which the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE HON'BLE COURT)
R.Rama Brahmma.
Advocate
#6-1-905, Near Railway Gate, Khairtabad, Hyderabad 500 004
Cell:9885657788

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT: HYDERABAD
FA.No.351/2023

Between:
Sri.Kapil Kedia S/o.Late.Arjun Kedia Aged about: 37Yrs Occ: Business, R/o.H.No.16-2-147/F/1/1, Anand Nagar Malakpet, Hyderabad-500036 ...APPELLANT/COMPLIANANT
AND
1.M/s National Insurance India Co.Ltd Rep.by its BranchManager Office at 11-8-116/4/G4, MJR Enclave, Road No.2 Narasimha puri Colony, Saroornagar Hyderabad-500035
2.National Insurance India Co.Ltd Rep.by its Senior Divisional Manager Office at 3, Middleton Street, Kolkata-700071
3.INTECH Insurance and surveyors and loss Assessors Pvt Ltd Rep.by its Authorized Signatory, office at Suit No. 403, 4th floor, Altos A & M Trade Centre, Himayatnagar, Hyderabad Telangana-500029 ...RESPONDENTS/OPP.PARTIES

In obedience to the directions of the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission in FA NO/351/2023 dated 05-06-2024 directed the Appellant to get the Notice published in the local edition of Nava Telangana Newspaper, and accordingly the publication is being made. The matter now stands posted **to 26-07-2024,** for Respondent No.3, Appearance either in person or through a counsel. If you fail to appear, the Hon'ble commission may pass appropriate orders by setting you as exparte.

A.NAVEEN KUMAR
ADVOCATE
Res.:15-93, P&T Colony. Dilsukhnagar, Hyd-500 060.
Cell: 9700380730

DOCUMENT LOST

I, P Narendar S/O Late P Kotaiah R/O # 13-88, Yadavnagar Malkajgiri Hyderabad- 500047. have lost my original Provisional Plot allotment letter Proceeding no C/6RR/1130/2005 dated 04/12/2007 issued by ORR Project (HMDA) during Shifting my brother house. If found Please Inform me in the above mentioned address Or **Phone No. 99490 63366**

PUBLIC NOTICE

The public is hereby informed that **SRI.MADDUKURI SRINIVASA RAO S/o.Late.MADDAKURIBHAGAVA NARAYANA,** has lost the Original Sale Deed property document **on 07-06-2024 at 12.30 pm** while travelling from Kukatpally to Gandipet Sub Registration office, Situated at Narsingi Village for the purpouse of registration workwhereas, the lost Link document whose schedule of property shows that Open Plot bearing Nos.43,44, 45 and 46 admeasuring 1777.7 Sq.yards in Survey No.159, Situated at Narsingi Village, GandipetMandal, Ranga Reddy District, Telangana State. The Registered Sale Deed Document No.2044/1967, Dated:06/10/1967, Registered at S.R.O.Hyderabad West. Where as the absolute owner was his father Sri.MADDAKURI BHAGAVA NARAYANA S/o VENKANNA purchased from its absolute owner. If anybody find such document, they are requested by our client **SRI.MADDUKURI SRINIVASA RAO S/o Late. MADDUKURIBHAGAVA NARAYANA** to return it to the below address and shall be rewarded with Good and Handsome money.

sd-
G.VENKAT RAM REDDY
VARALA MAHENDAR YADAV
ADVOCATES
Flat No: 20 Soni Commercial Complex
Kukatpally Hyderabad -500072
mobile no : 9959639542

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT :: AT: HAYATHNAGAR
O.S.No.413 of 2024

Between:
Munugala Padmini ...Plaintiff
AND
All concerned ...Defendants

To,
All Concerned

Please take notice that, the Plaintiff has filed the above SUIT for declaration to declare her as legal heir of Late Munugala Narsimha Reddy @ Munagala Narsi Reddy who died on 25-01-2009 in respect of Suit Schedule A and B Properties and the same has been posted on 09-07-2024. If any person(s) having any objection or claims, they may appear **on 09- 07-2024 at 10:30 AM** before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record.

SCHEDULE 'A' PROPERTY

All that the open land vide plot No. 303, admeasuring 200 Sq.Yards equivalent to 167.23.Sq.Mtrs in Survey No.172, 174 and 175, situated at Srinivasa Nagar Phase-I, Koheda Village, Hayathnagar Mandal (Presently Abdullapurmet Mandal), Ranga Reddy District., and bounded by :

North : Plot No. 309
South : 30' Ft wide road
East : Plot No. 302
West : Plot No. 304

SCHEDULE 'B' PROPERTY

All that the open land vide plot No. 109/1, admeasuring 200 Sq. Yards equivalent to 167.23 Sq. Mtrs in Survey No.172, 174 and 175, situated at Srinivasa Nagar Phase-I, Koheda Village, Hayathnagar Mandal (Presently Abdullapurmet Mandal), Ranga Reddy District., and bounded by :

North : Plot No.136/1
South : 30' Ft wide road
East : Plot No.109/2
West : Plot No.109

\\By order of the court
M/s.K.Surender Reddy
Advocates
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.2287 of 2024

Between:
Smt.Anusuya Mohan W/o.Late Mohan Ramaswamy Aged about 63yrs, Occ: Housewife
2.Smt.Harini Chitra Mohan D/o Late Mohan Ramaswamy W/o. Late P.Rajesh Aged about 42 yrs, Occ: Housewife
Both Residents of H.No: 6-3-609/10/13 II Floor, Radhakrishna Nilayam Anand Nagar Colony Hyderabad, T.S, ...Plaintiffs
And
1.The Mandal Revenue Officer/ Tahsildar Khairatabad Mandal Opp: Prakasham Vidya Niketan Anand Nagar Colony Khairatabad, Hyderabad.
2.All Concerned ...Defendants

To
All concerned

Whereas the above named Plaintiffs have filed the above numbered suit praying to declare the Plaintiffs as Legal Heirs of Late Mohan Ramaswamy and the above suit is posted **to 10.07.2024** for your appearance **at 10.30 a.m.** If no objections are received on the said date the matter will be decided on merits.

//BY ORDER OF THE HON'BLE COURT // /
Smt.TARA SHARMA
V.Narotham
Advocates
Flat No.201, Murlidhar Apartments West Marredpally
Secunderabad - 500026
Mobile: 9849018615

FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES
(Order V Rules 3 & 5)
IN THE COURT OF THE HON'BLE XXIST JUNIOR CIVIL JUDGE , CITY CIVIL COURT. AT:: HYDERABAD
O.S.No.1826 OF 2024

BETWEEN:
1).Mrs.Darapureddi Nagarani W/o Late Mr.Darapureddi Prakasa Rao aged about 62yrs, Occ:- Private Teacher.Aadhar No:8695-2291-0170.
2).Mrs Darapureddi Deepthi D/o Late Mr.Darapureddi Prakasa Rao, W/o Mr Vikram kumar Jelli aged about 39yrs, Occ:Pvt and PAN NO: AIBPD2284Q. Both R/o H.No:-6-3-595/2, Padmavathi Nagar Park, Khairatabad, Hyd. ...Plaintiff/s
AND
Thasildhar, Khairatabad Mandal Revenue Office, Government of Telangana Khairatabad
2.All Concerned. ...Defendant/s

Whereas the above mentioned plaintiff has instituted as suit against you for DECLARATION OF LEGAL HEIRS U/SEC 26, O-VII AND R- 1 & 2 OF C.P.C.

You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions **on the 15th day of June, 2024, at 10–30 hrs,** in the forenoon to answer the claim, and further, you are hereby directed to file within 30 days of service of summons a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense. Take notice that in default of your appearance and to file your written Statement within 30 days the suit will be heard and determined in your absence.

(BY ORDER FO THE COURT)
K.R.VIJAY & ASSOCIATES
ADVOCATES FOR THE PLAINTIFF'S
H.NO 12-5-35/A/B, Flat No S-7, Ballad Estate Tarnaka, Secunderabad-500017.

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT :: AT: HAYATHNAGAR
O.S.No.403 of 2024

Between:
Smt.E.Laxmamma and others ...Plaintiffs
AND
All concerned ...Defendants

To,
All Concerned

Please take notice that, the Plaintiffs have filed the above SUIT for declaration to declare them as legal heirs of Late Enugu Narsimha Reddy S/o.Enugu Venkat Reddy who died on 26-03-2015 in respect of Suit Schedule Property and the same has been posted on 04-07-2024. If any person(s) having any objection or claims, they may appear o**n 04-07-2024 at 10:30 AM** before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record.

SCHEDULE PROPERTY

All that land bearing Plot No.56, admeasuring an area of 200.Sq. Yds or 167.23.Sq.Mtrs.in Survey No.104, situated at Asian Enclave of Kawadipally Village and Gram panchayat, Hayathnagar Mandal (Presently Abdullapurmet Mandal), Ranga Reddy Dist., bounded by :

North : Plot No. 57
South : Plot No. 55
East : 33' Wide Road
West : Plot No. 47

\\By order of the court
M/s.K.Surender Reddy
Advocates
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDI.METROPOLITAN MAGISTRATE: HAYATHNAGAR RANGA REDDY DISTRICT: AT: HAYATHNAGAR
O.S.No.389 OF 2024

Between:
Periketi Janakamma ...Plaintiff
And
1.Sri.Periketi Venkateswarlu
2.Sri.Pereketi Ramachary
3.The Tahsildar/M.R.O, Abdulla purmet Mandal Ranga Reddy Dist
4.All Concerned. ...Defendants

To
All concerned ...Defendant No.4

NOTICE

Please take notice that the above named plaintiff have filed above suit for declaration to declare the plaintiff as Legal Heirs of Late Laxmana Chary Periketi who died intestate on 17.05.2023 in respect of the suit schedule property and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court **on 02.07.2024 at 10.30 AM,** either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

SCHEDULE OF PROPERTY

All that piece and parcel of the Open Land bearing Plot No.24, admeasuring an area of 200 Sq. yards or 167.23 Sq.mtrs, in Sy.No. 29,30,32,33 and 40, situated at SRI LAKSHMI ENCLAVE-II" of Surmaiguda Village, Abdullapur met Revenue Mandal, (formerly Hayathnagar Revenue Mandal), Ranga Reddy District, under Lashkarguda Grampanchayath, registration Sub-District Abdulla purmet, Telangana state and bounded by:

North : Plot No.23,
South : Plot No.25,
East: Plot No.2,
West: 33ft Wide Road

//By Order of the court//
PARNE INDRA REDDY
Advocate
Plot No.7, Sy.no.208, Near SBI Bank, Abdullapurmet, R.R.District
Ph: 99480 92138

'మిసెస్ వరల్డ్ ప్రైడ్ ను గెలుచుకున్న నితాన్య'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్-2024, సీజన్-2 అందాల పోటీలు లీలా యాంబియన్స్ గుర్గావ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన నితాన్య టీఎం మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్-2024, సీజన్-2లో మిసెస్ వరల్డ్ ప్రైడ్ అనే ప్రతిష్టాత్మక బిరుదును గెల్చుకుంది. ఈ ఘనత నితాన్య అసాధారణ పయనమైన స్థితిస్థాపకత, సంకల్పం వ్యవస్థాపక విజయానికి నిదర్శనం. మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్-2024, సీజన్-2 గ్రాండ్ ఫినాలే ఉత్కంఠభరితమైన ఈవెంట్, దీనికి ఫ్యాషన్, వినోద రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. గ్లామర్ గుర్గావ్, బరా నాంగియా, మిస్టర్ అభిషేక్ నంజియా దార్శనిక వ్యవస్థాపకులు, డైరెక్టర్లు నిర్వహించిన ఈ ఈవెంట్ ప్రపంచ వ్యాప్తంగా వివాహిత స్త్రీల అందం, తెలివితేటలు, ధైర్యాన్ని హైలైట్ చేస్తూ వారి విభిన్న విజయాలను అందుకుంది. నితాన్య నితి బ్రాండ్ కు వ్యవస్థాపకురాలుగా కొనసాగుతున్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న అహ్మద్ కుటుంబానికి ఒక లక్ష రూపా యల ఎల్‌ఓసిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌ఓసి అందుకున్న హమ్మద్ కుటుంబం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో మెడికల్ క్యాంప్
- డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మనిషి తన దైనందిన జీవితంలో ఎన్ని పనులున్నప్పటికీ ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని, నిర్లక్ష్యం చేయకూడదని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు అన్నారు. మనిషి ఆరోగ్యాంగా వున్నపుడే తన రోజూవారి విధులకు, ఇంట్లోని కుటుంబ సభ్యులకు న్యాయం చేసినవారమవుతామని తెలిపారు. కాలేజ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి, కాలేజీలోని వివిధ అభ్యర్థులకు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో మంగళవారం ఎస్కిలో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. మొదటగా డాక్టర్ రామేశ్వర రావు కేర్ వైద్య బందానికి స్వాగతం పలికి మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. నిత్య జీవితంలో ప్రతి మనిషి యంత్రంలాగా పనిచేస్తున్నారని, అప్పుడపుడు యంత్రానికి కూడా మరమ్మత్తులు జరుగుతుంటాయని, మనిషి కూడా అప్పుడపుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అందుకు తగిన మందులు వైద్యుల సలహాల మేరకు వాడినపుడు మనుషులు మరింత ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిత్యం విధులకు హాజరయ్యేవారికి మెడికల్ క్యాంపులు ఒక పెద్ద రిలీఫ్‌గా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన మెడికల క్యాంప్‌లో ఎస్కి సిబ్బందితో పాటుగా ఫ్యాకల్టీ లక్ష్మీకాంతరావు, అమర్ నాథ్, రాజశేఖర రెడ్డి, మనోహరా చారి, అదినారాయణ, చంద్రకళ, ఆది నరేష్, పద్మావతి, శ్రీధర్, తిలక్, కవిత,.చంద్రమోహన్, భరత్ ఇంకా పలువురు సిబ్బంది పాల్గొన్నారు శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు, ఇతరులకు బీపీ, షుగర్, టెంపరేచర్, బరువు, ఆర్థో తదితర అనేక ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికీ మందులు రాసిచ్చారు. ఈ క్యాంప్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఉన్నతాధికారులతో పాటుగా గచ్చిబౌలి కేర్ హాస్పిటల్ డాక్టర్లు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మదానీ, ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవీణ్, శ్రీ దేవి, ఆకాంక్ష నర్సులు పాల్గొన్నారు.

మ్యాన్ హోళ్లు తెరిస్తే కఠిన చర్యలు..!

- నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు తప్పవు
- జలమండలి పరిధిలోని మ్యాన్ హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్
- జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్ హోళ్లు తెరిస్తే కఠిన చర్యలుంటాయని జలమండలి అధికారులు హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా జలమండలి ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. లోతైన మ్యాన్ హోళ్లతో పాటు 25 వేలకు పైగా మ్యాన్ హోళ్లపై ఇప్పటికే సేఫ్టీ గ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్ తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారు. అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. వీటితో పాటు ఎయిర్ టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.

సెక్షన్‌కు ఒక బృందం ఏర్పాటు

మ్యాన్ హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతత్వంలో ఒక సీవరేజీ బందం ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా, లేదా ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. దగ్గరలోని జలమండలి కార్యాలయాల్లో నేరుగా సంప్రదిం చవచ్చు.

అత్యవసర సమయాల్లో ఎలా వుండాలో కార్మికులకు ప్రత్యేక శిక్షణ

పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై వారికి జలమండలి ఏటా భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో వారికి ఎస్ఓపీ మార్గదర్శకాల ప్రకారం భద్రతా పరికరాల పనితీరు, ఉపయోగించే విధానం, పారిశుద్ధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై శిక్షణ ఇస్తోంది. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు చేసే ప్రథమ చికిత్స పైనా అవగాహన కల్పిస్తుంది.

వివిధ అంశాలపై విస్తృత ప్రచారం

వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై జలమండలి విరివిగా ప్రచారం చేస్తుంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్.హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై దినపత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తతంగా ప్రచారం చేయడానికి సమాయత్తం అవుతోంది.



అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఈ. విజయ్ కుమార్ గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్ నగర్ లో స్థానిక అధికారులతో కలిసి నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఈ.విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత ఇనుప పైపుల స్థానంలో నూతన పైపులు వేసుకోవచ్చు అని రోడ్డు వేసిన తర్వాత వేసుకోవడానికి కుదరదని, అవసరం ఉన్నవాళ్లు పాత పైపులు పాడైపోతే వాటి స్థానంలో నూతన పైపులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలియజేశారు. స్థానిక బస్తీ ప్రజలకు అవసరాలకు అనుగుణంగా నూతన సీసీ రోడ్లు డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్వైజర్ నంసింహ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, పార్టీ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, శేఖర్, పాశం సత్యనారాయణ, వంజరి మహేష్, ద్వారక్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు ఆర్థికంగా చేయూతనిస్తున్న ముత్తూట్ ఫైనాన్స్'

- 9 మంది పేద యువతులకు వివాహ చెక్కులు, 13 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం
- టీఎస్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ముత్తూట్ ఫైనాన్స్ యాజమాన్యం పేదలకు ఆర్థికంగా చేయూతనివ్వడం గొప్ప విషయమని, సామాజిక బాధ్యతలో భాగంగా కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్న సంస్థ అభినందనీయమని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి కొనియాడారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని లిబర్టీ సర్కిల్ లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ముత్తూట్ వివాహ సన్మానం-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది పేద మహిళలకు వివాహ చెక్కులను, 13 మంది బీటెక్, ఎంబీబీఎస్ చేస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అతిథుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన సభా వేదికకు తెలంగాణ, ఏపీ జోనల్ మేనేజర్ జితేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి తన చేతుల మీదుగా అర్హులందరికీ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫైనాన్స్ వ్యాపారంలో దేశంలోనే దిగ్గజ సంస్థగా కొనసాగుతున్న ముత్తూట్ ఫైనాన్స్ సామాజిక బాధ్యతను తన భుజాలకు ఎత్తుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. సంస్థ చేస్తున్న సాయం చిన్నదైనా కష్టాల్లో ఉన్న వారికి కొండంత అండగా నిలుస్తుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను నిర్వహించాలని కోరారు. సమాజాన్ని ప్రేమించిన నాడు సమాజం చేత ఆ వ్యక్తులు, సంస్థలు శాశ్వతంగా నిలిచిపోతాయని తెలిపారు. జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. దేశంలో ఆకలి, ఆర్థిక బాధలు తప్ప అశాంతి లేదన్నారు. పేదరికంలో పుట్టిన అబ్దుల్ కలాం పేపర్ వేస్తూ చదువుకుని దేశానికి రాష్ట్రపతి అయిన విషయం నేటి తరం మరువకుడదని గుర్తు చేశారు. సి.ఎస్.ఆర్ మేనేజర్ లక్ష్మీ నారాయణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పని చేస్తూ కార్యక్రమాన్ని సజావుగా నడిపించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్స్ కె.వి.మురళి, సంపత్ కుమార్, విబిన్ మీనన్, అబ్రహం జాన్, జిజో అబ్రహం, శ్రీనివాస్, సురక్ష సేవా సమితి అధ్యక్షులు గోపి శంకర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అల్లూరి ప్రసన్నకుమార్, బిందు, ప్రవీణ్, మురళీ, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీజే సహకారంతో 13 మంది ఖైదీల విడుదల

నవతెలంగాణ-ధూల్‌పేట్

శిక్షా కాలం ముగిసినప్పటికీ జైలులో మగ్గుతున్న ఇద్దరు ఖైదీలకు ఆర్థిక, న్యాయపరమైన సహాయం అందించి విడుదలకు ఏర్పాట్లు చేశామని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ తెలిపారు. సంస్థ ప్రతినిధులు ఇటీవల సంగారెడ్డి సెంట్రల్ జైలును సందర్శించి జైలు సూపరింటెండెంట్‌ను కలిశారు. వారిని విడుదల సందర్భంగా పాతబస్తీ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మొదటిసారి నేరానికి పాల్పడి నిర్దేత కారాగార శిక్షను అనుభవించిన మీదట కూడా జరిమానా చెల్లించలేకపోయిన 13 మంది ఖైదీల విడుదలకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. వారి కుటుంబీకులు పేదవారైన కారణంగా జరిమానా చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారు. కాబట్టి ఎంపీజే ఈ మొత్తాన్ని చెల్లించి ఖైదీల విడుదలకు తన మతు సహకారాన్ని అందజేసిందన్నారు. 2008 నుండి తమ సంస్థ తరఫున ఖైదీల విడుదలకు ఆర్థిక సాయం చేస్తూ వస్తోందన్నారు.

హరినాథ్‌గౌడ్‌కు మహానంది అవార్డు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ పెండ్లీలు చేసిన ఉత్తమ మ్యారేజ్ బ్యూరో వారికి తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ వకులభరణం కృష్ణమోహన్ రావు చేతుల మీదుగా మహా నంది అవారును గడ్డమీది హరినాథ్ గౌడ్‌కు అందజేశారు. గడ్డమీది హరినాథ్ గౌడ్ సీనియర్ మ్యారేజ్ బ్యూరో సభ్యులుగా ఉంటూ తక్కువ సమయంలో ఎక్కువ పెండ్లీలు చేసినందుకు నంది అవార్డుకు ఎంపికు ఎంపికైంది. తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, శాసన మండలి సభ్యు లు ఎల్ రమణ, తల్వార్ సుమన్, గౌడ హాస్టల్ మాజీ అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్ నాథ్ ఠాకూర్‌కు శుభాకాంక్షలు..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వ్యవసాయం, హెూం రైతు సంక్షేమం కేంద్ర సహాయ మంత్రిగా రామ్ నాథ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నవ సమాజ్ చారిటబుల్ సొసైటీ జనరల్ సెక్రెటరీ సూర్యనారాయణ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కోఠి ఆయన మాట్లాడుతూ.. బార్బర్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తి కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం బార్బర్ కమ్యూనిటీగా అరుదైన గౌరవం అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్‌కు సూర్య పల్లి శ్రీనివాస్, ఎముల సుధాకర్, ఎం.గోపాలకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సెంట్రల్ లేబర్ అధికారుల హామీతో
క్రీడా కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ



- సీఐటీయు అధ్యక్షులు మీసాల శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-ధూల్‌పేట్

క్రీడా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సెంట్రల్ లేబర్ అధికారుల హామీతో సమ్మె తాత్కాలికంగా విరమించామనీ సీఐటీయు సౌత్ అధ్యక్షులు మీసాల శ్రావణ్ కుమార్ అన్నారు. క్రీడా కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న కార్మికుల సమ్మెను ఆర్.ఎల్.సీ సెంట్రల్ లేబర్ అఫిస్ అధికారుల నిర్ణయం మేరకు తాత్కాలికంగా సమ్మెను విరమించి, కార్మికులు విధులలో హజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పట్ల క్రీడా అధికారులతో కలిసి చర్చలు జరిపారన్నారు. వారు సానుకూలంగా స్పందిందించారన్నారు. కార్మికులకందరికీ న్యాయమైనటువంటి వేతనాల ను, తమ డిమాండ్ల పరిష్కారంకు కృషి చేస్తామన్నారని తెలిపారు. కార్మికులు పట్టుదలతో ఈ పోరాటం చేశారన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉద్యమాన్ని మరింతగా కొనసాగించాలని కోరారు. యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాయకుడా కార్మిక చట్టాలకు అనుగుణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో క్రీడా కాంట్రాక్ట్ వర్కర్స్‌ల సమస్యల పరిష్కారించకపోతే ఆందోళ, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిషన్, కృష్ణ, జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్, ప్రభాకర్, బుచ్చి రెడ్డి, అండాలు, యాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి'

- ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఎలాంటి పాఠ్యపుస్తకాల విక్రయాలు జరపొద్దని, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి జారీ చేసిన సర్క్యూలర్ కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలించే సర్క్యూలర్ అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవా రం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఇటీవల మే 30న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశా లల్లో యూనిఫామ్, బెల్ట్, షులను కాకుండా నో ప్రాఫిట్ నో లాస్ కింద పాఠ్యపుస్తకాల విక్రయాలను చేసుకోవచ్చన్న సర్క్యూలర్ సవరించి, పాఠ్య పుస్తకాలపై పాఠశాల పేరుతో ముద్రించిన ఏ రకమైన పాఠ్యపుస్తకాల విక్రయాలను అమ్మొద్దన్న సర్క్యులర్ జరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని, సదరు పాఠశాలల్లో ఎలాంటి పాఠ్యపుస్తకాలను అమ్మకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేటు పాఠశాలల్లో ఫీజులు ఆకాశాన్నంటుతున్నా యని, ప్లేస్కూల్, ఎల్‌కేజీ, యూకేజీ, మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు డొనేషన్లు, అభివృద్ధి చార్జీలు, రుసుములతో పాటు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. పాఠశాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారని, ప్రభుత్వ పరంగ రుసుముల నియంత్రణ లేకపోవడం వాటికి అనువుగా మారిందని, 2024-25 విద్యా సంవత్సరానికి కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకు ఫీజులు పెంచేశాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు నగరాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, నగరాల్లోని శ్రీచైతన్య, నారాయణ, ఎస్ ఆర్, గౌతమ్, భాష్యం, రవీంద్రభారతి, ఓక్ రిడ్జ్, ఢిల్లీ పబ్లిక్, మేరీడియన్, అక్షర తదితర కార్పొరేట్ పాఠశాలలు 40-50 శాతం పెంచాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఫీజులను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1) ప్రకారం విద్యను ఉచితంగా అందించాలన్నారు. ఫీజులను ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జడ్జి కమిటీ సభ్యులుగా ఉన్న డిస్ట్రిక్ట్ ఫీరెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరా బాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్, కళ్యాణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటికలకు వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



- ఆరెకటిక అభివృద్ధి సంఘం ప్రెసిడెంట్ ఫౌండర్ అశోక్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆరెకటికలకు వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అభివృద్ధి సంఘం ఫౌండర్, ప్రెసిడెంట్ అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆరకటిక అభివృద్ధి సంఘం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఫౌండర్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఆరెకటికలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. వైన్స్ సెంటర్లలో 30% ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ డీ నుంచి బీసీ ఏ హెూదా కల్పించి జీవో తేవాలన్నారు. మటన్ షాపులకు ఉచిత కరెంట్ ఇవ్వాలన్నారు ఆరెకటిక మహిళలకు 3 లక్షల బ్యాంకు రుణాలు 90% సబ్సిడీతో మటన్ క్యాంటీన్లు బోటీ కర్రీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరకటిక జనాభా 10 లక్షలకు పై మాటే ఉంటుందని ఆరకటిక బిడ్డ సునీల్ కుమార్ తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేశాడని గుర్తు చేశారు.మా మటన్ వృత్తిపై 9 మేకల మండీలపై ప్రతియేటా ప్రభుత్వానికి కోట్లాది రూ.ల ఆదాయం వస్తుంది. యాభైకిపైగా ఉన్న అంగళ్ళపై కోట్లాది రూ.ల ఆదాయం వస్తుంది. ప్రభుత్వ ఖజానాకు ప్రత్యక్షంగా పరోక్షంగా మా కులవృత్తి ఆర్థిక వనరులుగా ఉపయోగపడుతుంది. అయినా ఈ 75 సం.రాల కాలంలో మా కులానికి ప్రత్యేక కార్పోరేషన్ ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. మమ్మల్ని పట్టించుకోలేదు. మాకు అన్యాయం జరిగింది అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మా డిమాండ్ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

ఎంఎంయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆసిఫ్ నగర్‌లోని ఓంకారేశ్వర గుడి ప్రాంగనంలో 60 వృద్ధులకు వైద్య ఆరోగ్య పరీక్ష నిర్వహించి మందులు పంపిని చేశారు. మొబైల్ మెడికల్ యూనిట్ ద్వార హైదరాబాద్ రెడ్ క్రాస్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి , హైదరాబాద్ ఎంఎంయూ కో- కన్వీనర్ కల్పన దత్త, ఎమ్‌సీ సభ్యురాలు ప్రసన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన, సుజాత, సత్యనారాయణ, సందీప్, రియాజుద్దీన్ లు పాల్గొన్నారు.

నిందితునికి రైల్వే కోర్టు ఎనిమిది నెలల జైలు శిక్ష..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నాంపల్లి ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసులో నిందితునికి సికింద్రాబాద్ రైల్వే సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు నిందితునికి 8 నెలల శిక్షతోపాటు 500 జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మంగళవారం నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 27వ తేదీన బొల్లారానికి చెందిన మహమ్మద్ సోహెల్ (21) బేగంపేట్ రైల్వే జంక్షన్ వద్ద ప్రయాణికురాలి చేతిలో నుంచి సెల్ ఫోన్ లాక్కొని పారిపోయాడు వెంటనే బాధితురాలు నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. రైల్వే పోలీసులు సమగ్ర విచారణ జరిపిన అనంతరం రైల్వే కానిస్టేబుల్ ముఖేష్ సెకండ్ ఎంఎం రైల్వే కోర్టు సికింద్రాబాద్ నందు అభియోగ పత్రమును సమ ర్పించామని చెప్పారు. ప్రభుత్వ పిపి జి.రోజా రాణి వాదనలు వినిపించారన్నారు. న్యాయమూర్తి ఎండి గౌస్ పాషా నిందితునికి 8 నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారని ఆయన తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో త్వరగా సీవరేజీ పనులు పూర్తి చేయాలి

- కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

నాణ్యత ప్రమాణాలతో సీవరేజ్ త్వరగా పనులు పూర్తి చేయాలని అందుకు అధికారులు సంబంధించిన కాంట్రాక్టర్ దృష్టి సారించాలని కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీనివాస్ నగర్ కాలనీలో కొత్తగా వేస్తున్న సీవరేజ్ పనులను బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మా వెంకటరెడ్డి, ఏఈ మాజీద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ణీత గడుపులోపు పనులు పోటీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు వెంకట్ రమణా రాజు, మహేష్ యాదవ్, గుంట శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

INDIAలో మహిళా గొంతుకలు

ఈ నెల 4న 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పదేండ్ల తర్వాత బలమైన ప్రతిపక్షం ఏర్పడింది. భారత జాతీయ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమిగా ఏర్పడి ఎన్‌డీఏపై పోరాడారు. మొత్తం 232 స్థానాలను గెలుచుకోగలిగారు. ప్రతిపక్షాలు చేసిన ఈ పోరాటంలో మహిళా అభ్యర్థులు సైతం పెద్దఎత్తున విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 797 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా 30 మందికి పైగా విజయం సాధించారు. వీరిలో చాలా మంది అట్టడుగు, మైనారిటీ వర్గాలకు చెందినవారు సైతం ఉన్నారు. వారి పరిచయాలు నేటి మానవిలో...



కడియం కావ్య

తెలంగాణలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈమె ప్రముఖ వైద్యురాలు అలాగే సమాజిక కార్యకర్త. కడియం ఫౌండేషన్ ద్వారా వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఈ ఏడాది ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. కావ్య మాజీ ఎంపీ కడియం శ్రీహరి కుమార్తె.



వర్షా ఏక్‌నాథ్ గైక్వాడ్

మహారాష్ట్రలోని ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఉజ్వల్ నికమ్‌పై గట్టిపోటీనిచ్చిన దళిత మహిళా నాయకురాలు వర్ష ఏక్నాథ్ గైక్వాడ్. 16,514 ఓట్ల తేడాతో గెలుపొందారు. వర్షా తాయి అని ప్రజలు ఆమెను ప్రేమగా పిలుచుకునే. శివసేన మద్దతు పొందిన వర్షా ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం నుండి గెలిపొందిన ఏకైక కాంగ్రెస్ అభ్యర్థి. చాలా మంది రాజకీయ



పరిశీలకులు వర్షా గెలుపును 'అన్ని అసమానతలకు వ్యతిరేకంగా' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఏక్‌నాథ్ గైక్వాడ్ కుమార్తె అయిన వర్ష 2009-2010 మధ్య కాలంలో మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. సామాజిక సేవకురాలిగా కూడా ఆమెకు అక్కడ మంచి గుర్తింపు ఉంది.

ఇక్రా మునవర్ హసన్

ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కైరానా నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున పోటీ చేసి బీజేపీకి చెందిన ప్రదీప్ కుమార్, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన శ్రీపాల్‌పై 69,116 ఓట్ల తేడాతో గెలుపొందింది. ఈమె లండన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీడ్‌లో, ఇంటర్నేషనల్ లాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. ఇక్రా రెండుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన దివంగత మునవ్వర్ హసన్ కుమార్తె. 28 ఏండ్ల ఇక్రా స్త్రీవాది. ఆమె తన కుటుంబం సేవా వారసత్వాన్ని నిలబెట్టడానికి ఈ ఎన్నికల్లో పోరాడింది. మహిళా సమస్యలు పరిష్కరించాలని, మతం పేరుతో ప్రజల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించాలని ఆమె బలంగా కోరుతుంది. యూపీలో తాను ప్రధానంగా రైతులు, మహిళల విద్యపై దృష్టి పెడతా అంటుంది.





ప్రియా సరోజ్

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన అతి పిన్న వయస్కురాలు ప్రియా సరోజ్. ఆమె సమాజ్‌వాదీ పార్టీ టిక్కెట్‌పై ఉత్తరప్రదేశ్‌లోని మఛ్లిషహర్ స్థానం కోసం పోరాడారు. సరోజ్ మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన తూఫాని సరోజ్ కుమార్తె అలాగే ప్రాక్టీస్‌లో ఉన్న న్యాయవాది. ఆమె 35,850 ఓట్ల తేడాతో బీజేపీ సిట్టింగ్ ఎంపీ భోలానాథ్‌పై విజయం సాధించారు. ఈ స్థానం నుండి 12 మంది పోటీలో ఉన్నారు. వీరిలో బీఎస్పీకి చెందిన కృపా శంకర్ సరోజ్ 157,291 ఓట్లు పొందారు. మిగిలిన తొమ్మిది మంది అభ్యర్థులు నాలుగు అంకెలను దాటలేకపోయారు.



మిసా భారతి

ఆర్‌జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె ఈమె. కేంద్ర మంత్రి, బీహార్‌లోని పాటలీపుత్ర నుండి ప్రస్తుత ఎంపీ రామ్ కృపాల్ యాదవ్‌పై 85,174 ఓట్ల తేడాతో గెలుపొందారు. అంతకుముందు రెండుసార్లు స్వల్ప తేడాతో ఓడిపోయారు. పాట్నా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో కలిసి ఉండే పాటలీపుత్ర సీటు కోసం 2009లో పోటీ చేసి లాలూ యాదవ్ గెలిచారు.



కనిమొళి

తమిళనాడులోని తూత్తుకుడి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అభ్యర్థి కనిమొళి కరుణానిధి 5,40,729 ఓట్లు సాధించి తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగారు. ఈమె తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం కరుణానిధి కుమార్తె. కేంద్రంలోని నియంతృత్వ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఈ ఎన్నికల్లో ఆమె విశ్రాంతి లేకుండా పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.





డాక్టర్ ప్రభా మల్లికార్జున్, ప్రియాంక జార్కిహోళి

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మొత్తం ఆరుగురు అభ్యర్థులను నిలబెట్టింది. వీరిలో డాక్టర్ ప్రభా మల్లికార్జున్, ప్రియాంక జార్కిహోళి వరుసగా దావణగెరె, చిక్కోడి నియోజకవర్గాల నుండి విజయం సాధించారు. ప్రియాంక పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి కుమార్తె కాగా, డాక్టర్ ప్రభ గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ భార్య.





జెనిబెన్ నాగాజీ ఠాకూర్

ఈమె బనస్కాంత లోక్‌సభ నుండి 30,000 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన రేఖా చౌదరిని ఓడించి విజయం సాధించారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు మాత్రమే లభించినప్పటికీ మొత్తం 26 స్థానాలను వరుసగా మూడోసారి కైవసం చేసుకోవాలనే బీజేపీ ఆశయాన్ని దెబ్బతీసిన ఠాకూర్ విజయం కీలకమైంది. వాస్తవానికి బనస్కాంత బీజేపీకి ఓ బలమైన కోట. రాహుల్ గాంధీని ఎంపీగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా గత ఏడాది గుజరాత్ అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసిన 16 మంది ఎమ్మెల్యేలలో ఠాకూర్ కూడా ఒకరు. ఫిబ్రవరి 2024లో, రాష్ట్రంలో నకిలీ ప్రభుత్వ కార్యాలయాల గురించి మాట్లాడినందుకు ఠాకూర్‌తో పాటు మరో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మళ్లీ సస్పెండ్ చేశారు. ఇటువంటి ఆటంకాల మధ్య ఆమె సాధించిన విజయం నిజంగా గొప్పది.

సుప్రియా సూలే

శరద్ పవార్ కుమార్తె నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సుప్రియా సూలే ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో విడిపోయిన కుటుంబ సభ్యులపై పోటీ చేయడాన్ని, తన పార్టీ పేరు, గుర్తును లాక్కోవడం నుండి అనేక సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. అయితే చివరికి ఆమె తన బారామతి లోక్‌సభ స్థానం నుండి 1.55 లక్షలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. సూలే వరుసగా నాలుగోసారి తన స్థానాన్ని గెలుచుకోగలిగారు. ఈమె పార్లమెంటులో భ్రూణహత్యల వంటి అనేక సమస్యలపై అలాగే LGBTQIA+ హక్కులకు బలమైన మద్దతునిచ్చారు.

మహువా మొయిత్రా

పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ స్థానం నుండి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి మహువా మొయిత్రా 56,705 ఓట్లతో జనతా పార్టీ ప్రత్యర్థి అమృతా రాయ్‌పై విజయం సాధించారు. ఇది ఆమెలోని ధైర్యానికి, ఆమెపై ప్రజలకున్న



విశ్వాసానికి నిదర్శనం. మహువా జూన్ 26, 2010న పార్లమెంటులో 'ఫాసిజం సంకేతాలు'పై చేసిన తొలి ప్రసంగం సోషల్ మీడియాలో ఆమెకు ప్రశంసలు తెచ్చిపెట్టింది. నరేంద్ర మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీల మధ్య అనుబంధంపై ఆమె అనేక ప్రశ్నలు లేవనెత్తారు. దాంతో బీజేపీ పార్టీ ఆమె గొంతు నొక్కేందుకు 2023లో ఎంపీ పదవి నుండి బహిష్కరణకు గురి చేసింది. అయినా ఆమె ఎక్కడా తగ్గలేదు. ప్రజల మద్దతుతో తిరిగి పార్లమెంటులో అడుగుపెడుతుంది. ఈ విజయం తన వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, ప్రశ్నించే గొంతును అణిచివేసే వారికి ప్రజలిచ్చిన సమాధానంగా ఆమె అంటున్నారు.

25లోపు అఫిడవిట్లు సమర్పించాలి

(మొదటిపేజి తరువాయి)

విచారణ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ ఆదేశించారు. తప్పుడు సమాచారంతో అఫిడవిట్లు ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో మీడియాతో మంగళవారం ఆయన చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరం విచారణలో భాగంగా 20 మంది ఇంజినీర్లతో సమావేశమైనట్టు తెలిపారు. త్వరలో నిర్మాణ సంస్థలనూ విచారణకు పిలుస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించా లని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికారుల పేర్లుంటే, వారికి కూడా నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. బ్యారేజీలు సరిగ్గా పనిచేస్తే, ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బ్యారేజీలతో లాభమే తప్ప నష్టం లేదని అనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. కమిషన్ చేసే పనులపై బుధవారం జాబితా తయారు చేస్తామని వివరించారు. మూడు బ్యారేజీల బాధ్యతలు చూసిన ఇంజినీర్లను విచారిస్తున్నామనీ, అఫిడవిట్ ద్వారా విషయాలు తెలియజేయాలని వారిని ఆదేశించామని తెలిపారు 'అఫిడవిట్ ద్వారా అన్ని అంశాలు రికార్డు అవుతాయి..బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్టు కనిపిస్తున్నది. లోపం ఎక్కడుంది ? ఎవరి ప్రమేయమైనా ఉందా ? తదితర విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని జస్టిస్ పీసీ ఘోష్ వ్యాఖ్యానించారు.

అది ఫ్యామిలీ క్యాబినెట్

(మొదటిపేజి తరువాయి)

ఏకనాథ్ ఖడ్సే కోడలు రక్ష ఖడ్సేకు, మాజీ ప్రధాని చరణ్ సింగ్ మనవడు జయంత్ చౌదరికి స్థానం కల్పించడాన్ని రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. అలాగే, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి ఎర్రం నాయుడు కుమారుడు రామ్ మోహన్ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్, హర్యానా మాజీ మంత్రి రావు బిరేంద్ర సింగ్ కుమారుడు ఇంద్రజీత్ సింగ్‌కు మంత్రులుగా అవకాశం ఇవ్వడాన్ని ఆయన గుర్తు చేశారు.

ప్రియాంక పోటీ చేసివుంటే..

తాజా లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే ప్రధానమంత్రి మోడీ అక్కడ కనీసం రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయేవారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. రాయ్‌బరేలీలో నిర్వహించిన కృతజ్ఞతా సభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ బలాన్ని తగ్గించడానికి రాయ్‌బరేలీ, అమేథితో పాటు దేశంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పోరాటం చేశాయని అన్నారు. ఎన్నికల ఫలితాలపై అహంకారానికి లోనుకాకుండా, ప్రజల ప్రయోజనాల కోసం ఇండియా వేదిక ఎంపీలు పనిచేస్తామని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా తెలిపారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవంలో సామాన్య ప్రజలను విస్మరించిన మోడీ పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులకు ప్రాధాన్యత ఇచ్చారని, అయోధ్యలో ఓటమితో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పాల్గొన్నారు. రాయ్‌బరేలీలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షల పవిత్రత దెబ్బతింది

(మొదటిపేజి తరువాయి)

కోల్పోవడమేంటో ఇంతవరకు వెల్లడించలేదని వారు పేర్కొన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో మోసాలు జరిగే ప్రమాదాలువున్నాయని, శాస్త్ర, సాంకేతిక, వైద్య పరిజ్ఞానానికి సంబంధించి లోతైన అవగాహన కలిగివుండాల్సిన ఇటువంటి పరీక్షల్లో మోసాలు లేదా అక్రమాలు జరిగితే అది అంతిమంగా రోగుల ప్రాణాలకే ముప్పు తీసుకువస్తుందని పిటిషన్ హెచ్చరించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరుగురిపై చార్జిషీట్

(మొదటిపేజి తరువాయి)

చార్జిషీట్ దాఖలైంది. అందులో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ పరారీలో ఉన్నట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు విపక్షాలకు చెందిన పలువురు నాయకులు, వ్యాపారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై ఒక వ్యూహం ప్రకారం పై నిందితులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు మరికొందరు టీమ్‌గా ఏర్పడి ఫోన్ ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు.

ప్రధానంగా ఎన్నికల సమయంలో విపక్షాలకు చెందిన నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడి భారీ మొత్తంలో వారికి చెందిన కోట్ల రూపాయల డబ్బులను సీజ్ చేశారని చార్జిషీట్‌లో వివరించారు. ఫోన్‌ట్యాపింగ్ కోసం ఎస్ఐబీ కార్యాలయంలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి పదిహేడుకుపైగా కంప్యూటర్లతో వాటికి అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫోన్ ట్యాపింగ్ పరికరాలను అమర్చి మరీ ఆపరేషన్లకు పాల్పడ్డారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు.

వీరంతా కలిసి దాదాపు 1400 మందికిపైగా ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా ప్రభాకర్‌రావు ఆదేశాలు, సూచనల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిపామనీ, ఐన్యూస్ సీఈఓ శ్రవణ్‌కుమార్ కూడా కీలక పాత్ర పోషించారని పట్టుబడ్డ నిందితులు తమ వాంగ్మూలం ఇచ్చినట్టు కూడా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతేడాది డిసెంబర్ నెలలోనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌లకు సంబంధించిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు, సాంకేతిక పరికాలను ధ్వంసం చేసి నిందితుల్లో ఒకరైన ప్రణీత్‌రావు ఆ సామగ్రిని మూసీ నదితో పాటు బేగంపేట కాలువలో పారేసి ఆధారాలను మాయం చేయడానికి కుట్ర పన్నారని చార్జిషీట్‌లో తెలిపారు.

గత మార్చి పదో తేదీన ఈ కేసుపై ఎఫ్ఐఆర్ నమోదైన దానికంటే కొద్ది రోజుల ముందు మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ దేశం విడిచి పారిపోయారనీ, వారి కోసం రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ కేసులో మరిన్ని నిజాలతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించిన అప్పటి ప్రభుత్వ ప్రముఖుల వివరాలు బయటపడే అవకాశాలుంటాయని ఈ చార్జిషీట్‌లో సూచనప్రాయంగా తెలిపినట్టు సమాచారం.

బెయిల్‌పై నేడు నిర్ణయం

ఇదిలా ఉంటే ఈ కేసులో నిందితులైన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నకు బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టు నేడు నిర్ణయం తీసుకోనున్నది. మంగళవారం వీరిద్దరికీ బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో పాటు నిందితుల తరఫు న్యాయవాదుల మధ్య వాదప్రతివాదనలు జరిగాయి. కాగా, ఈ కేసులో ఇద్దరు అధికారులను ఉద్దేశపూర్వకంగా నిందితులుగా చేర్చారనీ, వారికి బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు పలు ఆధారాలున్నాయనీ, ఈ నేపథ్యంలో వీరిద్దరికీ బెయిల్ లభిస్తే ఆధారాలను తారుమారు చేసే ప్రమాదముందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వీరి వాదనలు విన్న న్యాయమూర్తి వారిద్దరి బెయిల్ మంజూరుపై నిర్ణయాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశారు.

మోడీ మంత్రివర్గంలో నేరచరితులు..

(మొదటిపేజి తరువాయి)

గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జౌల్ ఓరంలు మహిళలపై వేధింపుల కేసులు ఎదుర్కొంటున్నారు. ఎనిమిది మంది మంత్రులపై విద్వేష ప్రసంగాల కేసులున్నాయని ఏడీఆర్ తెలిపింది. మొత్తం 71 మంత్రుల్లో 28 మంది (39 శాతం)పై క్రిమినల్ కేసులున్నాయని వెల్లడించింది.

99 శాతం కేంద్ర మంత్రులు కోటీశ్వరులు

ప్రధాని మోడీ కొత్త మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే ఉన్నారు. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మోడీ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 61 మంది, ఎన్డీఏ మిత్రపక్షాల నుంచి 11 మంది మంత్రులు ఉన్నారు. 72 మంది మంత్రుల్లో 43 మంది మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఎంపీలుగా ఎన్నికయ్యారు. 39 మంది గతంలో కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారు.

పెమ్మసానే సంపన్నుడు

మోడీ మంత్రివర్గంలో అత్యంత ధనిక మంత్రిగా టీడీపీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయనను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖకు సహాయ మంత్రిగా నియమించారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రెండో స్థానం, మూడో స్థానంలో ఉన్న హెచ్ డి కుమారస్వామి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అశ్విని వైష్ణవ్ రైల్వే ఐ అండ్ బీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నారు. ఐదో స్థానంలో ఉన్న పీయూష్ గోయల్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ మంత్రుల ఆస్తులను ఏడీఆర్ లెక్కించింది.

71 మంది కేంద్ర మంత్రుల్లో 47 (66 శాతం) మంది కొత్తవారు కాగా, వారి వయస్సు 51-71 మధ్య ఉంది. 11 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించగా, 57 మంది గ్రాడ్యుయేషన్, ఆపై చదివారు.

ఏపీ రాజధానిగా అమరావతి

(మొదటిపేజి తరువాయి)

ఏపీ ప్రతిష్ట, గౌరవం పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు.

ఏపీ గవర్నర్‌ను కలిసిన కూటమి నేతలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఏర్పాటు కోసం కూటమి నేతలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ఎన్డీయే కూటమి శాసనసభా పక్ష సమావేశం ముగిసిన అనంతరం వారు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల తరఫున సభానాయకుడిగా టీడీపీ అధినేత, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గవర్నర్‌కు 164 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సంఖ్యా బలం తమకు ఉన్నందున అందుకు ఆహ్వానించాలని ఈ సందర్భంగా వారు గవర్నర్‌ను కోరారు. ఆయనను కలిసిన వారిలో టీడీపీ నుంచి అచ్చెన్నాయుడు, జనసేన నుంచి నాదెండ్ల, బీజేపీ నుంచి పురందేశ్వరి ఉన్నారు.

గాజాలో కాల్పులు విరమించాలి

న్యూయార్క్ : గాజాపై గత 8మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు అంతం పలికే లక్ష్యంతో కాల్పుల విరమణ ప్రతిపాదనను ధ్రువీకరిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 14-0 ఓట్ల తేడాతో సోమవారం ఈ తీర్మానం ఆమోదించబడింది. గత నెల్లో ప్రకటించిన మూడంచెల కాల్పుల విరమణ ప్రతిపాదనను తీర్మానం స్వాగతించింది. తొలి దశలో భాగంగా తొలుత ఆరు వారాల పాటు కాల్పుల విరమణ పాటించాలని, గాజాలో కొంతమంది బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని ఆ తీర్మానం కోరుతోంది. ఇక రెండో దశలో శాశ్వత కాల్పుల విరమణ, మిగిలిన బందీల విడుదల అమలు జరగాలి. పూర్తిగా విధ్వంసమైన గాజా పునర్నిర్మాణ ప్రయత్నాలు మూడో దశలో చేపట్టాలి. ఇజ్రాయిల్ ఈ ప్రతిపాదనను ఆమోదించిందని అమెరికా చెబుతోంది. హమస్ ఆమోదించాలని తీర్మానం కోరుతోంది. ఈ ప్రతిపాదనను తాము సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తొలుత వ్యాఖ్యానించింది. ఎలాంటి షరతులు లేకుండా ఈ తీర్మానాన్ని ఇరు పక్షాలు పూర్తిగా అమలు చేయాలని కోరింది. తీర్మానంపై ఓటింగ్ అనంతరం హమాస్ ఒక ప్రకటన చేస్తూ, మధ్యవర్తులతో సహకరించడానికి సిద్ధంగా వున్నామని చెప్పింది. ఒప్పందం అమలుపై పరోక్షంగా చర్చలకు కూడా సిద్ధంగా వున్నామని తెలిపింది. ఎట్టకేలకు ఇది అమల్లోకి వస్తుందా లేదా అనేదే పెద్ద ప్రశ్నగా మిగిలిందని మీడియా వర్గాలు వ్యాఖ్యానించాయి. ఏ ఒప్పందం కుదుర్చుకున్నా అది అంతిమంగా శాశ్వత కాల్పుల విరమణకు దారి తీయాలని, గాజా నుండి పూర్తిగా ఇజ్రాయిల్ బలగాలు వైదొలగాలని, గాజా పునర్నిర్మాణం జరగాలని హమాస్ కోరుతోంది.

సింగరేణిలో 'కారుణ్య' వయోపరిమితి పెంపు

(మొదటిపేజి తరువాయి)

పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గతంలో 35 ఏండ్ల వరకే పరిమితి ఉండగా, తాజాగా 40 ఏండ్ల వరకు వయోపరిమితి సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల సంస్థలో దాదాపు 300 మందికి ప్రయోజనం చేకూరుతుందని సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం నాయక్ తెలిపారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అకాల మరణం చెందిన వారి కుటుంబాల్లో ఒకరికి, అనారోగ్యంతో (మెడికల్ అన్‌ఫిట్) ఉద్యోగ విరమణ చేసిన వారి పిల్లలను బదిలీ కార్మికునిగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలోకి తీసుకుంటారు. గతంలో 18 నుంచి 35 ఏండ్లలోపు వారినే కారుణ్య నియామకాల కింద తీసుకునే వారు. కరోనా కాలంలో రెండేండ్లు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంతో సింగరేణి కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారుణ్య నియామకాల వయో పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులను 2018 మార్చి 9వ తేదీ నుంచి అమలు చేస్తామని సీఎమ్‌డీ బలరాం నాయక్ వివరించారు.

జులై 30 వరకు గడువివ్వండి

(మొదటిపేజి తరువాయి)

నెలలోనే ఇచ్చారు. దీనిపై తాజాగా తనకు వివరణ ఇచ్చేందుకు జులై 30వ తేదీ వరకు గడువు కావాలని కేసీఆర్ కోరారు. ఈ విజ్ఞప్తిని కమిషన్ తిరస్కరించింది. జూన్ 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పై అంశాలపై ఏకసభ్య కమిషన్ ఇప్పటికే పౌరసమాజం నుంచి పిటీషన్లు స్వీకరించింది. ఈ అంశాలతో సంబంధం ఉన్న 28 మందికి ఏప్రిల్ నెలలోనే నోటీసులు జారీ చేసింది. దానిలో భాగంగా సోమవారం టీజీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, ఇంధనశాఖ మాజీ కార్యదర్శి సురేష్‌చందా (రిటైర్డ్) కమిషన్ ఎదుట హాజరై తమ వాదన వినిపించారు. మంగళవారం ఇంధన శాఖ మాజీ కార్యదర్శులు అర్వింద్ కుమార్, ఎస్కే జోషి (రిటైర్డ్)లు కమిషన్ ఎదుట హాజరయ్యారు. వారిని విచారించిన కమిషన్ పలు విషయాలపై వివరణలు కోరింది. ప్రభుత్వ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలనే తాము అమలు చేశామని వారు చెప్పినట్టు సమాచారం.

విధుల్లో రాణించాలి

(మొదటిపేజి తరువాయి)

నిర్వహించిన విధుల గురించి డిప్యూటీ సీఎంకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఈ సందర్భంగా వివరించారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని వారికి ఆయన సూచించారు. శిక్షణ కాలంలో తెలుసుకున్న అంశాలు పరిపాలనలో ఎంతగానో ఉపయోగ పడుతాయని అన్నారు. భౌగోళిక, వాతావరణ విషయంలో తెలంగాణ రాష్ట్రం బాగుంటుందనీ, ప్రజల నుంచి కూడా అదే స్థాయిలో సహకారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఐఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన తదితరులు ఉన్నారు.

విమాన ప్రమాదంలో విషాదం

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. ఆ సమయంలో విమానంలో ఉపాధ్యక్షుడు, మాజీ అధ్యక్షుని భార్య, ఏడుగురు ప్రయాణికులు, ముగ్గురు మిలటరీ సిబ్బంది వున్నారు. సోమవారం రాజధాని నగరం నుండి బయలుదేరిన విమానం 45నిముషాల తర్వాత ముజ్జు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి వుంది. కానీ ఈలోగానే కూలిపోయింది. విమాన శిధిలాలను సహాయక సిబ్బంది కనుగొన్నారు. అనంతరం అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా మాట్లాడుతూ, కొండకు సమీపంలో విమాన శిధిలాలను కనుగొన్నారని చెప్పారు. ఉపాధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన చిలిమా వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తారని భావించారు. 2022లో ఆయనపై ముడుపుల ఆరోపణలు రావడంతో అరెస్టు చేశారు. అయితే గత నెల్లోనే ఆయనపై అభియోగాలను కోర్టు ఉపసంహరించింది. ఈ కేసును కొనసాగించాలనుకోవడం లేదని పబ్లిక్ ప్రాసిక్యూషన్ డైరెక్టర్ నోటీసులు పంపడంతో కోర్టు కేసును మూసేసింది.

నవచిత్రం

న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా


జ్ఞానసాగర్ ద్వారక

హీరో సుధీర్ బాబు నటిస్తున్న చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రానికి 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించారు. ఈనెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇదొక పీరియాడిక్ ఫిల్మ్. ప్రొడక్షన్ డిజైన్, లోకేషన్స్, కాస్ట్యూమ్స్ ఇలా అన్నింట్లో చాలా ఎఫర్ట్ పెట్టాం. కథగా చెప్పాలంటే ఇదొక అండర్ డాగ్ స్టోరీ. కుప్పంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసే సుబ్రహ్మణ్యం మామూలు కుర్రాడు. తను గన్ మేకింగ్‌లో ఇన్వాల్ అయి పవర్‌ఫుల్ సుబ్రహ్మణ్యగా ఎలా ఎదిగాడనేది థ్రెడ్. దీంతో పాటు చాలా థ్రెడ్స్ ఉన్నాయి. ఇందులో దైవశక్తికి సంబంధించి ఎలిమెంట్ కూడా ఉంది.
- అలాగే ఇందులో మంచి ఫాదర్ ఎమోషన్ ఉంటుంది. ఇది అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. సుధీర్ బాబు అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. యాక్షన్, ఎమోషన్ టెర్రిఫిక్‌గా చేశారు. న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా ఇది. యాక్షన్ లవర్స్‌కి, మాస్ ఆడియన్స్‌కి, సినిమాని ఇష్టపడే ప్రేక్షకులు అందరికీ నచ్చుతుంది.
- ఇప్పటివరకూ సినిమా చూసిన అందరికీ బాగా నచ్చింది. మైత్రీమూవీ మేకర్స్ వారు, కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ చూశారు. అందరికీ చాలా నచ్చింది. వారు చెబుతున్న ఒక్కొక్క ఎలిమెంట్ నాకు చాలా కిక్ ఇచ్చింది.
- మహేష్‌బాబుకి ట్రైలర్ చాలా బాగా నచ్చింది. రిలీజ్ డే సినిమా చూస్తానని చెప్పడం ఆనందంగా ఉంది. ఇదే బ్యానర్‌లో నా నెక్ట్స్ ప్రాజెక్ట్ ఉంటుంది. వాటి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను.

5 భాషల్లో ఎం4ఎం



దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల 'ఎం4ఎం' (మోటీవ్ ఫర్ మర్డర్) అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత దిల్ రాజు అమెరికాలోని కాలిఫోర్నియా ఫ్రీమాంట్‌లో ఉన్న సినీలాంజ్ సినిమాస్ వెండితెరపై విడుదల చేసి అభినందించారు.
టీజర్ చాలా ఆసక్తికరంగా ఉందని, ప్రేక్షకులకు రీచ్ అవుతుందని చిత్రయూనిట్‌ని అభినందించారు. సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటించిన నటించిన ఈ చిత్ర టీజర్ హై స్టాండర్డ్ విజువల్స్‌తో, క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో అందరినీ ఆకట్టుకునేలా కనిపిస్తోంది. ముఖ్యంగా జో శర్మ యాక్షన్ మరింత అట్రాక్షన్‌గా నిలిచిందని చిత్రయూనిట్ తెలిపింది.
ఈ చిత్రాన్ని మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై అమెరికన్ కంపెనీ మెక్‌విన్ గ్రూప్‌తో కలిసి నిర్మించింది. త్వరలోనే ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో విడుదలకు సిద్ధం కానుంది.

వరదరాజు గోవిందం


రవి జంగు, ప్రీతి కొంగన

వి.సముద్ర దర్శకత్వంలో రవి జంగు, ప్రీతి కొంగన హీరో, హీరోయిన్లుగా శివమహాతేజ ఫిలిమ్స్, వి.సముద్ర మూవీస్ బ్యానర్లు పై విజయలక్ష్మీ సమర్పణలో వి.సాయిఅరుణ్ కుమార్ నిర్మించిన చిత్రం 'వరదరాజు గోవిందం'.
ఆరు భాషల్లో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కించారు. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం ఆగస్టులో రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్ రిలీజ్ వేడుక వైభవంగా జరిగింది.
దర్శక, నిర్మాత వి.సముద్ర మాట్లాడుతూ, 'కృష్ణుడు బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఎన్టీఆర్, రవితేజ లాగా హీరో రవి జంగు ఫుల్ ఎనర్జిటిక్‌గా చేశాడు. ఈ సినిమా తనకి మంచి బ్రేక్ అవుతుంది. హీరోయిన్ ప్రీతి చక్కగా కోపరేట్ చేస్తూ.. అద్భుతంగా చేసింది. చాలా గొప్ప కథ ఇది. భారతదేశం గర్వించదగ్గ సినిమా అవుతుంది. నా కెరీర్‌లో సింహరాశి, శివరామరాజు, ఎవడైతే నాకేంటి' ఎంత పెద్ద హిట్ అయ్యాయో ఈ సినిమా కూడా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది' అని చెప్పారు.

రవితేజ 75వ చిత్రం ప్రారంభం


రవితేజ, శ్రీలీల

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి రవితేజ 75వ చిత్రాన్ని ప్రొడక్షన్ నెంబర్ 28గా నిర్మిస్తోంది. యువ రచయిత భాను బోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మంగళవారం ఉదయం 07:29 గంటలకు పూజా కార్యక్రమంతో మేకర్స్ అధికారికంగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ముహూర్తపు షాట్‌కి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను బోగవరపు దర్శకత్వం వహించారు. నేటి నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది.
శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ ఈ చిత్రంలో హాస్యంతో కూడిన మాస్ పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం వెల్లడించింది. వినోదంతో కూడిన పూర్తిస్థాయి మాస్ పాత్రలో రవితేజను చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంతో అభిమానుల కోరిక నెరవేరుతుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.
'వాల్తేరు వీరయ్య'కి మాటల రచయితగా, 'సామజవరగమన'కు కథ, స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు భాను బోగవరపు. బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు. ఈ చిత్రంతో ఆయన అదిరిపోయే మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. రవితేజ-శ్రీలీల జోడి గతంలో 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ హిట్ అందించారు. అలాగే ఆ సినిమా విజయంలో కీలకపాత్ర పోషించిన సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి కూడా సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, కూర్పు: నవీన్ నూలి, సంభాషణలు: నందు సవిరిగాన, కళ: నాగేంద్ర తంగాల.

డిఫరెంట్ థ్రిల్లర్



చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాష్ దంతులూరి . దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. ఈ నెల 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్, దర్శకుడు సందీప్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ,'హీరో నవదీప్ యాక్టింగ్ చేస్తే రొమాన్స్ ఎక్కువ, నిర్మాతగా చేస్తే వయిలెన్స్ ఎక్కువ అని అర్థమైంది. ఈ సీస్పెస్ అనే సంస్థతో నిర్మాతగా ప్రతిభ ఉన్న వారికి నవదీప్ మంచి ఫ్లాట్‌ఫామ్ క్రియేట్ చేశాడు. ఈ సినిమా ద్వారా మహిళా సంగీత దర్శకురాలు, మహిళా ఎడిటర్ ఫీమేల్ ఓరియెంటెడ్ చిత్రానికి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ చిత్రం అందరికి మంచి బ్రేక్ ఇవ్వాలి' అని అన్నారు.
'మంచి ఇంటెన్స్‌తో నిజాయితీగా చేసిన సినిమా ఇది. రెగ్యులర్ సినిమాలు కాకుండా ఎప్పుడూ డిఫరెంట్ సినిమాలు, వైవిధ్యమైన పాత్రల కోసం చాందిని తపన పడతుంది. ఈ సినిమా తనకి మంచి పేరు తీసుకొస్తుంది' అని నిర్మాత, నటుడు నవదీప్ చెప్పారు. దర్శకుడు ప్రకాష్ దంతులూరి మాట్లాడుతూ,'నా కథను, నా పాత్రను నమ్మి ఈ సినిమా చేసింది చాందిని. నవదీప్ మంచి సపోర్ట్ ఇచ్చారు. ఈ సినిమా చూసి సందీప్‌రాజ్ ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ మాలో ధైర్యాన్ని నింపింది. కీర్తన్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ఎంతో ప్లస్ అవుతుంది. అందరి సహకారంతో ఓ మంచి సినిమా తీశాం. ఇదొక ఇంట్రెస్టింగ్ ఎంటర్‌టైనింగ్ థ్రిల్లర్. తప్పకుండా అందరికి నచ్చుతుందే నమ్మకం' అని తెలిపారు.

రాజధాని రౌడీ రిలీజ్‌కి రెడీ


యశ్

సంతోష్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నిర్మాత సంతోష్ కుమార్ నిర్మాణంలో యశ్, షీనా హీరో, హీరోయిన్లుగా కె.వి.రాజు దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'రాజధాని రౌడీ'. ఈ చిత్రం ఈనెల 14న విడుదలకు సిద్ధమైంది.
ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ, 'మాదకద్రవ్యాలు, మద్యపానం బారినపడి నలుగురు యువకులు తమ జీవితాల్ని ఎలా నాశనం చేసుకున్నారు అనే కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. వినోదానికి, సందేశాన్ని జోడించి తెరకెక్కించారు. చెడు పరిణామాలను ఎత్తి చూపుతూ, ఆలోచన రేకెత్తించే ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా అద్భుతమైన నటన ప్రదర్శించారు. ముమైత్ ఖాన్ తన అందాలతో కనువిందు చేస్తారు. అర్జున్ జన్య అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇలాంటి మంచి చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు గర్వంగా ఉంది. అత్యధిక థియేటర్లలో ఈనెల 14న విడుదల చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులందరు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

మెప్పించే బేవార్స్‌గాడు


వివారెడ్డి, శ్రీధర్

శ్రీ శోభా క్రియేషన్స్ పతాకంపై హర్షవర్ధన్, నిహారిక హీరో, హీరోయిన్లుగా బి.వి.అంజనీ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'బేవార్స్ గాడు'. రెండు షెడ్యూల్స్‌ని కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసుకుని, ప్రస్తుతం హైదరాబాద్ చుట్టు పక్కల చివరి షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది.
ఈ సందర్భంగా దర్శకుడు బి. వి. అంజనీ ప్రసాద్ మాట్లాడుతూ,'ఈ షెడ్యూల్‌తో పాటల చిత్రీకరణ మినహా టాకీపార్ట్ పాటు పూర్తవుతుంది. కీలక పాత్రలో సుమన్ నటిస్తున్నారు. గత జన్మలో కన్నతల్లి చావుకు కారకుడైన కొడుకు. ప్రస్తుత జన్మలో ఆ కొడుకు మళ్లీ జన్మించి కన్నతల్లి రుణాన్ని ఎలా తీర్చుకున్నాడు అన్నదే ముఖ్య కథాంశం. సోషియో ఫాంటసీగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇందులోని 4పాటలు, 4 ఫైట్లు ప్రేక్షకుల్ని బాగా అలరిస్తాయి' అని అన్నారు.

ఆటలు

పాకిస్థాన్‌పై సూపర్ విక్టరీ సాధించిన ఉత్సాహంలో ఉన్న ఆతిథ్య అమెరికా.. పాక్‌ను తనదైన శైలిలో మళ్లీ చిత్తుగా ఓడించిన భారత్ నేడు ముఖాముఖికి సిద్ధమయ్యాయి. మెరుపు విజయాలు నమోదు చేసిన అమెరికా సూపర్8 బెర్త్‌పై కన్నేయగా.. గ్రూప్‌లో అగ్రస్థానంతో సూపర్ 8కు చేరుకోవాలని రోహిత్ శర్మ భావిస్తోంది. సంచలన జట్టు అమెరికా మరో వండర్‌పై ఆశలు పెట్టుకోగా.. టీమ్ ఇండియా మరో ఏకపక్ష విజయంపై కన్నేసి బరిలోకి దిగుతోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్, అమెరికా పోరు నేడు.

భారత్‌కు ఎదురుందా?

నేడు అమెరికాతో టీమ్ ఇండియా ఢీ

- మరో సంచలనంపై ఆతిథ్య జట్టు ఆశలు
- ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-న్యూయార్క్

ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు భారత్‌తో పసికూన అమెరికా తొలిసారి ముఖాముఖి పోరుకు సిద్ధమైంది. ఆతిథ్య జట్టుగా టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించిన అమెరికా గ్రూప్-ఏలో ఇప్పటికే సంచలన విజయాలు నమోదు చేసింది. తొలి రెండు మ్యాచుల్లో విజయాలు సాధించి విమర్శకులను మెప్పించింది. నేడు అగ్రజట్టు టీమ్ ఇండియాతో పోరుకు సై అంటోంది. మరోవైపు భారత్ పసికూనతో పోరుకు సైతం పకడ్బందిగా సన్నద్ధమవుతుంది. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన రోహిత్ శర్మ నేడు మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని ఎదురుచూస్తున్నాడు. ఆతిథ్య అమెరికా అభిమానులు సహా భారత అభిమానులు ఎదురుచూస్తున్న క్రేజీ మ్యాచ్‌కు నేడు న్యూయార్క్‌లోని నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదిక కానుంది.



పంత్ ఒక్కడే.. : గ్రూప్-ఏలో భారత్ రెండు విజయాలు సాధించింది. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిలకడగా రాణించిన బ్యాటర్ రిషబ్ పంత్ ఒక్కడే. బంగ్లాదేశ్‌తో వార్మప్‌లోనూ పంత్ అర్థ సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఐర్లాండ్‌పై అర్థ సెంచరీ బాదినా.. పాక్‌తో మ్యాచ్‌లో నిరాశపరిచాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి రెండు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు. దీంతో ఓపెనర్ల నిలకడలేమి భారత్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సైతం అంచనాలను అందుకోవటం లేదు. రిషబ్ పంత్‌కు తోడుగా రోహిత్, కోహ్లి, సూర్య మెరిస్తే అమెరికా బౌలర్లకు నేడు న్యూయార్క్‌లో పగలే చుక్కలు కనిపిస్తాయి!. లోయర్ ఆర్డర్‌లో హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా బ్యాట్‌తో బాధ్యత తీసుకోవాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ చేయటం బాగా కలిసొచ్చింది. నాకౌట్ మ్యాచుల అవసరం కోసం అక్షర్ పటేల్‌ను అవసరమైతే నేడు సైతం ముందుగానే బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది. జశ్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ త్రయం జోరుమీదుంది. ఇక్కడ భారత్ ఇప్పటికే మూడు మ్యాచులు (వార్మప్‌తో కలిపి) ఆడటంతో నేడు మ్యాచ్‌లో పిచ్ స్వభావం, పరిస్థితులపై మంచి అవగాహనతోనే బరిలోకి దిగనున్నారు.



అమెరికాతో జాగ్రత్త! : ఆతిథ్య అమెరికాను తేలిగ్గా తీసిపారేయడానికి ఏమాత్రం వీలులేదు. పేరుకే అమెరికా జట్టు అయినా.. ఆ బృందంలో సగానికి పైగా భారత సంతతి క్రికెటర్లే ఉన్నారు. ఆరోన్ జోన్స్, మోనాంక్ పటేల్, ఆండ్రీస్ గౌస్, నితీశ్ కుమార్, మిలింద్ కుమార్, స్టీవెన్ టేలర్‌లు ఊపుమీదు న్నారు. కెనడా, పాకిస్థాన్‌లపై విజయాల్లో వీరి పాత్ర అమోఘం. నేడు భారత్‌తో మ్యాచ్‌లో మెరిసి ప్రపంచం దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు అమెరికా ప్రయత్నించనుంది. ఇక సొంతగడ్డపై ఆడుతున్న అమెరికాకు విచిత్రంగా అభిమానుల మద్దతు లభించటం కష్టమే. భారత అభిమానులో స్టేడియం నిండిపోనుండగా.. ఆతిథ్య జట్టు కాస్త వింత అనుభూతిని ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు.

యశస్వికి అవకాశం ఉందా? : భారత్ తొలి రెండు మ్యాచుల్లో తుది జట్టులో ఎటువంటి మార్పులు చేయలేదు. టాప్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి ఇంకా పరిస్థితులకు అలవాటు పడినట్టు అనిపించటం లేదు. సూర్యకుమార్ యాదవ్ సైతం టచ్‌లోకి రాలేదు. దీంతో టాప్ ఆర్డర్‌కు బలమైన మిడిల్ ఆర్డర్‌ను జోడించేందుకు బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు చేసే ఆలోచన ఉంది. యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో చేర్చేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉంది. పేస్ ఆల్‌రౌండర్ శివం దూబెను బెంచ్‌కు పరిమితం చేసి యశస్వి జైస్వాల్‌ను బ్యాటింగ్ లైనప్‌లో తీసుకోనున్నారు. సంజు శాంసన్ సైతం రేసులో నిలిచినా.. విరాట్ కోహ్లి ఫామ్ దృష్ట్యా జైస్వాల్‌కు మొగ్గు కనిపిస్తుంది. బౌలింగ్ విభాగంలో ఎటువంటి మార్పులు ఉండే అవకాశం లేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ జట్టుకు సమతూకం తీసుకొస్తున్నారు.

పిచ్, వాతావరణం : భారత్, అమెరికా మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. న్యూయార్క్ నాసా కౌంటీ స్టేడియం పిచ్ మరోసారి చర్చకు రానుంది. పిచ్ పగుళ్ల నుంచి పచ్చిక మొలకెత్తటంతో అదనపు సీమ్, బౌన్స్ లభిస్తుందని క్యూరేటర్ తెలిపాడు. నేడు మ్యాచ్‌కు పాత పిచ్‌నే వాడనున్నారు. దీంతో పరుగుల వేటలో బ్యాటర్లకు కాస్త ఉపశమనం కలిగే అవకాశం ఉంది. బౌలర్లకు అనుకూలించే పిచ్‌పై టాస్ నెగ్గిన జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపవచ్చు.

ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం : మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నట్టు చెప్పారు. హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వర్క్ షాప్‌ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై మంత్రి ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత వృద్ధి 7శాతం లోపే..!

- యూబీఎస్ వెల్లడి



న్యూఢిల్లీ : వచ్చే ఐదేండ్లలో భారత వృద్ధి రేటు 7శాతంలోపే ఉండొచ్చని స్విస్ బ్రోకరేజీ దిగ్గజం యూబీఎస్ పేర్కొంది. 2025-26 నుంచి 2029-30 మధ్య ప్రతీ ఏడాది సగటున 6.5-7 శాతం మధ్య వృద్ధి చోటు చేసుకోవచ్చని విశ్లేషించింది. బీజేపీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాకపోవడంతో మిత్రపక్షాల మద్దతుతో అధికారాన్ని చేపట్టిన ప్రధాన మంత్రి మోడీకి ఈ దఫా కీలక సంస్కరణలపై నిర్ణయం సవాలేనని యూబీఎస్ చీఫ్ ఎకనామిస్ట్ తన్వీ గుప్తా పేర్కొన్నారు. కాగా.. 2024-25లో భారత జీడీపీ 7.2 శాతంగా ఉండొచ్చని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. ఈ ఏడాది ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించక పోవచ్చని యూబీఎస్ చీఫ్ ఎకనామిస్ట్ జైన్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది రెపో రేటు అర శాతం తగ్గొచ్చన్నారు.

త్వరలోనే ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ..!

బెంగళూరు : ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ దరఖాస్తు చేసుకున్న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉందని ఆ వర్గాల సమాచారం. దీంతో దేశంలో ఐపీఓకు వెళ్తున్న ఈవీ స్టార్టప్‌గా ఓలా ఎలక్ట్రిక్ నిలువనుంది. ఇష్యూ కోసం డిసెంబర్ 22న దరఖాస్తు చేసుకుంది. ఈ ఇష్యూలో షేర్లను జారీ చేయడం ద్వారా రూ.5,500 కోట్ల నిధులు సేకరించాలని ఓలా ఎలక్ట్రిక్ లక్ష్యంగా పెట్టుకుంది.

డీసీఐవీ లాజిస్టిక్స్ నూతన సీఓఓ ముత్తు మారుతాచలం



చెన్నై : డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డీఐసీవీ) సబ్సీడరీ సంస్థ డైమ్లర్ ట్రక్ ఏజీ ప్రెసిడెంట్, చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ లాజిస్టిక్స్ హెడ్‌గా ముత్తుమారుతాచలం సి నియమితులయ్యారు. ఆయన నియామకం ఆగస్టు 15 నుంచి అమల్లోకి వస్తుందని ఆ కంపెనీ తెలిపింది. సంస్థ నుంచి వైదొలగిన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అన్షుమ్ జైన్ స్థానంలో ఆయన్ను తీసుకున్నట్లు తెలిపింది. ముత్తుమారుతాచలం 2009లో డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించారు.

శ్రీలంకలోని పిక్‌మితో ఫోన్‌పే భాగస్వామ్యం

న్యూఢిల్లీ : శ్రీలంకలో భారతీయ పర్యాటకులకు నిరంతరాయ యూపీఐ ఆధారిత క్యూఆర్ చెల్లింపులకు వీలు కల్పించేందుకు శ్రీలంకలోని ప్రముఖ రైడ్ హెయిలింగ్ (క్యాబ్ సర్వీసులు) ప్లాట్‌ఫారం పిక్‌మితో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని ఫోన్‌పే మంగళవారం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా బండారా నాయకే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులు బయటకు వచ్చిన మరుక్షణం నుంచి తమ పిక్‌మి రైడ్లపై క్యాష్‌లెస్ లావాదేవీల సౌకర్యం ద్వారా తమ ప్రయాణ అనుభవాన్ని మెరుగు పరచుకునేందుకు ఒక పెద్ద ముందడుగు పడిందని ఫోన్‌పే ఇంటర్నేషనల్ పేమెంట్స్ విభాగం హెడ్ రితేష్ పాయ్ తెలిపారు.

హయర్ కొత్త గ్రాఫైట్ రేంజ్ రిఫ్రిజిరేటర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ గృహోపకరణాల ఉత్పత్తుల సంస్థ హయర్ కొత్తగా గ్రాఫైట్ శ్రేణీ రిఫ్రిజరేటర్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. రెండు, మూడు డోర్ల వేరియంట్లలో వైఫై ఎనేబుల్డ్ స్మార్ట్ రేంజ్‌లో వీటిని డిజైన్ చేసినట్లు తెలిపింది. గ్రాఫైట్ సిరీస్‌పై పదేండ్ల కంప్రెసర్ వారంటీ, రెండేండ్ల ఉత్పత్తి వారంటీని అందిస్తోన్నట్లు పేర్కొంది. వీటి ప్రారంభ ధరను రూ.24,690గా నిర్ణయించింది.

వాట్సాప్‌లోనూ క్లెయిమ్ సెటిల్‌మెంట్

- హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో వెల్లడి

ముంబయి : వాట్సాప్ ద్వారా కూడా తక్షణ మోటార్ క్లెయిమ్‌ల పరిష్కారాన్ని ప్రారంభించినట్లు బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తెలిపింది. తన డిజిటల్ ఫస్ట్ విధానానికి అనుగుణంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ ప్రత్యేక చొరవ తమ వినియోగదారులకు అవాంతరాలు లేని సేవలను అందించేందుకు, సాంకేతికతను వినియోగించుకోవడంలో కంపెనీ చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శమని ఆ సంస్థ డైరెక్టర్ పార్థనిల్ ఘోష్ తెలిపారు.

రామ్కీ ఇన్‌ఫ్రాకు ఫిక్కీ అవార్డు

హైదరాబాద్ : రామ్కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అవార్డు దక్కింది. ఫిక్కీ స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డు 2024లలో "సస్టెయినబుల్ సిటీస్" విభాగంలో ఈ ప్రశంసను పొందినట్లు రామ్కీ ఇన్‌ఫ్రా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ గుర్తింపు హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌లో ఉన్న లీచేట్ శుద్ధి వినూత్న పరిష్కారాలకు గుర్తింపు అని తెలిపింది. దేశంలోని స్మార్ట్ సిటీల మిషన్ కోసం పని చేస్తున్న 98 ఎంట్రీల నుంచి గుర్తింపు పొందిన 10 సంస్థల్లో రామ్కీ ఒకటిగా నిలిచిందని ఆ సంస్థ ఎండీ వైఆర్ నాగరాజ పేర్కొన్నారు.

'రవాణా' రెవెన్యూ పెంచండి

- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేయండి
- కార్లకు బ్లాక్ ఫిల్మ్ ఉంటే చలాన్లు వేయండి
- చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలి
- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖ ఆదాయాన్ని పెంచేందుకు చట్టపరిధికి లోబడి ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేయాలని ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. చెక్‌పోస్టుల్ని బలోపేతం చేయడం ద్వారా అక్రమ రవాణాను అరికట్టొచ్చనీ, స్కూళ్లు రీఓపెన్ అవుతున్నందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేపట్టాలని చెప్పారు. కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు ఉంటే చలాన్లు విధించాలనీ, ఓవర్‌లోడ్‌ను అనుమతించొద్దని అన్నారు. పన్ను వసూళ్లను వందశాతం చేయాలనీ, విధినిర్వహణలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. మంగళవారంనాడాయన బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు పాల్గొన్నారు. త్రైమాసిక టాక్స్ వసూళ్ళను తక్కువగా నమోదు చేసిన ఆయా జిల్లాల అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. వందశాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి హాజరకాని అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని ఆదేశించారు. ప్రయివేటు భవనాల్లో నడుస్తున్న రవాణాశాఖ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం కోసం భూమిని పరిశీలించాలనీ, ముఖ్యమంత్రితో చర్చించి ఆయా భూముల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఆదాయం పెంచమందనే కారణాన్ని సాకుగా తీసుకొని, విచక్షణా రహితంగా వేధించొద్దనీ, చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు.

భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- కష్టాలు ఎదురైతే విరామమివ్వాలే తప్ప వెనుకడుగు వేయొద్దు
- తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవంలో.. : తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ములుగు

2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యమవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18శాతంపైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకు ప్రభుత్వం సహజ, సేంద్రీయ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70శాతంపైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే నని, 82 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని అన్నారు. విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వొచ్చు కానీ వెనుకడుగు వేయవద్దని సూచించారు.

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూపర్ ఎకానమిక్ పవర్‌గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రెసిషన్ ఫార్మింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని సూచించారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడేండ్లలోనే పూర్తవుతుందని తెలిపారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని తెలిపారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని చెప్పారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు.

ముందుగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్రీమతి బి. నీరజ ప్రభాకర్ స్వాగతోపన్యాసం చేశారు. అలాగే అభివృద్ధి నివేదికనూ పెట్టారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలానగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపుతోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్‌పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి గురించి వివరించారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అందించేందుకు ఉద్యానదర్శినిని అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలను ప్రధానం చేశారు. యూనివర్సిటీలోని 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆరుగురికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డీఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథుర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడిశా నూతన సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

నేడు ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్: ఒడిశాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కనక్ వర్ధన్ సింగ్ డియో, ప్రవతి పరిదా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. భువనేశ్వర్‌లో జరిగిన బీజేపీఎల్పీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోగా సీఎం పేరును కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు భూపేందర్ యాదవ్ పరిశీలకులుగా హాజరయ్యారు. కాగా, 2000, 2004లో సంకీర్ణ ప్రభుత్వంలో బీజేడీతో కలిసి బీజేపీ భాగస్వామిగా ఉంది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒడిశాలో తొలిసారిగా బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ రాష్ట్రంలో బీజేపీ సీనియర్ నేతల్లో మాఝీ ఒకరు. 1997-2000 వరకు సర్పంచ్‌గా పని చేసిన ఆయన.. 2000లో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009, 2019తోపాటు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కియోంజర్ స్థానం నుంచి విజయం సాధించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత రాష్ట్రంలో కొత్త సీఎంగా మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్‌లో బుధవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, ప్రముఖులు హాజరు కానున్నారు.

సీఎం ఇంటి వద్ద గురుకుల అభ్యర్థుల నిరసన

తీన్మార్ మల్లన్న అడ్డగింత..నినాదాలు

నియామకాల్లో న్యాయం చేయాలని డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గురుకుల నియామకాల్లో అవకతవకలు జరగాయంటూ ముఖ్యమంత్రి నివాసం ముందు గురుకుల అభ్యర్థులు నిరసన చేపట్టారు. మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్దకు మంగళవారం పెద్ద సంఖ్యలో చేరుకున్న గురుకుల అభ్యర్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని, గురుకుల బోర్డు వల్ల తాము నష్టపోయామని ఆరోపించారు. బోర్డు చేసిన తప్పులను తమపై రుద్దొద్దని, సరైన పద్ధతిలో నియామక ప్రక్రియ జరగకపోవడంతోనే ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. దాంతో చాలా మంది నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాము కోర్టుకు వెళ్తే.. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయినా తమకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అని సాగదీశారని, ఇప్పుడు స్కూళ్లు కూడా ప్రారంభమవుతున్నాయని తమకు ఇంకెప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. వెంటనే తమకు న్యాయం చేయాలని, లేదంటే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో అక్కడకి వచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వాహనాన్ని ఆందోళనకారులు అడ్డగించారు. దాంతో మల్లన్న వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.అనంతరం అభ్యర్థులకు పోలీసులు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

సీఎం నివాసాన్ని ముట్టడించిన నర్సింగ్ స్టాఫ్

అనంతరం రేవంత్ రెడ్డి నివాసాన్ని నర్సింగ్ స్టాఫ్ ముట్టడించింది. తమకు కొన్ని నెలలుగా వేతనాలు రావడం లేదంటూ ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. అగ్రి, ఫార్మా విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ఒక ర్యాంకుతోపాటు టాప్ 10లోపు తొమ్మిది ర్యాంకులను, ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో నాలుగు, ఏడు, ఎనిమిది, ర్యాంకులతోపాటు 10లోపు మూడు ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీచైతన్యదే ఆధిపత్యమని మరోసారి నిరూపించుకున్నామని వివరించారు. అగ్రి, ఫార్మాలో ఎల్లు శ్రీకాంత్ రెడ్డి మొదటి ర్యాంకు, పూల దివ్యతేజ రెండో ర్యాంకు, వడ్లపూడి ముకేష్ చౌదరి మూడో ర్యాంకు, పేర సాత్విక్ నాలుగో ర్యాంకు, అలూర్ ప్రణీత ఐదో ర్యాంకు, గట్టు బానుతేజ సాయి ఆరో ర్యాంకు, పి నిహారిక రెడ్డి ఏడో ర్యాంకు, శంబంగి మనోఅభిరాం ఎనిమిదో ర్యాంకు, శరగడం పావని తొమ్మిదో ర్యాంకును సాధించారని తెలిపారు. ఇంజినీరింగ్‌లో పలగిరి సతీష్ రెడ్డి నాలుగో ర్యాంకు, గొల్ల లేఖహర్ష ఏడో ర్యాంకు, పుట్టి కుశల్ కుమార్ ఎనిమిదో ర్యాంకులో నిలిచారని పేర్కొన్నారు. అగ్రి, ఫార్మాలో 100లోపు 50 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని వివరించారు. ఇంజినీరింగ్‌లో టాప్ 10లోపు మూడు ర్యాంకులు, వందలోపు 55 ర్యాంకులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి ఆమె అభినందనలు తెలిపారు.

అమెరికా నాసా కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య విజయకేతనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా నాసా ఎన్ఎస్ఎస్ ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్-2024లో శ్రీచైతన్య స్కూల్ విజయకేతనం ఎగురవేసింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఈ కాన్ఫరెన్స్‌కు ప్రపంచ నలుమూలల నుంచి సుమారు 30 దేశాలకు చెందిన వందల మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. వారిలో 167 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే ఉన్నారని అన్నారు. అమెరికా నాసా ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో భారతదేశం నుంచి 28 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో 639 మంది శ్రీచైతన్య విద్యార్థుల భాగస్వామ్యంతో 62 ప్రాజెక్టులను గెలిచి 11వ సారి ప్రపంచ నెంబర్‌వన్ చాంపియన్ నిలిచామన్నారు. మొదటి బహుమతులు ఏడు ప్రాజెక్టులు, రెండో బహుమతులు 11 ప్రాజెక్టులు, మూడో బహుమతులు 15 ప్రాజెక్టులు, హానరబుల్ మెన్షన్ కింద 29 ప్రాజెక్టులు సాధించాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచి 35 మంది విద్యార్థులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారని అన్నారు. శ్రీచైతన్యకు చెందిన ఏకైక విద్యార్థి ఆర్టిస్టిక్ మెరిట్ కేటగిరీలో 500 డాలర్ల బహుమతిని అందుకున్నారని చెప్పారు.

సమాచార కమిషనర్ల నియామాకానికి దరఖాస్తుల స్వీకారం

నోటిఫికేషన్ జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి తెలంగాణ ప్రభుత్వం మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సర్క్యూలర్ జారీ చేశారు. అర్హులైన వారు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ కమిషనర్ల నియామాకానికి దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, నియామకాల ప్రక్రియ ముందుకు కదలలేదు. కొత్తగా ఏర్పడ్డ రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత వరుసగా వచ్చిన ఎన్నికల నేపథ్యంలో సబంధిత నియామకాల్లోనూ జాప్యం జరిగింది. తాజాగా ఎన్నికల కోడ్ ఎత్తేసిన నేపథ్యంలో ప్రభుత్వం కమిషనర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

12 వేల కేసులు పెండింగ్

తెలంగాణ సమాచార కమిషన్‌లో 2017 నుంచి 12 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో నాలుగు వేలు ఫిర్యాదులు కాగా, ఎనిమిది వేల అప్పీళ్లున్నాయి. పలు కేసుల్లో ఆర్డర్లిచ్చినా అధికారులు వాటిని అమలు చేయకపోవడంతో ఫిర్యాదుదారులు తిరిగి ఆర్టీఐ కమిషన్ తలుపు తడుతున్నారు. ఆరేండ్లుగా వాయిదాలు పడుతున్నాయే తప్ప ఓ పట్టాన తెగడం లేదు. ఏడాదిగా కమిషనర్లు లేక పోవడం, సమాచారం ఇవ్వాల్సిన శాఖలు కుంటి సాకులు చెప్పడం తదితర కారణాలు వెరసి కేసుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. కొన్ని విభాగాలకు చెందిన వారు కమిషన్ విధించిన అపరాధ రుసుం చెల్లిస్తున్నారే తప్ప సమాచారం ఇవ్వడం లేదు. దాంతో బాధితులు కోర్టు మెట్లెక్కుతున్నారు. తాజాగా తెలంగాణ సర్కార్ కమిషనర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడంతో త్వరలో పెండింగ్ కేసులకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు.

పురపాలక సంఘాలకు అధికారాలు బదలాయించాలి

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పురపాలక సంఘాలకు వెంటనే అధికారాలను బదలాయించాలని తెలంగాణ మున్సిపల్ ఛాంబర్స్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గల ఛాంబర్స్ కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మెన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో కొత్తగా చట్టం తీసుకొచ్చి పురపాలక సంఘాలకున్న అధికారాలన్ని ప్రభుత్వాధికారులకు అప్పగించి పాలకవర్గాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గత సర్కార్ చేసిన నిర్వాకం వల్ల మున్సిపాల్టీల ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాధక్క మరణం పట్ల న్యూడెమోక్రసీ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట యోధురాలు సీపీఐ(ఎంఎల్) సీనియర్ నాయకురాలు రాధక్క అలియాస్ అక్కినేని నిర్మల మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగా గోదావరి లోయ విప్లవ ప్రతిఘటనా పోరాటంలో ముఖ్య భూమికను పోషించారని తెలిపారు. నమ్మిన విప్లవ రాజకీయాల కోసం దృఢంగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

లిబరేషన్ సంతాపం

సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటనోద్యమ నాయకురాలు రాధక్క మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు నైనాల శెట్టి మూర్తి సంతాపం ప్రకటించారు. ఆరు దశాబ్దాలకు పైగా ఆమె విప్లవోద్యమ జీవితం గడిపారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు ఎదిగారని పేర్కొన్నారు. ఆమె మృతి విప్లవోద్యమానికి తీరనిలోటని వివరించారు.

ప్రపంచ గమనం

గాజాలో కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్య సమితి తీర్మానానికి హమాస్ మద్దతు



గాజాలో కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానానికి హమాస్ అంగీకరించినట్టు పాలస్తీనా మిలిటెంట్ సంస్థ సోమవారం ప్రకటించింది. అమెరికా మద్దతుతో భద్రతామండలి తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి అనుకూలంగా 14 ఓట్లు వచ్చాయి. రష్యా గైర్హాజరైంది. వాషింగ్టన్ ఆదివారం ముసాయిదా పాఠాన్ని ఖరారు చేసింది. "భద్రతా మండలి తీర్మానంలో చేర్చిన విషయాలైన గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, పూర్తి ఉపసంహరణ, ఖైదీల మార్పిడి, పునర్నిర్మాణం, స్థానభ్రంశం చెందిన వారు నివాస ప్రాంతాలకు తిరిగి రావడం, ఏదైనా జనాభా మార్పు లేదా తగ్గింపును తిరస్కరించడం వంటి చర్యలను హమాస్ స్వాగతించింది"అని రాయిటర్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. "మా ప్రజల డిమాండ్లు, ప్రతిఘటనకు అనుగుణంగా ఉండే సూత్రాల"ను అమలు చేయడంపై ఇజ్రాయెల్‌తో పరోక్ష చర్చల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించింది.వైట్‌హౌస్ ప్రకారం, కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ఇప్పటికే అంగీకరించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మూడు దశల ప్రణాళికను ప్రారంభించడం ఇజ్రాయెల్ ఆలోచన అని పేర్కొన్నాడు. ఐక్యరాజ్య సమితి తీర్మానం రెండు వైపులా "ఆలస్యం లేకుండా, షరతులు లేకుండా దాని నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని" పిలుపునిచ్చింది. ప్రతిపాదన మొదటి దశ పోరాటంలో ఆరు వారాల "విరామం" కలిగి ఉంటుంది. ఈ సమయంలో ఇజ్రాయెల్, హమాస్ చర్చలు ప్రారంభించాలి. ఆరు వారాల పాటు చర్చలు కొనసాగితే, చర్చలు కొనసాగుతున్నంత కాలం కాల్పుల విరమణ కొనసాగుతుందని ఐక్యరాజ్య సమితి తీర్మానంలో పేర్కొంది.ఇజ్రాయెల్ గాజాలోని జనావాస ప్రాంతాల నుంచి ఉపసంహరించుకోవాలని, హమాస్ నిర్బంధంలో ఉన్న కొంతమంది బందీలకు బదులుగా కొంతమంది పాలస్తీనా ఖైదీలను విడిపించాలని భావిస్తున్నారు. రెండవ దశలో మిగిలిన సజీవ బందీలందరూ తిరిగి రావడాన్ని చూస్తారు. అయితే మూడవ దశలో చనిపోయిన బందీల మృతదేహాలను అప్పగించటం, గాజా కోసం అమెరికా నేతృత్వంలోని "ప్రధాన పునర్నిర్మాణ ప్రణాళిక" ఉంటుంది.

ఎన్నికల గందరగోళంతో

దెబ్బతిన్న యూరోపియన్ మార్కెట్లు

యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ ఎన్నికల ప్రారంభ ఫలితాలు, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ముందస్తు ఎన్నికలకు పిలుపు ఇవ్వాలనే ఆశ్చర్యకరమైన నిర్ణయంపై ట్రేడర్లు స్పందించడంతో సోమవారం యూరోపియన్ స్టాక్‌లు పడిపోయాయి. యూరోపియన్ యూనియన్ పార్లమెంటరీ ఎన్నికలు నాలుగు రోజుల ఓటింగ్ తర్వాత ఆదివారం ముగిశాయి. ఎగ్జిట్‌పోల్స్ తీవ్రమితవాద, కన్జర్వేటివ్ పార్టీలకు మద్దతు ఉంటుందని సూచించాయి. మాక్రాన్‌కు చెందిన మధ్యేవాద పునరుజ్జీవనోద్యమ కూటమిని మెరైన్ లే పెన్‌కు చెందిన మితవాద రైట్ నేషనల్ ర్యాలీ బృందం ఓడించింది.సోమవారం ఫ్రాన్స్‌లోని సీఏసీ 40 స్టాక్ ఇండెక్స్ ఫిబ్రవరి నుంచి దాని కనిష్ట స్థాయి 2 శాతానికి పడిపోయింది. ఫ్రెంచ్ పార్లమెంట్ దిగువసభ అయిన నేషనల్ అసెంబ్లీని రద్దు చేస్తున్నట్లు ఆదివారం మాక్రాన్ ప్రకటించిన తర్వాత సాధారణ ఎన్నికలకు పిలుపునిచ్చాడు. సొసైటీ జనరల్, బీఎన్ పి పారిబాస్ షేర్లు వరుసగా 7.8 శాతం, 4.7 శాతం క్షీణించడంతో ముఖ్యంగా దేశంలోని బ్యాంకులు, యుటిలిటీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాన్-యూరోపియన్ స్టాక్స్ 600 ఇండెక్స్ 0.4 శాతం క్షీణించింది. నిర్మాణ స్టాక్స్ నష్టాలకు దారితీసి 1.5 శాతం పడిపోయింది. ఈ వార్తల నేపథ్యంలో బ్రిటీష్ పౌండ్‌తో పోలిస్తే యూరో 0.6 శాతం ఒక నెల కనిష్టానికి, డాలర్‌తో పోల్చినప్పుడు 1.0733 అయింది. అంటే 0.4 శాతానికి పడిపోయింది.ఫ్రాన్స్‌లో, గతంలో లె పెన్ నేతృత్వంలోని మితవాద నేషనల్ ర్యాలీ పార్టీ 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను పొందింది. అయితే మాక్రాన్ పునరుజ్జీవనోద్యమ పార్టీకి కేవలం 15 శాతం మాత్రమే ఓట్లు రావటంతో ఆయన ముందస్తు సాధారణ ఎన్నికలకు పిలుపునిచ్చాడు. "ఫ్రాన్స్‌లో ప్రకటించిన ముందస్తు ఎన్నికలు ఆర్థిక మార్కెట్ల చుట్టూ తిరుగుతున్న అనిశ్చిత ఆటుపోట్లకు తోడ్పడ్డాయి" అని స్టాక్ బ్రోకర్ హార్గ్రీవ్స్ లాన్స్‌డౌన్‌లోని డబ్బు,మార్కెట్ల అధిపతి సుసన్నా స్ట్రీటర్ ఏజన్స్ ఫ్రాన్స్ ప్రెస్(ఏఎఫ్ పి) కి చెప్పింది. "ఫ్రాన్స్, జర్మనీ రెండింటిలోనూ యూరోపియన్ యూనియన్ ఎన్నికల సమయంలో ఓటర్లు మూకుమ్మడిగా తీవ్రమితవాదం వైపుకు మారిన తర్వాత ఆయన చేజారుతున్న అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంగా పెట్టుబడిదారులు మాక్రాన్ ఆడుతున్న జూదాన్ని అంచనా వేస్తున్నారు" అని ఆమె చెప్పింది.

ఫ్రాన్స్ కొత్త జాతీయ అసెంబ్లీకి జూన్ 30న, రెండవ రౌండ్ జూలై 7న పోలింగ్ జరగనుంది.

జర్మనీలో, ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ నాయకత్వంలోని సెంట్రిస్ట్ పార్టీ అంచనాల ప్రకారం 14 శాతం ఓట్లతో ఎన్నడూ లేనంత చెత్త ఫలితాన్ని సాధించింది. జర్మనీలో తీవ్ర మితవాద ఆల్టర్నేటివ్ (ఏఎఫ్ డి) పార్టీ 15 శాతం ఓట్లతో రెండవ స్థానంలో నిలిచిందని అంచనా వేశారు. ఇది సెంటర్-రైట్ సీడీయూ-సీఎస్ యూ కూటమి కంటే వెనుకబడి ఉంది. ఇది దాదాపు 30 శాతం గెలుచుకున్నట్టు అంచనా వేశారు. వార్తల వెలుగులో జర్మనీ లోని డాక్స్ సోమవారం 1 శాతం పడిపోయింది. ఇటలీ, ఆస్ట్రియాల్లోనూ మితవాద పార్టీలు గెలిచాయి.

గ్రూప్-2,3 పోస్టులను పెంచండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సత్యం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రూప్-2 ఎక్సైజ్ ఎస్సై ఎత్తు 167.6 నుంచి 165కు తగ్గించాలని సూచించారు. టెట్ ఫలితాలను నార్మలైజేషన్ విధానం చేసి ప్రకటించాలని తెలిపారు. డీఎస్సీ రాతపరీక్షలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని పేర్కొన్నారు.